ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం 13.07.2024 | సంపుటి : 11 సంచిక : 02 | పేజీలు : 12 వెల: రూ. 4/-
RNI NO.APTEL / 2013 /50370








## హైదరాబాద్‌లో టి స్క్వేర్

- రాయదుర్గంలోని నాలెడ్జ్ సిటీ సమీపంలో నిర్మాణం
- రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం

హైదరాబాద్(జనంసాక్షి): రాయదుర్గంలోని నాలెడ్జ్ సిటీ సమీపంలో భారీ ప్లాజా నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం నిరయించింది. రాష్ట్ర పరిశ్రమలు మౌలిక సదుపాయాల సంస్థ ఆధ్వర్యంలో టి స్క్వేర్ నిర్మాణానికి ప్రణాళిక రూపొందించారు. ఈమేరకు టీజీఐఐసీ

మిగతా 2లో..

## విశ్వాస పరీక్షలో 'ప్రచండ' ఓటమి



కాఠ్‌మాండూ(జనంసాక్షి): అస్థిర రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిన నేపాల్‌లో మరోసారి కీలక పరిణామం చోటుచేసుకుంది. ప్రభుత్వంపై పెట్టిన అవిశ్వాస తీర్మానంలో

మిగతా 2లో..



జాతీయ విపత్తుల నిర్వహణ చట్టానికి అనుగుణంగా హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ ప్రొటెక్షన్ (హైడ్రా) రూపుదిద్దుకోవాలి. దీని వ్యవస్థాగత నిర్మాణం, విధి విధానాలపై మరింత అధ్యయనం చేసి కసరత్తు చేయాలి. జీహెచ్ఎంసీతో పాటు ప్రధాన శాఖలన్నింటితోపాటు పోలీసు విభాగాలను సమన్వయం చేసుకుని వ్యవస్థను పటిష్టపరచాలి. అవసరమైతే అందుకు అనుగుణంగా పునర్ వ్యవస్థీకరించుకోవాలి. జీహెచ్ఎంసీతో పాటు ఓఆర్ఆర్ వరకు 2 వేల కి.మీల పరిధిలో హైడ్రా పని చేయాల్సి ఉంటుంది

– సీఎం రేవంత్

# 'హైడ్రా'పై మరింత లోతుగా కసరత్తు చేయాలి

## ప్రజలకు విస్తృత సేవలందించాలి

- ఇది బలమైన వ్యవస్థగా రూపుదిద్దుకోవాలి
- ఇందుకోసం సంబంధిత శాఖలన్నీ పరస్పరం సమన్వయం చేసుకోవాలి
- నాలాలు, చెరువులు, ప్రభుత్వ స్థలాల ఆక్రమణలపై కఠిన చర్యలు తీసుకోవాలి
- అధికారులతో సమీక్షలో సీఎం రేవంత్ ఆదేశాలు

హైదరాబాద్(జనంసాక్షి): హైదరాబాద్ సిటీ విస్తరణకు అనుగుణంగా ప్రజలకు విస్తృత సేవలను అందించేలా హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ ప్రొటెక్షన్ (హైడ్రా) రూపుదిద్దు కోవాలని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి అన్నారు. జాతీయ విపత్తుల నిర్వహణ చట్టానికి అనుగుణంగా ఈ కొత్త వ్యవస్థను ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. హైడ్రా వ్యవస్థాగత నిర్మాణం, విధి విధానాలపై మరింత అధ్యయనం చేసి కసరత్తు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. జీహెచ్ఎంసీతో పాటు, హెచ్ఎండిఏ, వాటర్ బోర్డు, విజిలెన్స్, ట్రాఫిక్, విద్యుత్తు, పోలీస్ విభాగాలను సమన్వయం చేసుకొని మరింత సమర్థంగా హైడ్రా పని చేసేలా ఉండాలని అధికారులకు ముఖ్యమంత్రి పలు సూచనలు చేశారు. ఇప్పుడున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ విజిలెన్స్ అండ్ డిజాస్టర్ మేనేజ్మెంట్ విభాగాన్ని అందుకు అనుగుణంగా పునర్ వ్యవస్థీకరించాలని ఆదేశించారు. కొత్త విభాగంలో ఏయే స్థాయి అధికారులుండాలి.. ఎంత మంది సిబ్బంది ఉండాలి.. ఏయే విభాగాలపై వీరిని డిప్యుటేషన్పై తీసుకోవాలి.. అనే అంశాలపై

మిగతా 2లో..

## 16న కలెక్టర్లు, ఎస్పీలతో ముఖ్యమంత్రి భేటీ

- ప్రజాపాలన, ధరణిపైనా చర్చ
- లా అండ్ ఆర్డర్, డ్రగ్స్ అరికట్టడంపై సమీక్ష
- విద్య, వైద్యం, వ్యవసాయానికీ ప్రాధాన్యం
- వన మహోత్సవం, మహిళాశక్తి క్యాంటీన్ల ఏర్పాటు

హైదరాబాద్(జనంసాక్షి): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన ఈ నెల 16న సచివాలయంలో జిల్లా కలెక్టర్లు, ఎస్పీల సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశానికి తొమ్మిది అంశాలతో కూడిన ఎజెండా ఖరారయ్యింది. 24 నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఈ సమావేశాలకు ప్రాధాన్యత సంతరించుకుంది. తొమ్మిది

మిగతా 2లో..

## నైనీ గనిలో సింగరేణి బొగ్గు తవ్వకాలకు

# ఒడిశా ఓకే

- సంస్థకు సహకరిస్తాం
- డిప్యూటీ సీఎం భట్టి వినతిపై ఆ రాష్ట్ర సీఎం మోహన్ చరణ్ మాంజీ సానుకూల స్పందన

ఒడిశా(జనంసాక్షి): ఒడిశాలోని నైనీ వద్ద సింగరేణి సంస్థ చేపట్టిన బొగ్గు గని ప్రాజెక్టులో తవ్వకాలు చేపట్టేందుకు సహకరించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క..ఒడిశా సీఎం మోహన్ చరణ్ మాంజీని కోరారు. దీనిపై స్పందించిన ఒడిశా సీఎం నైనీ బొగ్గు గనుల తవ్వకానికి పూర్తిగా సహకరిస్తాని భరోసా ఇవ్వడంతో పాటు, తగిన చర్యలు చేపట్టాలని ఆ రాష్ట్ర ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. నైనీ బ్లాక్‌లో సింగరేణి కార్యకలాపాల ప్రారంభానికి సంబంధించి ఎలాంటి అడ్డంకులు లేకుండా చూడాలని కోరేందుకు శుక్రవారం భట్టి విక్రమార్క.. అధికారుల బృందంతో కలిసి ఒడిశా సీఎంను ఆ రాష్ట్ర సచివాలయంలో కలిశారు. ఒడిశా ముఖ్యమంత్రికి డిప్యూటీ సీఎం భట్టి.. సింగరేణికి బొగ్గు బ్లాకుల ఆవశ్యకతను వివరించారు. 2017లోనే సింగరేణికి నైనీ గనులను కేటాయించారని తెలిపారు. తెలంగాణలో కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఈ విషయాలకు సంబంధించి గత ప్రభుత్వంలో నాటి బొగ్గు గనుల మంత్రి ప్రహ్లాద్ జోషిని కలిసి తాడిచర్ల బ్లాక్, నైనీ బ్లాక్‌లకు సంబంధించిన అడ్డంకులను తొలగించాల్సిందిగా విజ్ఞప్తి చేసినట్టు వివరించారు. నైనీ బ్లాకులో గనుల తవ్వకానికి పారిశ్రామిక, పర్యావరణ అనుమతులు సైతం వచ్చాయని తెలిపారు. అటవీ,

మిగతా 2లో..



## భారాసకు మరో షాక్

### కాంగ్రెస్‌లో చేరిన రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్

రాజేంద్రనగర్ భారాస ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ కాంగ్రెస్‌లో చేరారు. శుక్రవారం సాయంత్రం జూబ్లీహిల్స్‌లోని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాసానికి వచ్చిన ఆయన సీఎం సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యేతో పాటు ఆయన అనుచరులు కూడా కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డితో పలువురు నేతలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



నేడు హస్తం గూటికి ఎమ్మెల్యే అరికెపూడి 12లో

## ఎమర్జెన్సీని చీకటి దినంగానే చూస్తాం

### అమిత్‌షా ప్రకటన

న్యూఢిల్లీ(జనంసాక్షి): కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. దాదాపు 50ఏళ్ల క్రితం దేశంలో అత్యయిక స్థితిని విధించిన జూన్ 25వ తేదీని 'రాజ్యాంగ హత్యా దినం'గా ప్రకటించింది. ఈ మేరకు కేంద్రం శుక్రవారం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ విషయాన్ని హోం మంత్రి అమిత్ షా 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. 1975 జూన్ 25న అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ తన నియంతృత్వ పాలనతో దేశంలో అత్యయిక స్థితి విధించి ప్రజాస్వామ్యం గొంతు నులిమేశారు. ఎలాంటి కారణం లేకుండా

మిగతా 2లో..



# ప్రజాధనం సద్వినియోగం కోసమే ప్రజాభిప్రాయ సేకరణ

- వినతులన్నింటినీ అసెంబ్లీలో చర్చించి పథకం అమలు
- రైతులకు తాము ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తాం
- అర్హులైన రైతులకే పథకాలు అందాలన్నదే లక్ష్యం
- వనపర్తి అభిప్రాయ సేకరణలో మంత్రుల స్పష్టీకరణ

వనపర్తి(జనంసాక్షి): రైతులకు తాము ఇచ్చిన హామీలు అన్ని నెరవేర్చాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని రెవెన్యూ,సమాచార మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ప్రజాధనం సద్వినియోగం చేయాలనే రైతు భరోసాపై అభిప్రాయాలు సేకరిస్తున్నామన్నారు. రైతుభరోసాను అసలుసిసలు రైతులకే అమలు చేస్తామని అన్నారు. శుక్రవారం వనపర్తిలో రైతు భరోసాపై అభిప్రాయ సేకరణ కోసం మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావులతో కూడిన సబ్‌కమిటీ సమావేశమైంది. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ 'కొందరు నాయకులు, ప్రతిపక్షాలు రైతుభరోసాపై రైతులను రెచ్చగొట్టాలని చూస్తున్నాయి. దీన్ని తిప్పి కొట్టాలి. ప్రతిపక్షాలు కూడా మంచి సూచనలు చేస్తే బేషజాలు లేకుండా వాటిని

మిగతా 2లో..

## కాంగ్రెస్‌ది ఫిరాయింపుల పాలన

- గాంధీ భవన్‌కు.. తెలంగాణ భవన్‌కు తేడా లేదు
- ఆరు గ్యారెంటీల అమలులో కాంగ్రెస్ విఫలం
- భాజాపా కార్యవర్గ సమావేశంలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి



హైదరాబాద్(జనంసాక్షి): అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో కష్టపడి పని చేసి మంచి ఫలితాలు సాధించిన కార్యకర్తలకు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ అమరుల ఆకాంక్షలను నెరవేర్చేది భాజపా ఒక్కటేనని చెప్పారు. గాంధీ భవన్‌కు.. తెలంగాణ భవన్‌కు తేడా లేదని కాంగ్రెస్, భారాసలను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయడం లేదన్నారు. శంషాబాద్‌లో

### కేసీఆరే ఫిరాయింపులు చేయిస్తున్నాడు

అవినీతి నుంచి బయటపడేందుకే కాంగ్రెస్‌కు సహకరిస్తున్నాడు
కేంద్రమంత్రి బండి సంజయ్ సంచలన ఆరోపణలు

## సుప్రీంకోర్టులో కేజీవ్రాల్‌కు ఊరట

### లిక్కర్ కేసులో మధ్యంతర బెయిల్ మంజూరు



న్యూఢిల్లీ(జనంసాక్షి): సుప్రీంకోర్టులో కేజీవ్రాల్‌కు ఊరట లభించింది. ఆయనకు సుప్రీంకోర్టు మధ్యంతర బెయిల్‌ను మంజూరు చేస్తూ తీర్పును వెలువరించింది. ఢిల్లీ లిక్కర్ ఈడీ మనీ లాండరింగ్ కేసులో ఆయనకు ధర్మాసనం మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. అయితే, బెయిల్ కేసులో అరెస్టయి నందున ఆయన తిహార్ జైల్లోనే ఉండనున్నారు. ఢిల్లీ లిక్కర్ కేసులో తన అరెస్ట్ అక్రమం అని కేజీవ్రాల్ వేసిన పిటిషన్ ను విస్తృత ధర్మాసనానికి బదిలీ చేసినట్టు జస్టిస్ సంజీవ్ కన్నా ధర్మాసనం తెలిపింది. గత నెల 27వ తేదీన ఢిల్లీ లిక్కర్ కేసులో కేజీవ్రాల్‌ను సీబీఐ అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం తిహార్ జైల్లో కేజీవ్రాల్ ఉన్నారు. ఢిల్లీ మద్యం విధానం

మిగతా 10లో..

## ఫోన్ ట్యాపింగ్ నిందితులకు ఎదురుదెబ్బ

### బెయిల్ పిటిషన్లు కొట్టేసిన నాంపల్లి కోర్టు



హైదరాబాద్(జనంసాక్షి): ఫోన్ ట్యాపింగ్ కేసు నిందితులకు మరోసారి ఎదురుదెబ్బ తగిలింది. నాంపల్లి కోర్టులో నిందితులు దాఖలుచేసిన మ్యాండేటరీ బెయిల్ పిటిషన్లను న్యాయస్థానం కొట్టివేసింది. ఏ2 ప్రణీత్‌రావు, ఏ3 తిరుపతన్న, ఏ4 భుజంగరావు, ఏ5 రాధాకిషన్‌రావులకు కస్టడీ పూర్తయిందని, ఇప్పటివరకు ఛార్జిషీట్ నమోదు కానందున వారికి బెయిల్ ఇచ్చే అధికారం కోర్టుకు ఉందని నిందితుల తరఫు

మిగతా 2లో..

## ఫిరాయింపుల పాలనపై మాట్లాడే హక్కు బీఆర్ఎస్‌కు లేదు

### మంత్రి శ్రీధర్ బాబు



మంథని, (జనంసాక్షి) : ఫిరాయింపులపై మాట్లాడే నైతిక హక్కు బీఆర్ఎస్ పార్టీ నేతలకు లేదని రాష్ట్రానికి పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. పార్టీ ఫిరాయింపుల వ్యవహారంలో కాంగ్రెస్ పార్టీకి, బీఆర్ఎస్‌కు చాలా తేడా ఉం దన్నారు. గతంలో మా పార్టీ ఎమ్మెల్యేలను భయపెట్టి బీఆర్ఎస్

మిగతా 2లో..

# వలసలు కొనసాగుతాయ్



- త్వరలోనే కాంగ్రెస్‌లో బీఆర్ఎస్ఎల్పి విలీనం
- ఆ పార్టీలో ఇక మిగిలేది నలుగురు మాత్రమే
- కేసీఆర్ ఎమ్మెల్యేను పురుగుల్లా చూశాడు
- ఆయనను కలిసేందుకు కష్టాలు పడాల్సి వచ్చింది
- అహంకారం,నిరంకుశం ఉన్నచోట ఎవరూ ఉండరు
- కార్పోరేట్ కంపెనీలా మారిన బీఆర్ఎస్
- ఎమ్మెల్యే దానం నాగేందర్ సంచలన వ్యాఖ్యలు

హైదరాబాద్(జనంసాక్షి): త్వరలో బీఆర్ఎస్ఎల్పీ.. కాంగ్రెస్‌లోవిలీనం కాబోతోందని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కీలక వ్యాఖ్యలు చేశారు. అహంకారపూరిత, నిరంకుశ విధానాలతో నడిచే బిఆర్ఎస్ పార్టీకి మనుగడ లేదని, అందులో ఉన్న వారెవరూ అక్కడే ఉండాలనుకోవడం లేదని అన్నారు. అందుకే స్వేచ్ఛ కోసం కాంగ్రెస్‌లో చేరుతున్నారని అన్నారు. శుక్రవారం నాడు ఆదర్శనగర్ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో హిమాయత్ నగర్ డివిజన్‌కు సంబంధించిన కల్యాణలక్ష్మి, షాది ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... బీఆర్ఎస్ పార్టీలో మిగిలేది నలుగురు ఎమ్మెల్యేలు మాత్రమే అని చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని కేటీఆర్ కార్పొరేట్ కంపెనీ లాగా నడిపారని విమర్శించారు. కేసీఆర్‌ను కలవాలంటే ఎమ్మెల్యేలకు అపాయిట్మెంట్ కూడా దొరికేది కాదన్నారు. ఒకవేల దొరికినా,

మిగతా 2లో..

## గోపన్‌పల్లి ఫ్లైఓవర్ ప్రారంభించండి

### తెలంగాణ సర్కారుకు కేటీర్ విజ్ఞప్తి



హైదరాబాద్(జనంసాక్షి): గోపన్‌పల్లి ఫ్లైఓవర్ నిర్మాణం పూర్తయినప్పటికీ ఇంకా ప్రారంభించకపోవడం పట్ల బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. ఢిల్లీ బాసుల దగ్గరకు చక్కర్లు కొట్టడం, బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఇండ్లకు తిరగడంలో ముఖ్యమంత్రి బిజీగా ఉన్నారని విమర్శించారు. సమర్థ ప్రభుత్వం, అవగాహన లేని నాయకత్వం

మిగతా 2లో..



# జనాభా విస్ఫోటనం

## 2060 నాటికి దేశ జనాభా 170 కోట్లకు చేరిక : ఐరాస

ఐరాస(జనంసాక్షి): భారత జనాభా 2060 నాటికి 170 కోట్ల వద్ద గరిష్ఠానికి చేరుతుందని ఐక్యరాజ్య సమితి అంచనా వేసింది. తర్వాత 12 శాతం తగ్గుదల రేటుతో క్రమంగా దిగొస్తుందని తెలిపింది.అయితే, ఈ శతాబ్దం మొత్తం ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన దేశంగా భారత్ కొనసాగుతుందని పేర్కొంది. ఈమేరకు 'వరల్డ్ పాపులేషన్ ప్రాస్పెక్ట్స్ 2024' పేరిట గురువారం ఓ నివేదిక విడుదల చేసింది.వచ్చే 50-60 ఏళ్లలో ప్రపంచ జనాభా 1030 కోట్ల వద్ద గరిష్ఠానికి చేరుతుందని ఐరాస అంచనా వేసింది. అక్కడినుంచి దిగొస్తూ ఈ శతాబ్దం చివరకు 1020 కోట్లకు తగ్గుతుందని తెలిపింది. అత్యధిక జనాభా కలిగిన దేశంగా గత ఏడాది చైనాను దాటేసిన భారత్ 2100 సంవత్సరం వరకు అదే స్థానంలో ఉంటుందని పేర్కొంది. 2024లో మన దేశ జనాభా 145 కోట్లని అంచనా వేసింది. 2054 నాటికి అది 169 కోట్లకు చేరుతుందని తెలిపింది. ఆ తర్వాత క్రమంగా 150 కోట్లకు తగ్గుతుందని పేర్కొంది.ప్రస్తుతం చైనా జనాభా 141 కోట్లని.. 2054 నాటికి 121 కోట్లకు తగ్గుతుందని ఐరాస నివేదిక తెలిపింది. 2100 నాటికి అది 63.3 కోట్లకు చేరుతుందని అంచనా వేసింది. 2024-54 మధ్య ఆ దేశ జనాభాలో భారీ ఎత్తున తగ్గుదల నమోదవుతుందని తెలిపింది. తర్వాత జపాన్, రష్యాలోనూ జనాభా వేగంగా దిగొస్తుందని పేర్కొంది. సంతాన సాఫల్యత

మిగతా 10లో..



# నైనీ గనిలో సింగరేణి బొగ్గు తవ్వకాలకు ఒడిశా ఓకే

ప్రైవేటు భూములను సింగరేణికి బదలాయించాల్సిన అంశం పెండింగ్‌లో ఉందని, ఈ సమస్య పరిష్కారం అయితే సింగరేణి తవ్వకాలను ప్రారంభిస్తుందని చెప్పారు. నైనీ బ్లాక్‌లో తవ్వకాలు చేపట్టడం వల్ల ఒడిశా యువతకు పెద్ద సంఖ్యలో ఉపాధి, పన్నుల రూపంలో రూ.600 కోట్ల వరకు ఒడిశా సర్కార్‌కు ఆదాయం సమకూరుతుందని వివరించారు. దీంతో భూముల బదలాయింపు, విద్యుత్తు, రహదారుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని అక్కడి ఉన్నతాధికారులకు ఒడిశా సీఎం ఆదేశాలు జారీ చేశారు.

**విశ్వాస పరీక్షలో ప్రచండ ఓటమి**

ప్రస్తుత ప్రధాని పుష్ప కమల్ దహాల్ 'ప్రచండ' ఓటమిపాలయ్యారు.ప్రభుత్వానికి మద్దతుగా 63 మంది నిలవగా, వ్యతిరేకంగా 194 ఓట్లు వచ్చాయి. 275 సీట్లు కలిగిన నేపాల్ పార్లమెంటులో.. ప్రభుత్వ ఏర్పాటుకు 138 ఓట్ల మెజార్టీ అవసరం. మాజీ ప్రధాని కె.పి.శర్మ ఓలి నేతృత్వంలోని పార్టీ ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించుకోవడంతో ప్రస్తుత ప్రభుత్వం కూలిపోయినట్లయ్యింది.నేపాల్ ప్రధానిగా డిసెంబర్ 25, 2022లో పుష్ప కమల్ దహాల్ 'ప్రచండ' బాధ్యతలు చేపట్టారు. మాజీ ప్రధాని ఓలీ నేతృత్వంలోని కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ నేపాల్ యూనిఫైడ్ మార్క్సిస్ట్ లెనినిస్ట్‌తో కలిసి సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో ప్రచండ ఇప్పటికే మూడుసార్లు అవిశ్వాసం ఎదుర్కొన్నారు.అయితే, నేపాలీ కాంగ్రెస్‌తో ముందస్తుగా చేసుకున్న అధికార బదలాయింపు ఒప్పందం ప్రకారం ఆయన ప్రధానమంత్రి పదవి నుంచి తప్పుకోవాల్సి ఉంది. కానీ, అందుకు ప్రచండ నిరాకరించడంతో అవిశ్వాసం అనివార్యమైంది. నేపాలీ కాంగ్రెస్ 89 సీట్లతో అతిపెద్ద పార్టీగా నిలవగా, సీపీఎన్-యుఎంఎల్‌కు 78 మంది సభ్యుల బలం ఉంది. వీరిద్దరూ కలిసి సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు చేయనున్నారు. తదుపరి ప్రధానిగా ఓలి బాధ్యతలు చేపట్టేందుకు నేపాలీ కాంగ్రెస్ ఇప్పటికే అంగీకరించినట్లు సమాచారం. మొత్తంగా నేపాల్‌లో గడిచిన పదహారేళ్లలో 13 ప్రభుత్వాలు మారడం అక్కడి రాజకీయ అస్థిరతకు నిదర్శనం.

# నేపాల్‌లో ఘోర ప్రమాదం

**రెండు బస్సులపై విరిగిపడ్డ కొండచరియలు**
**నదిలో పడి 65 మంది గల్లంతు!**

**ఖాట్మండ్(జనంసాక్షి):**నేపాల్‌లో శుక్రవారం తెల్లవారుజామున ఘోర ప్రమాదం చోటుచేసుకొంది. నారాయణఘాట్-ముగ్‌లింగ్ జాతీయ రహదారిపై తెల్లవారుజామున 3.30 సమయంలో కొండ చరియలు విరిగి పడ్డాయి. ఆ సమయంలో భారీగా వర్షం కూడా కురుస్తోంది. దీంతో అదే మార్గంలో దాదాపు 65 మందికి పైగా ప్రయాణికులతో వెళ్తున్న రెండు బస్సులపై కొండచరియలు పడడంతో ఆ రెండు బస్సులు పక్కనే ఉన్న త్రిశూన్ నదిలో పడ్డాయి. గల్లంతైన వారిలో ఏడుగురు భారతీయులు కూడా ఉన్నట్లు సమాచారం. వీరు ప్రాణాలు కోల్పోయినట్లు వార్తలొస్తున్నాయి. కానీ,ఎటువంటి అధికారిక ధ్రువీకరణ రాలేదు. మరో బస్సుపై కొండచరియలు విరిగి పడటంతో డ్రైవర్ మృతి చెందాడు. 24 మంది ప్రయాణికుల తో ఓ బస్సు కాఠ్‌మాండూ వెళుతోంది. మరో బస్సులో 41 మంది ఉన్నట్లు గుర్తించారు. వీటిని గణపతి డీలక్స్, ఏంజెల్ బస్సులుగా గుర్తించారు. వీటిల్లో గణపతి డీలక్స్‌కు చెందినదిగా భావిస్తున్న బస్సు నుంచి ముగ్గురు ప్రయాణికులు తప్పించుకొన్నారు. బస్సు ప్రమాదానికి గురికాగానే వారు దానిలోనుంచి బయటకు దూకేసినట్లు కాఠ్‌మాండూ పోస్టు పేర్కొంది. అదే మార్గంలో మరో చోట కూడా బస్సుపై కొండచరియ విరిగిపడటంతో దాని డ్రైవర్ తీవ్రంగా గాయపడి మృతి చెందారు. ఈ బస్సు బుట్వాల్ నుంచి కాఠ్మాండూకు వెళుతోంది. మృతుడిని మేఘనాథ్‌గా గుర్తించారు. ఈ ఘటనపై నేపాల్ ప్రధాని పుష్పకమల్ దహాల్ విచారం వ్యక్తంచేశారు. ప్రభుత్వ ఏజెన్సీలు అక్కడ బాధితుల గాలింపునకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆ దేశ సాయుధ దళాలు ఘటనా స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టాయి.



# 'హైడ్రా'పై మరింత లోతుగా కసరత్తు చేయాలి

స్పష్టమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సీఎం ఆదేశించారు. జీహెచ్‌ఎంసీతో పాటు హైదరాబాద్ అవుటర్ రింగ్ రోడ్డు వరకు 2 వేల కిలోమీటర్ల పరిధిలో హైడ్రా పని చేయాల్సి ఉంటుందని, పని విభజనకు వీలుగా సిటీలో ఇప్పుడున్న జోన్ల తరహాలో భౌగోళిక పరిధిని నిర్దేశించాలని సీఎం సూచించారు. అవసరమైతే హైడ్రాకు ప్రత్యేక నిధులు కేటాయించే అంశాన్ని పరిశీలించాలని చెప్పారు. ఈ అసెంబ్లీ సమావేశాల్లోగా ముసాయిదా తయారు చేయాలని చెప్పారు. హైడ్రా ఏర్పాటు, సంబంధిత విధివిధానాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం సచివాలయంలో సమీక్ష చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ముఖ్య కార్యదర్శి దానకిషోర్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ అమ్రపాలీ, జీహెచ్‌ఎంసీ ఈవీడీఎం కమిషనర్ రంగనాథ్, సీఎంవో ముఖ్య కార్యదర్శి శేషాద్రి, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి పాల్గొన్నారు. విపత్తుల నిర్వహణతో పాటుగా ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ, చెరువులు, నాలాల కబ్జాలకు అడ్డుకట్ట వేయటం, ఆక్రమణలను తొలిగించటం, అక్రమ నిర్మాణాలు, నిబంధనలను పాటించని ఫ్లెక్సీలు, హోర్డింగ్లు, ప్రకటనల తొలిగింపు, ట్రాఫిక్ నిర్వహణ, తాగునీరు, విద్యుత్తు సరఫరాలో హైడ్రా కీలకంగా వ్యవహరించేలా విధులు అప్పగించాలని సీఎం చెప్పారు. హెచ్‌ఎండీఏ, వాటర్ వర్క్స్, డిజాస్టర్ మేనేజ్?మెంట్?, మున్సిపల్ విభాగాల మధ్య ఎప్పటికప్పుడు సమన్వయం ఉండాలని



అధికారులను అప్రమత్తం చేశారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో ఉన్న అనధికారిక హోర్డింగ్స్, ఫ్లెక్సీలు తొలగింపు, అపరాధ రుసుము వసూలు బాధ్యతను హైడ్రాకు బదలాయించాలని అన్నారు. నాలాలు, చెరువులు, ప్రభుత్వ స్థలాల ఆక్రమణల విషయంలో నిబంధనలు కఠినంగా ఉండేలా అధ్యయనం చేయాలని సూచించారు.

# కేసీఆరే ఫిరాయింపులు చేయిస్తున్నాడు

హైదరాబాద్(జనంసాక్షి): బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను స్వయంగా కేసీఆరే కాంగ్రెస్‌లోకి పంపుతున్నారని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సంచలన ఆరోపణలు చేశారు. శంషాబాద్‌లో జరిగిన బీజేపీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ అవినీతి నుంచి బయట పడేందుకు కాంగ్రెస్‌కు... కేసీఆర్ సహకరిస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ ప్రజల ఏకైక గ్యారంటీ నరేంద్ర మోదీ అని ఆయన చెప్పారు. తెలంగాణ ప్రజాప్రతినిధులు కూడా మోదీ మాత్రమే గ్యారంటీ అంటున్నారని ఆయన చెప్పారు. సెక్యూరిటీ లేకుండా ఉస్మానియా యూనివర్సిటీకి రావాలని రాహుల్ గాంధీకి ఆయన సవాల్ విసిరారు. రాహుల్ గాంధీని సొంత పార్టీ వారే ప్రధాని అభ్యర్థిగా అంగీకరించ లేదన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్యకర్తలకు బీజేపీ పెద్ద పీట వేస్తుందన్నారు. కార్యకర్తల గెలుపే రాష్ట్ర బీజేపీ నాయకత్వం లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీల హామీతో తెలంగాణ ప్రజలు మోసపోయారన్నారు. నిరుద్యోగులను పోలీసుల ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం అణిచి వేస్తోందని మండిపడ్డారు. కాంగ్రెస్‌ను ప్రజలు వ్యతిరేకించారనటానికి లోక్‌సభ ఎన్నికల ఫలితాలే నిదర్శనమన్నారు. కార్యకర్తల పోరాటంతోనే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి 8సీట్లు వచ్చాయన్నారు. రైతులను మోసం చేసే విషయంలో బీఆర్ఎస్ బాటలోనే కాంగ్రెస్ నడుస్తోందన్నారు కేంద్రమంత్రి బండి సంజయ్?..

# ఫోన్ ట్యాపింగ్ నిందితులకు ఎదురుదెబ్బ

న్యాయవాదులు కోర్టుకు విన్నవించారు. వారి వాదనలపై అభ్యంతరం వ్యక్తం చేసిన పోలీసులు.. ఛార్జిషీట్ దాఖలు చేశామని, దాన్ని తిప్పి పంపినంత మాత్రాన అసలు దాఖలు చేయనట్టు కాదు అన్నారు. గురువారం ఇరువైపులా వాదనలు ముగియగా.. న్యాయమూర్తి ఇవాళ తీర్పు వెలువరించారు.

# ఫిరాయింపుల పాలనపై మాట్లాడే హక్కు బీఆర్ఎస్‌కు లేదు

చేర్చుకుంటే.. ఇప్పుడు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు మా పాలన నచ్చి కాంగ్రెస్ పార్టీకి లోకి వస్తున్నారని మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు.

# 16న కలెక్టర్లు, ఎస్పీలతో సీఎం భేటీ

అంశాలే ఎజెండాగా నిర్వహించబోయే ఈ సమావేశంలో క్షేత్ర స్థాయి పరిస్థితులపై కలెక్టర్లు, ఎస్పీలతో సీఎం ఆరా తీయనున్నారు. ఇందులో ప్రజాపాలన దరఖాస్తుల గ్రౌండింగ్, అమలు ప్రస్తుత పరిస్తితిపై చర్చించనున్నారు. దీంతో పాటు ధరణిపై ప్రభుత్వం సబ్ కమిటీ వేసిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా వస్తున్న అభ్యంతరాలు.. వాటికి పరిష్కార మార్గాలపైనా సమావేశం చర్చించే అవకాశం ఉంది. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ నడుస్తున్న నేపథ్యంలో విత్తనాలు, ఎరువుల సమస్యలపైనా డిస్కస్ చేయనున్నారు. నూతన విద్యాసంవత్సరం ప్రారంభమైనందున పాఠశాలలు, గురుకులాల్లోని అంశాలపై చర్చ జరగనుంది. సీజనల్ వ్యాధులు అరికట్టేందుకు తీసుకుంటున్న చర్యలు, ఎపిడమిక్ సెల్ ల పనితీరు... సర్కారు దవాఖానాల్లో వైద్య సేవల తీరు.. మందుల అందుబాటు తదితర అంశాలపై సీఎం చర్చిస్తారని తెలుస్తోంది. వైద్యానికి ప్రాధాన్యం ఇస్తున్న రేవంత్ సర్కారు ఆరోగ్య శ్రీ పథకం కింద గత ప్రభుత్వ హయాంలో ఉన్న రూ. 5లక్షల సాయాన్ని 10 లక్షలకు పెంచిన విషయం తెలిసిందే. ఆరోగ్య శ్రీ సేవలపైనా సీఎం ఆరా తీయనున్నారు. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ పై ఎస్పీలతో సీఎం చర్చించనున్నారు. శాంతి భద్రతల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలపైనా ఆరా తీయనున్నారు. ముఖ్యంగా డ్రగ్స్ కంట్రోల్ పై ప్రభుత్వం దృష్టి సారించిన విషయం తెలిసిందే.. వాటి నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై సీఎం ఆరా తీయనున్నారు. డ్రగ్స్ మహమ్మారిని తరిమేందుకు ఏం చేయాలనే అంశాన్ని ఎస్పీలతో చర్చించే అవకాశం ఉంది. సైబర్ నేరాలను అరికట్టేందుకు ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నది. అయినప్పటికీ సైబర్ నేరగాళ్లు తమ స్టైల్ ను మార్చి లూఠీ చేస్తున్నారు. వీటికి చెక్ పెట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించే అవకాశం ఉంది. ఏది ఏమైనా బదిలీలు, పదోన్నతుల తర్వాత.. బడ్జెట్ సమావేశాలకు ముందస్తుగా జరుగుతున్న ఈ సమావేశానికి ప్రాధాన్యం ఏర్పడింది.

# గోపాల్‌పల్లి ఫ్లైఓవర్ ప్రారంభించండి:కేటీఆర్

ఉంటే ఇలాగే ఉంటుందని ఎద్దేవా చేశారునల్లగండ్ల, గోపాన్‌పల్లి, తెల్లాపూర్ చందానగర్‌వాసులకు మేలు చేసేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం గోపాన్‌పల్లి ఫ్లైఓవర్‌ను నిర్మించిందని కేటీఆర్ తెలిపారు. ఈ ఫ్లైఓవర్ నిర్మాణం పూర్తయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించడం లేదని అన్నారు. ఢిల్లీకి చక్కర్లు కొట్టడం, బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఇండ్ల చుట్టూ తిరగడం మీద ఉన్న శ్రద్ధ ప్రజా సమస్యలపై లేదా అని సీఎం రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. తమ వ్యక్తిగత పీఆర్ మీద ఉన్న శ్రద్ధ ప్రజలకు కల్పించాల్సిన సౌకర్యాల మీద లేదని మండిపడ్డారు. వెంటనే గోపాన్‌పల్లి ఫ్లైఓవర్‌ను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. లేదంటే ప్రజలే ప్రారంభించాల్సిన పరిస్థితి వస్తుందని హెచ్చరించారు.

**ప్రజల ప్రాణాలు గాలిలో దీపాలైనయ్**

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత పదేండ్ల పాలనలో సర్కార్ వైద్యానికి జవసత్వాలు ఇచ్చింది కేసీఆర్ సర్కార్ అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గుర్తు చేశారు. నేను రాను బిడ్డో సర్కార్ దవాఖానకు అనే దశాబ్దాల దుస్థితి నుంచి చలో పోదాం పదరో సర్కార్ దవాఖానకు అనే ధీమాను తీసుకొచ్చింది బీఆర్ఎస్ ప్రభుత్వమే ఆయన స్పష్టం చేశారు.కానీ కాంగ్రెస్ ప్రభుత్వం గద్దెనెక్కిన ఆరు నెలల్లోనే సర్కార్ దవాఖానాల్లో కనీసం మందు గోళీలు దొరకని పరిస్థితి ఏర్పడింది. ఇంత దారుణమైన దుస్థితికి దిగజార్చింది రేవంత్ సర్కార్ అని మండిపడ్డారు. పాలనను గాలికి వదిలేసిన కాంగ్రెస్ ప్రభుత్వంలో.. ప్రజల ప్రాణాలు గాలిలో దీపాలయినయి అని కేటీఆర్ పేర్కొన్నారు.

# హైదరాబాద్ 'టి స్క్వేర్'

టెండర్లు ఆహ్వానించింది. మధ్య, దిగువ మధ్య తరగతి ప్రజలకు అందుబాటులో ఉండటంతో పాటు, స్థానిక ప్రజలకు ఆహ్లాదాన్ని కలిగించేలా టి స్క్వేర్ నిర్మాణం ఉండాలని నిర్ణయించారు. రోజువారి పనులతో క్షణం తీరిక లేకుండా ఉండే వారికి టి స్క్వేర్‌లో జరిగే ఈవెంట్లతో ఆహ్లాదకర వాతావరణం కల్పించాలని భావిస్తున్నారు.

# హాథ్రస్ ఘటనపై విచారణకు సుప్రీం నిరాకరణ

**ఢిల్లీ:** సంచలనం సృష్టించిన హాథ్రస్ తొక్కిసలాట ఘటనపై విచారణ కోరుతూ దాఖలైన పిటిషన్‌ను స్వీకరించేందుకు సుప్రీంకోర్టు శుక్రవారం నిరాకరించింది. ఇటువంటి కేసులు దేశ ప్రజలను కలవరపెడుతున్నాయని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్, న్యాయమూర్తులు జె.బి.పార్దివాలా, మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం పేర్కొంది. ఇటువంటి కేసులను పరిష్కరించేందుకు హైకోర్టులు సిద్ధంగా ఉన్నాయని పేర్కొంటూ, ఈ విషయంలో అలహాబాద్ హైకోర్టును ఆశ్రయించాలని పిటిషనర్‌ను ఆదేశించింది.జులై 2న జరిగిన హాథ్రస్ తొక్కిసలాట ఘటనపై విచారణ జరిపేందుకు సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి పర్యవేక్షణలో ఐదుగురు సభ్యులతో కూడిన నిపుణుల కమిటీని నియమించాలని పిటిషనర్ విశాల్ తివారీ అత్యున్నత న్యాయస్థానాన్ని కోరారు. ఇటువంటి సంఘటనలు జరిగినప్పుడు క్షతగాత్రులకు వెంటనే వైద్యం అందించడానికి వైద్యశాలలు అందుబాటులో లేకపోవడం దేశంలో ఉన్న పెద్ద సమస్యగా పిటిషనర్ పేర్కొన్నారు. ఈ సమస్యపై సుప్రీం దృష్టిపెట్టాలని కోరగా, సీజేఐ దీనిని తిరస్కరించారు.జులై 2న హాథ్రస్ జిల్లాలో ఉన్న ఓ ఖాళీ ప్రదేశంలో తాత్కాలిక షెడ్లు వేసి సత్సంగ్ కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. 80 వేల మంది భక్తులు హాజరవుతారని నిర్వాహకులు పోలీసుల నుంచి అనుమతి తీసుకున్నారు. అయితే 2.5 లక్షలకు పైగా ప్రజలు వచ్చినట్లు తేలింది.

# వలసలు కొనసాగుతాయ్..

గంటల తరబడి వెయిట్ చేయించేవారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీలో స్వేచ్ఛ ఉంటుందని.. అందుకే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరుతున్నారన్నారు. బీఆర్ఎస్‌పై నమ్మకం లేకనే ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరుతున్నారని ఎమ్మెల్యే తెలిపారు. బీఆర్ఎస్‌లో ఎమ్మెల్యేలను పురుగుల్లా చూసేవారన్నారు. విలువ లేని చోట ఉండలేక కాంగ్రెస్‌లో చేరుతున్నారని వెల్లడించారు.కాంగ్రెస్‌లో అందరికి విలువ ఉంటుందన్నారు. గతంలో కాంగ్రెస్ హయాంలో ఎమ్మెల్యేలకు స్పెషల్ డెవలప్మెంట్ ఫండ్ ఉండేదన్నారు. బీఆర్ఎస్ హయాంలో నియోజకవర్గం అభివృద్ధి చేద్దాం అంటే అసలు ఫండే లేదన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు కొంత మంది మంత్రులు, ఎమ్మెల్యేలు వేల కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. దోచుకున్న వారి వివరాలు త్వరలో బయట పెడతానన్నారు. 10 ఏళ్లలో కేటీఆర్ బినామీలు వేల కోట్లు దండుకున్నారని... త్వరలో సాక్షాలతో బయటపెడుతానని స్పష్టం చేశారు.



ఎమ్మెల్యేలను కాపాడుకోడానికి ఆరు నెలల్లో అధికారంలోకి వస్తామని మేకపోతు గంభీరం చూపిస్తున్నారన్నారు. సొంత కుటుంబ సభ్యురాలు కవిత జైల్లో ఉంటే ఆమెను బయటకు తీసుకురాకుండా రాజకీయం చేస్తున్నారని ఎమ్మెల్యే దానం నాగేందర్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.

# ప్రజాధనం సద్వినియోగం కోసమే ప్రజాభిప్రాయ సేకరణ

స్వీకరిస్తాం. రైతుభరోసా స్కీమ్‌పై ఎలాంటి అపోహలు వద్దని, ప్రజాభిప్రాయాలను అసెంబ్లీలో చర్చించి స్కీమ్ అమలు చేస్తామని హామీ ఇచ్చారు. వ్యవసాయ రంగాన్ని, రైతులను కాపాడుకునేందుకే ప్రభుత్వం రైతు భరోసా పథకాన్ని అమలు చేస్తుందని అన్నారు. అందరి అభిప్రాయాలు తెలుసుకునేందుకే రైతు భరోసా సదస్సులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలోని రైతుల సంక్షేమం దృష్ట్యా రైతు భరోసా కార్యక్రమాన్ని నిర్దిష్టంగా అమలు చేయాలని లక్ష్యంతో అందరి అభిప్రాయం, సలహాలు, సూచనలు తీసుకొని అన్ని జిల్లాలను క్రోడీకరించి చట్టసభలలో ప్రస్తావనకు తీసుకువచ్చి ఈ అంశాలపై చర్చించడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర వనరులు, సంపదను ప్రజా సంక్షేమానికి, రాష్ట్ర అభివృద్ధికి వినియోగిస్తామని, ప్రజలు, రైతులు ప్రత్యక్షంగా, పరోక్షంగా తమ కష్టార్జితం నుంచి చెల్లించిన పన్ను, వివిధ రంగాల ద్వారా ప్రభుత్వానికి సమకూర్చిన ఆదాయం ద్వారా ప్రజల కష్టానికి న్యాయం చేస్తామని అన్నారు. రైతు భరోసా పథకం ద్వారా రైతు సంక్షేమం కోసం స్పష్టమైన కార్యాచరణతో ముందుకు వెళదామని అన్నారు. రైతు భరోసా పథకంలో రైతులకు లబ్ది చేకూరే విధంగా రైతులు, శాస్త్రవేత్తలు, వివిధ రంగాలలో నిపుణులు, వివిధ వర్గాల వారి అందరి అభిప్రాయాలు, సూచనలు తీసుకొని రైతు సంక్షేమం దిశగా కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. రైతులు, మేధావుల అభిప్రాయం మేరకే రైతుభరోసా అమలు చేస్తామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే సాగుకు పనికిరాని భూములకు రూ. 25 వేల కోట్ల రైతుబంధు ఇచ్చి నిధులు దుర్వినియోగం చేశారన్నారు. సీఎం మనసులో రైతుల పంటలకు బీమా ఇచ్చే ఆలోచన ఉందన్నారు. మద్దతుధర అందించి రైతులకు మేలు చేయాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని చెప్పారు. ప్రజల ఆలోచనను పరిగణలోకి తీసుకుని రాష్ట్ర అభివృద్ధి దిశగా ప్రజా రంజకంగా పాలన సాగించడం జరుగుతుందని, చిన్న, సన్నకారు రైతులకు ఉపయోగపడే విధంగా రైతు భరోసా అమలు చేసేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. వ్యవసాయ క్షేత్రంలో కష్టాలకు ఓర్చి, చెమటోడ్చి పంట పండించే రైతుకు ప్రాధాన్యత నివ్వడం జరుగుతుందని తెలిపారు. రైతు భరోసా అమలు చేయడంలో ప్రతి ఒక్కరి అభిప్రాయానికి ప్రాధాన్యత ఇస్తామని, అందరి అభిప్రాయాలను క్రోడీకరించి సముచిత ప్రణాళిక ద్వారా రైతు సంక్షేమానికి కృషి చేస్తామని తెలిపారు. ప్రభుత్వం నుండి ఏ కార్యక్రమం చేపట్టిన ప్రజా క్షేత్రంలో సూచనలు, సలహాలు తీసుకొని ప్రజల సమ్మతితో అమలు చేయడం జరుగుతుందని, ప్రజాధనాన్ని ప్రజలకు ప్రతినిధులుగా న్యాయబద్ధంగా అర్హత గల ప్రతి ఒక్కరికి అందే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.దాదాపు 96 శాతం ఉన్న సన్న, చిన్న కారు రైతుల అభివృద్ధి దిశగా ప్రభుత్వం పని చేస్తుందని, వ్యవసాయంపై జీవనం సాగిస్తున్న రైతుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. ప్రజలు అందించిన సలహాలు, సూచనలు, అభిప్రాయాలను అసెంబ్లీలో అధికార, ప్రతిపక్ష పార్టీల ప్రతినిధుల సమక్షంలో ప్రస్తావించి వారి అభిప్రాయాలను సైతం స్వీకరిస్తామని తెలిపారు. వ్యవసాయ భూమిలో కాలు పెట్టి చెమటోడ్చి సాగు చేసే రైతులకు న్యాయం జరిగేలా విధివిధానాలు రూపొందిస్తామని, నిబంధనల ప్రకారం అర్హత కలిగిన సాగు రైతులకు పట్టాలు అందించడంపై ప్రభుత్వం ఆలోచిస్తుందని అన్నారు. రైతులందరికీ సమన్యాయం జరిగే విధంగా చూస్తామని, అభిప్రాయ సేకరణలో పలువురు సూచించిన 10 ఎకరాల పరిమితి, పట్టాదారుకు, కౌలు రైతుకు సమభాగంగా అందించడం వంటి పలు అంశాలను వెల్లడించడం జరిగిందని, అన్ని అభిప్రాయాలను పరిగణలోకి తీసుకొని అసెంబ్లీలో చర్చించి అందరి అభిప్రాయం మేరకు రైతుకు లబ్ది చేకూరే విధంగా రైతు భరోసా అమలు చేస్తామని తెలిపారు.

# కాంగ్రెస్‌ది ఫిరాయింపుల పాలన

నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర భాజపా విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశంలో కిషన్‌రెడ్డి మాట్లాడారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ హాజరుకాగా.. రాష్ట్రానికి చెందిన మరో కేంద్రమంత్రి బండి సంజయ్, భాజపా ఎంపీలు, ఎమ్మెల్యేలు, ముఖ్యనేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. భాజపాకు ఓట్లు, సీట్లు ఇచ్చిన తెలంగాణ ప్రజలకు సెల్యూట్. ప్రస్తుత ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహించిన మల్కాజ్‌గిరి గడ్డపై కాషాయ జెండా ఎగిరింది. ఆయన సొంత జిల్లాలోనూ భాజపాదే ఆధిపత్యం. పార్టీ ఓటు బ్యాంకు 14 నుంచి 35 శాతానికి పెరగడం సాధారణ విషయం కాదు. పదేళ్లు పాలించిన భారాస ఒక్క ఎంపీ సీటు గెలవలేక ప్రజాగ్రహానికి గురైంది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అతి తక్కువ కాలంలోనే ప్రజా విశ్వాసం కోల్పోయింది. ఆ పార్టీ వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని అధికారంలోకి వచ్చింది. వంద రోజులు దేవుడెరుగు.. ఎనిమిది నెలలు కావస్తున్నా ఇచ్చిన హామీలను అమలు చేయలేదు. ఫిరాయింపుల విషయంలో కేసీఆర్ తరహాలోనే కాంగ్రెస్ వెళ్తోందని కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామన్నారని, ఇప్పటివరకు ఎందుకు చేయలేదని కిషన్ రెడ్డి ప్రశ్నించారు. కాంగ్రెస్ నిరంకుశ పాలనపై విద్యార్థులు, మహిళలు పోరాటాలు చేయలని పిలుపునిచ్చారు. బిఆర్ఎస్ మాదిరిగానే కాంగ్రెస్ పార్టీ ఫిరాయింపులకు పాల్పడుతోందని, రాజకీయ ఫిరాయింపులే అజెండాగా కాంగ్రెస్ పాలిస్తోందని దుయ్యబట్టారు. తెలంగాణను దోపిడీ చేసి ఢిల్లీ పెద్దలకు సూట్‌కేసులు పంపుతున్నారని ఆరోపణలు చేశారు. బిఆర్ఎస్ ఓట్లు బిజెపికి పడ్డాయని కాంగ్రెస్ ఆరోపణలు చేస్తుందని, బిఆర్ఎస్-బిజెపి ఎప్పటికి ఒక్కటి కాదు అని, కాంగ్రెస్-బిఆర్ఎస్ ఒక్కటి అని తెలియజేశారు. బీజేపీ రాష్ట్ర విస్తృతస్థాయి కార్యవర్గ సమావేశాలు శుక్రవారం ఉదయం ప్రారంభమయ్యాయి. పార్టీ బలోపేతం, ప్రజా సమస్యలే లక్ష్యంగా కార్యవర్గ సమావేశాలు జరుగుతున్నాయి. పార్టీలో చేరికలపై బీజేపీ కార్యవర్గం ప్రధానంగా చర్చించనున్నట్లు తెలుస్తోంది. ఎమ్మెల్యే పదవులకు రాజీనామా చేస్తేనే బీజేపీలో చేర్చుకుం టామని బండి సంజయ్ ఇప్పటికే స్పష్టం చేసిన విషయం తెలిసిందే. సమావేశాలకు కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రదాన్, సంస్థాగత ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తివారీ, పార్లమెంట్ ఎన్నికల ఇంచార్జ్ అభయ్ పాటిల్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. శంషాబాద్ మల్లికా కన్వెన్షన్‌లో కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో జరుగుతోన్న సమావేశాల్లో లక్ష్మణ్, బండి సంజయ్, డీకే అరుణ, ఈటల, గరికపాటి తదితరులు పాల్గొన్నారు. అలాగే పదాధికారులు, కార్యవర్గ సభ్యులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, మాజీ ఎంపీలు ఎమ్మెల్యేలు, జిల్లాల అధ్యక్షులు, కార్పోరేటర్లు హాజరయ్యారు. పార్లమెంటు ఎన్నికల తర్వాత జరుగుతున్న మొదటి

# ఎమర్జెన్సీని చీకటి దినంగానే చూస్తాం

లక్షలాది మందిని జైల్లో పెట్టారు. మీడియా గళాన్ని అణగదొక్కారు. ఆ చీకటి రోజులకు నిరసనగా ఇక నుంచి ఏటా జూన్ 25ను 'సంవిధాన్ హత్య దివస్'గా నిర్వహించాలని నిర్ణయించాం. ఎమర్జెన్సీ సమయంలో ప్రజలు అనుభవించిన వేదనను, దాన్ని ఎదిరించి నిలబడిన యోధులను ఆ రోజున గుర్తుచేసుకుందాం' అని అమిత్ షా రాసుకొచ్చారు. ఈ ప్రకటనపై ప్రధాని మోదీ స్పందించారు. నాటి ప్రభుత్వం రాజ్యాంగాన్ని అణగదొక్కి ఎలాంటి పాలన సాగించిందో ఈ సంవిధాన్ హత్య దివస్ మనకు గుర్తుచేస్తుంది. దేశ చరిత్రలో కాంగ్రెస్ రాసిన చీకటి దశ కారణంగా నష్టపోయిన ప్రతి ఒక్కరినీ స్మరించుకునే రోజు అది అని ప్రధాని పేర్కొన్నారు. రాష్ట్రపతి దేశవ్యాప్త ఎమర్జెన్సీ ని విధిస్తున్నట్లు 1975 జూన్ 25వ తేదీ అర్ధరాత్రి ఆనాటి ప్రధాని ఇందిరాగాంధీ ఆకాశవాణి ద్వారా ప్రకటించారు. రాయ్‌బరేలీ నుంచి లోక్‌సభకు ఆమె ఎన్నిక చెల్లదని అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై షరతులతో కూడిన స్టే ఉత్తర్వును సుప్రీంకోర్టు వెలువరించిన కాసేపటికే ఇందిర ఈ సంచలనాత్మక నిర్ణయం తీసుకున్నారు. పార్లమెంటరీ కార్యకలాపాలకు దూరంగా ఆమె ఉండాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ క్రమంలోనే ఆమె ఎమర్జెన్సీ నిర్ణయం తీసుకున్నారు. అది సంచలనాత్మకం కావడంతోపాటు రాజకీయంగా ఇప్పటికీ తీవ్ర విమర్శలకు తావిస్తున్న విషయం తెలిసిందే. ఆమెను తొలగించేందుకు దేశవ్యాప్త ఉద్య మానికి జయప్రకాశ్ నారాయణ్ (జేపీ) పిలుపునిచ్చారు. విపక్ష నేతలైన జేపీ, ఆడ్వాణీ, వాజ్‌పేయీ, మొరార్జీ దేశాయ్ సహా అనేకమందిని ఎమర్జెన్సీ సమయంలో ఖైదు చేశారు. పత్రికాస్వేచ్ఛపై కోత సహా అనేక రకాలుగా ఆంక్షలకు కారణమైన ఎమర్జెన్సీని ముగిస్తూ.. ఎన్నికలు నిర్వహించబోతున్నట్లు 1977 జనవరి 18న ఇందిర ప్రకటించారు. మార్చి 16నుంచి 20 వరకు ఎన్నికలు నిర్వహించి, 21న అత్యాయిక పరిస్థితిని ఎత్తివేశారు.


**తెలంగాణ ప్రభుత్వము**
**రోడ్లు& భవనముల శాఖ వారి కార్యాలయము, హైదరాబాద్**

ఈ- ప్రొక్యూర్‌మెంటు నోటీసు

e-Nit NO.02/SE/R&B/WGL/2024-25 Dt:12.07.2024

1.మంచిర్యాల జిల్లాలో ఆర్‌వోబీకి ఎలక్ట్రిఫికేషన్ పనులు చేయుట. మొత్తం ఈసీవీ సుమారు రూ.29.83 లక్షలు. టెండర్లు స్వీకరించు చివరి తేదీ/ సమయం తేది:22.07.2024 మ॥ 12 గం॥లకు. మిగతా వివరాలకు ఈ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్‌ప్లేస్ www.tender.telangana.gov.in. వెబ్‌సైట్‌లోచూడగలరు. సంప్రదించాల్సిన సెల్ నం.9121226041.

**సూపరింటెండింగ్ ఇంజినీరు(ఆర్ & బి) ఎలెక్ట్రికల్ , వరంగల్**

DIPR No.1768-PP/CL/ADVT/1/2024-25

# బోనాలు ఘనంగా నిర్వహించాలి

- ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్



హైదరాబాద్, జూలై 12 (జనంసాక్షి) : దశాబ్ది ఉత్సవాల సందర్భంగా బోనాలు ఘనంగా నిర్వహించాలని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ తెలిపారు. అంబర్‌పేట్ నియోజకవర్గంలోని కాచిగూడలో ఉన్న తుల్జాభవన్ ధర్మశాలలో ఆషాడమాస బోనాల దశాబ్ధి ఉత్సవాల కోసం దేవాలయాలకు చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్,ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ,కార్పొరేటర్లు ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌తో కలిసి దేవాలయాల వారికి బోనాల ఉత్సవాల కోసం చెక్కుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ మాట్లాడుతూ బోనాల ఉత్సవాల కోసం ప్రభుత్వం 20 రోజుల ముందే దేవాలయాలకు చెక్కులు అందిస్తున్నామన్నారు. 20 రోజుల ముందే ఇస్తే ఉత్సవాలు మరింత ఘనంగా చేయొచ్చనే ఉద్దేశం తో సీఎం గారు ఇస్తున్నారన్నారు. సీఎం ఆదేశాల మేరకు జిల్లా మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవతో త్వరగా చెక్కుల పంపిణీ చేస్తున్నామన్నారు. గతం కంటే భిన్నంగా బోనాలు ఇంకా ఘనంగా నిర్వహించాలని 20 రోజుల ముందు ఇస్తున్నామన్నారు. గతంలో ఇచ్చిన దానికంటే 10% బడ్జెట్ పెంచి ఇస్తున్నామన్నారు. ఇంకా ఎవరికైనా రాకపోయినా, అప్లై చేసుకోకపోయిన మా దృష్టికి తీసుకురావాలని, అంబర్‌పేట్ నియోజకవర అభివృద్ధి కోసం కృషి చేస్తామన్నారు. ఎలాంటి సమస్య ఉన్న నా దృష్టికి తీసుకొనీ వస్తే ప్రభుత్వం దృష్టికి తీసుకోని వెళ్తామన్నారు.

# పెన్షనర్ల జేఏసీ పోరాటాన్ని జయప్రదం చేయండి

- స్టేట్ పెన్షనర్స్ రాష్ట్ర కన్వీనర్ స్వరాజ్ కుమార్ భట్, టాప్ర రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి కృష్ణమూర్తి






హైదరాబాద్, జూలై 12 (జనంసాక్షి) : పెన్షనర్ల జేఏసీ పోరాటాన్ని జయప్రదం చేయాలని స్టేట్ పెన్షనర్స్ రాష్ట్ర కన్వీనర్ స్వరాజ్ కుమార్ భట్, టాప్ర రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.కృష్ణమూర్తి తెలిపారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రం, దొడ్డి కొమురయ్య హాలులో టాప్ర రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సబ్ కమిటీ సమావేశం కన్వీనర్ స్వరాజ్ కుమార్ భట్ అధ్యక్షులుగా పోరాట సమాయత్త సమావేశం జరిగింది. ఈ సమావేశానికి టాప్ర రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సమస్యల పట్ల గత ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహించడం వలన ఆ ప్రభుత్వాన్ని అధికారం నుండి తొలగించి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అధికారంలోకి రావడానికి కృషి చేశారు. అది కూడా కాంగ్రెస్ పార్టీ తమ ఎన్నికల మానిఫెస్టోలో పెన్షనర్ల సమస్యల పరిష్కారం పట్ల ఇచ్చిన హామీలను ఈ పార్టీ అమలు చేస్తుందనే నమ్మకంతో నే కాంగ్రెస్ కు మద్దతు ఇవ్వడం జరిగింది. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రతి నెల మొదటి తేదీన పెన్షన్ చెల్లించే హామీ తప్ప ఇతర హామీలు అమలు చేయడంలో సాచి వేత వైఖరి అనుసరిస్తోందనీ, మానిఫెస్టో హామీలను త్వరగా అమలు చేయాలని కోరుతూ పెన్షనర్ల జేఏసీ రెండు దశల పోరాట కార్యక్రమాన్ని తీసుకోవడం జరిగిందనీ, ఈ కార్యక్రమాలను జయప్రదం చేయాలని టాప్ర రాష్ట్ర ప్రధాన పిలుపునిచ్చారు. 15న రాష్ట్రంలోని అన్ని కలెక్టరేట్ల ఎదుట ప్రదర్శనలు చేపట్టాలని, 30న ఇందిరాపార్క్ వద్ద మౌన దీక్షలు చేపడతామని తెలిపారు. మానిఫెస్టోలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, పెండింగ్ 4 డీఏలను వెంటనే అమలు చేయాలని, ఈ కుబేర్ లో పెండింగ్ లో ఉన్న బిల్లులు వెంటనే చెల్లించాలని, గత వేతన సవరణ కమిషన్ సూచనలను వెంటనే అమలు చేయాలని, అన్ని రకాల ఆసుపత్రుల్లో పెన్షనర్లకు హెల్త్ కార్డులపై నగదు రహిత వైద్యం అందజేయాలని, ఎయిడెడ్, కాలేజ్ టీచర్లు తదితర అందరు ఉద్యోగులకు మెడికల్ రీఎంబర్స్ మెంట్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. సివిపి రికవరీని 12 సంవత్సరాలకు తగ్గించాలని, వేతన సవరణ కమిషన్ రిపోర్ట్ వెంటనే తెప్పించుకుని అమలు చేయాలని కోరారు. ఈ సమావేశంలో టాప్ర ఉపాధ్యక్షులు ఎం. జనార్ధన్ రెడ్డి, ఎం నరహరి, దుర్గా ప్రసాద్, అరుణ, సీతారాం, లక్ష్మి నారాయణ, అశోక్, కృష్ణమోహన్, కృష్ణా రావు, రామకృష్ణ, మస్తాన్ రావు తదితరులు పాల్గొన్నారు.

# డేటా సైన్స్‌తో ప్రజా రవాణా వ్యవస్థ పటిష్టం

- ప్రజల అభిరుచులకు తగ్గట్టుగా రవాణా సేవలు
- డేటా సైన్స్, మెషిన్ లెర్నింగ్ ప్రముఖ నిపుణులు శరత్
- డేటా విశ్లేషణపై ఆర్టీసీ అధికారులకు అవగాహన



హైదరాబాద్, జూలై 12 (జనంసాక్షి) : డేటా సైన్స్ ను ఉపయోగించుకుని ప్రజా రవాణా వ్యవస్థను మరింతగా పటిష్టం చెయొచ్చని డేటా సైన్స్, మెషిన్ లర్నింగ్ ప్రముఖ నిపుణులు శరత్ కాటిపల్లి అన్నారు. ప్రజల అభిరుచులకు అనుగుణంగా మెరుగైన, నాణ్యమైన రవాణా సేవలను అందించడంతో పాటు టీజీఎస్ఆర్టీసీ నిర్వహణ సామర్థ్యాన్ని పెంచుకునేందుకు డేటా విశ్లేషణ దివ్య ఔషధంలాగా పనిచేస్తుందని ఆయన పేర్కొన్నారు. హైదరాబాద్ బస్ భవన్ లో లీడర్ షిప్ టాక్స్ లో భాగంగా గురువారం నిర్వహించిన కార్యక్రమంలో 'ప్రజా రవాణా వ్యవస్థలో డేటా సైన్స్, మెషిన్ లెర్నింగ్ వినియోగం' అనే అంశంపై శరత్ కాటిపల్లి ప్రసగించారు. ప్రతి రోజు సగటున 55 లక్షల మందిని తమ బస్సుల్లో టీజీఎస్ఆర్టీసీ గమ్యస్థానాలకు చేర్చడం గొప్ప విషయమని అన్నారు. ప్రస్తుతం ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ సంస్థ లూషియా ఏఐకి అడ్వైజర్ గా కొనసాగుతున్నారు. డేటా సైన్స్ ను వినియోగించుకుని ప్రజలకు మరింత చేరువయ్యేందుకు టీజీఎస్ఆర్టీసీ కసరత్తు చేస్తోందని టీజీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనర్, ఐపీఎస్ అన్నారు. ప్రస్తుతం కార్పొరేట్ సంస్థలకు జీవనాడిలాగా డేటా సైన్స్ పనిచేస్తోందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే ప్రజల రవాణా అవసరాలకు అనుగుణంగా అర్బన్, గ్రామీణ ప్రాంతాల్లో వేగవంతమైన సేవలందించేందుకు డేటా విశ్లేషణను వినియోగించుకుంటున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సంస్థ సీవోవో డాక్టర్ రవిందర్, జాయింట్ డైరెక్టర్ అపూర్వరావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు మునిశేఖర్, కృష్ణకాంత్, ఫైనాన్స్ అడ్వైజర్ విజయపుష్ప, సీపీఎం ఉషారాణి, సీఎంఈ వెంకన్న, తదితరులతో పాటు వర్చ్ వల్ గా ఆర్ఎంలు, డిప్యూటీ ఆర్ఎంలు, డీఎంలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# డ్రగ్స్ నియంత్రణకు పాలకులు కఠిన చర్యలు తీసుకోవాలి

- ఎఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి యుగేందర్




మానకొండూర్, జూలై 12 (జనంసాక్షి) : రాష్ట్రంలో డ్రగ్స్ నియంత్రణ కు కఠిన చర్యలు తీసుకొని అడ్డుకట్ట వేయాలని అఖిల భారత యువజన సమాఖ్య ఎఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బ్రామండ్లపల్లి యుగేందర్ అన్నారు. శుక్రవారం రోజున ఎఐవైఎఫ్ మానకొండూర్ మండల ముఖ్య కార్యకర్తల సమావేశం కొండపలకల గ్రామంలో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన యుగేందర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మారక ద్రవ్యాల అక్రమ సరఫరా పట్ల కట్టు దిట్టమైన చర్యలు చేపట్టాలని, ప్రత్యేక టీములను ఏర్పాటు చేసి అక్రమ రవాణా అమ్మకాలపై దృష్టి పెట్టి వాటిని పట్టుకోవాలని, సరఫరా చేసే వ్యక్తుల పై అమ్మే వ్యక్తులపై క్రిమినల్ కేసులు పెట్టి వారిని జైల్లో పెట్టాలని అన్నారు. విద్యా సంస్థల పరిసర ప్రాంతాల్లో డ్రగ్స్ అమ్మకాలు విచ్చల విడిగా జరుగుతున్నాయని,డ్రగ్స్ వినియోగం చేయడం ద్వారా జరిగే నష్టాల పై విద్యార్థులకు అవగాహన చేపట్టాలని అన్నారు. వివిధ రాష్ట్రల ప్రభుత్వాలు కూర్చొని డ్రగ్స్ సరఫరా పట్ల ప్రత్యేక దృష్టి సారించి ఇరు రాష్ట్రాల్లో డ్రగ్స్ మహమ్మారిని కూకటి వేళ్ళతో పెకిలించే ప్రయత్నం చేయాలని అన్నారు, విద్యార్థుల తల్లి తండ్రులు కూడా వారి పిల్లల పట్ల ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు, విద్యతో పాటు సమాజంలో వచ్చే రుగ్మతులపై అవగాహన చేసుకోవాలన్నారు. పట్టణాల్లోనే కాకుండా మారుమూల గ్రామాలకు మారక దృవ్యాల సరఫర యాదేచ్చగా జరుగుతుందని తెలిపారు. దీనికి కారణం నిఘా వైఫల్యం మాత్రమే అని ఇప్పటికైనా ప్రభుత్వ యంత్రాంగం డ్రగ్స్ నివారణకు చర్యలు తీసుకొని నియంత్రణ చేయాలని పేర్కొన్నారు. మారక ద్రవ్యాలు సేవించడం వల్ల చాలామంది యువత ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయని చాలా కుటుంబాలు వీధిన పడుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇందుకోసం గ్రామాల్లో, పట్టణాల్లో ఎఐవైఎఫ్ కార్యకర్తలు, నాయకలు యువతకు అవగాహన కల్పించి మారక ద్రవ్యల నియంత్రణకు భాగస్వామ్యం కావాలని యుగేందర్ యువతకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఏఐవైఎఫ్ మండల నాయకులు శ్రీరాములశంకర్, శ్రీరాముల రవి,రేగుల రమేష్, గడ్డం కోటేష్, రమేష్, రాజు, శ్రీహరి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# డిగ్రీ ప్రిన్సిపాల్ పదోన్నతుల కోసం అనర్హులైన జూనియర్ కాలేజీ ప్రిన్సిపాళ్ల పాట్లు

- తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల సొసైటీలో వింత చోద్యం

హైదరాబాద్, జూలై 12 (జనంసాక్షి) : తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలల్లో ఏళ్ళ తరబడిగా ఎదురుచూస్తున్న డిగ్రీ లెక్చరర్లకు ప్రిన్సిపాల్స్ గా పదోన్నతి కల్పిస్తున్న సొసైటీ కార్యదర్శి డా అలగు వర్షిణికి కృతజ్ఞతలు తెలియ జేస్తున్నట్లు తెలంగాణ గురుకుల డిగ్రీ కళాశాలల ఉద్యోగుల సంఘం( టిగారియా) రాష్ట్ర అధ్యక్షులు డా శారద, ప్రధాన కార్యదర్శి డా సత్య శ్రీదేవి ఒక ప్రకటన లో తెలియజేశారు. 30 సంవత్సరాలుగా సొసైటీలో ఎన్నో ఆటుపోట్లు తట్టుకొని విద్యార్థుల కోసం నిరంతరం పాటుపడుతున్న డిగ్రీ లెక్చరర్లకు ప్రిన్సిపాల్స్‌గా ప్రమోషన్ ఇవ్వాలని సంకల్పించడం సెక్రెటరీ అంకితభావానికి నిదర్శనమని వారు పేర్కొన్నారు. సాంఘిక సంక్షేమ గురుకుల సొసైటీ సర్వీసు నిబంధనల ప్రకారం పోస్ట్ గ్రాడ్యుయేషన్ లో 55 శాతం మార్కులతోపాటు, పిహెచ్‌డి అర్హత ఉండాలని, 5 సంవత్సరాలుగా డిగ్రీ లెక్చరర్‌గా బోధనానుభవం తో పాటు డిపార్ట్ మెంటల్ పరీక్షలు పాసై ఉండాలని వారు తెలియజేశారు. తెలంగాణ ప్రభుత్వం జీవోఎంఎస్ నెం 06, తేది. 06.02.2023, హయ్యర్ ఎడ్యుకేషన్, (సి ఇ-1) తెలంగాణ స్టేట్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ సర్వీస్ స్పెషల్ రూల్స్ మరియు యు. జి .సి నిబంధనల ప్రకారం కూడా పోస్ట్ గ్రాడ్యుయేషన్ లో 55 శాతం మార్కులు, పి హెచ్.డి అర్హత తో పాటు డిగ్రీ లెక్చరర్లు గా పనిచేస్తున్న వారు మాత్రమే డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్స్ గా పదోన్నతులకు అర్హులని నిబంధనలు స్పష్ట పరుస్తున్నప్పటికీ స్కూల్స్, జూనియర్ కాలేజీల్లో పనిచేస్తున్న ప్రిన్సిపాల్స్ కూడా డిగ్రీ ప్రిన్సిపాల్స్ గా పదోన్నతి కోరడం శోచనీయమని వారన్నారు.డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్స్ గా పనిచేయాలంటే డిగ్రీ లెక్చరర్లు గా అనుభవముండాలనే కనీస అవగాహన లేకుండా డిగ్రీ ప్రిన్సిపాల్స్ పదోన్నతి కోరడం వారి అవగాహనా రాహిత్యమని వారు పేర్కొన్నారు.అనుభవజ్ఞులు, సమర్ధ అధికారిగా పేరున్న సొసైటీ కార్యదర్శి డా అలగు వర్షిణి గారు ఈ విషయం పై తమ దృష్టి సారించాలని, అనర్హులైన వారి చెక్ స్లిప్ లను తిరస్కరించాలని సొసైటీ కార్యదర్శిని వారు కోరారు.

# ఫీజు రీయంబర్స్‌మెంట్ స్కాలర్ షిప్ బకాయిలు విడుదల చేయాలి

- ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు రామారావు వెంకటేష్ ప్రధాన కార్యదర్శి మచ్చ రమేష్





హైదరాబాద్, జూలై 12 (జనంసాక్షి) : పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయంబర్స్ మెంట్ , స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేసి విద్యార్థులను ఆదుకోవాలని గురువారం ఒక ప్రకటనలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు రామారావు వెంకటేష్ ప్రధాన కార్యదర్శి మచ్చ రమేష్ డిమాండ్ చేశారు. ఈ సందర్భగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష,కార్యదర్శి రామారపు వెంకటేష్, మచ్చ రమేష్ మాట్లాడుతూ తెలంగాణలో విధ్యార్థులకు పెండింగ్లో ఉన్న స్కాలర్ షిప్, ఫీజు రీయంబర్స్ మెంట్ విడుదల చేయడంలో గత ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరించిందని ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఫీజు రీయంబర్స్ మెంట్, స్కాలర్ షిప్ విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విధ్యార్థులకివ్వాల్సిన దాదాపు 7వేల కోట్లపైగా బకాయిలున్నాయని, స్వరాష్ట్రం వస్తే నిధులు నియామకాలు వస్తాయని విద్యార్థులు కోటి ఆశలతో కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో విద్యార్థులకు మొండిచేయి చూపడం చాలా అన్యాయమన్నారు. ఫీజు బకాయిలు సరిగా విడుదల చేయకపోవంతో విద్యా సంవత్సరం ప్రారంభం కాబట్టి విద్యార్థులు పలు కళాశాలలకు వేళ్ళే క్రమంలో విద్యార్థులకు కళాశాల యాజమాన్యాలు విధ్యార్థులను ఫీజులు కట్టాలని వేధిస్తున్న పరిస్థితి కనిపిస్తోందని, ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నత విద్యపై ప్రత్యేక శ్రద్దపెట్టాలని విద్యారంగానికి అధిక నిధులు కేటాయించి విద్యార్థులను ఆదుకోవాలని కోరారు. పెండింగ్ లో ఉన్న ఫీజు బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని వెంకటేష్, రమేష్ లు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. స్కాలర్షిప్ బకాయిలు విడుదల చేయాలని, పెండింగ్ లో ఉన్న ఫీజు రీయంబర్స్ మెంట్ , స్కాలర్ షిప్ బకాయిలు విడుదల చేసి విద్యార్థులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకివ్వాల్సిన దాదాపు 7 వేల కోట్ల పైగా బకాయిలున్నా యని, స్వరాష్ట్రం వస్తే నిధులు నియామకాలు వస్తాయని విద్యార్థులు కోటి ఆశలతో కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో విద్యార్థులకు మొండి చేయి చూపడం చాలా అన్యాయమన్నారు. పెండింగ్ లో ఉన్న ఫీజు బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

# జగత్‌కే నాధుడు జగన్నాథుడు..

- ఆ దేవుడే భక్తుల వద్దకు రావడం అంటే మహత్తర శక్తి ఉన్నట్టే..
- జిల్లా ప్రజల అదృష్టం..రథోత్సవాన్ని ప్రజలంతా విజయవంతం చేయాలి
- ప్రత్యేక పూజలు నిర్వహించిన జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి



కరీంనగర్ బ్యూరో, జులై 12 (జనం సాక్షి) : సకల జగత్తుకే నాధుడు జగన్నాథ స్వామి అని, ఆ స్వామికి మనమందరం కుటుంబ సభ్యులమని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పేర్కొన్నారు. శుక్రవారం కరీంనగర్ లోని కళాభారతి ఎదుట ఏర్పాటు చేసిన బలబద్ర సుభద్ర సమేత జగన్నాథుడి సైకత శిల్పం వద్ద జిల్లా కలెక్టర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... జగన్నాథుడి వద్దకు మనం వెళ్లలేకపోయినా, ఆ స్వామి భక్తుల వద్దకు రావడం జిల్లా అదృష్టమని పేర్కొన్నారు. జూలై 15వ తేదీ న సోమవారం కరీంనగర్లో నిర్వహించనున్న జగన్నాథ రథయాత్రకు ప్రజలంతా పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కరీంనగర్ కు జగన్నాథుడు రావడం అంటే గొప్ప మహా శక్తి దాగి ఉందని జగన్నాథుని బోధనలను అనుసరిస్తూ ప్రజలంతా సన్మార్గంలో పయనించాలని సూచించారు. ఒరిస్సా లో ఉన్న పూరి జగన్నాథ్ కు గొప్ప చరిత్ర ఉందని తెలిపారు. ఒక ఆదివాసీ అడవిలో పూరి జగన్నాథ్ కు నిత్యం పూజలు అందించే వారని ఒక రోజు అతనికి కల వచ్చిందని, దీంతో జగన్నాథుని అడివి నుంచి తీసుకొచ్చి పూరీలో ప్రతిష్టించారని తెలిపారు. దేవుడు అందరికీ సమానమని ఆ స్వామి నిరూపించారని సాలె బేగం అనే ముస్లిం భక్తుడు ఉండేవారని, అతడికి జగన్నాథ స్వామి అంటే ఎంతో ఇష్టమని పేర్కొన్నారు. సాలె బేగం ఆ స్వామి దర్శనం చేసుకునేందుకు ఎంత ప్రయత్నించినా అది సాధ్యం కాలేదని తెలిపారు. ఒకసారి స్వామివారి రథోత్సవం సందర్భంగా రథం ముందుకు వెళ్లలేక వెనక్కు వెళ్లిపోయిందని పేర్కొన్నారు. దీంతో సాలె భేగం స్వామి వారి దర్శనం చేసుకున్నాక రథం ముందు కదిలిందని తెలిపారు. జగన్నాథుడిపై అంత గొప్ప భక్తుడిగా మారిన ముస్లిం కులానికి చెందిన సాలే బేగం భక్తి భావం ఎందరికో ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. అలాంటి భక్తి భావం ఉన్న వ్యక్తిని ఇంత వరకు మనం చూడలేదని తెలిపారు. అన్నీ ఉన్న దేవుడు జగన్నాథుడేనని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. రథయాత్ర నిర్వాహకులు నరహరి ప్రభుజీ మాట్లాడుతూ... ఈనెల 15వ తేదీన కరీంనగర్లో జరగనున్న జగన్నాథుడి రథోత్సవంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొనాలని స్వామివారిని దర్శించుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ సర్దార్ రవీందర్ సింగ్, రథయాత్ర కమిటీ సభ్యులు డాక్టర్ ఎల్. రాజా భాస్కర్ రెడ్డి, చైర్మన్ కన్న కృష్ణ, కో చైర్మన్లు తుమ్మల రమేష్ రెడ్డి, కోమల్ల రాజేందర్ రెడ్డి, కెప్టెన్ బుర్ర మధుసూదన్ రెడ్డి, కొమురవెల్లి వెంకటేశం, స్వామివారి సైకత శిల్పి రూపకర్త శంకర్, ప్రజ్ఞాభారతి బాధ్యులు, సభ్యులు పాల్గొన్నారు.

# వందల మంది గర్భిణులు! ఒక్కరే గైనకాలజిస్టు..






- వైద్యుల కొరతతో ప్రభుత్వాసుపత్రి విలవిల..
- రోజుకు వందలాది సంఖ్యలో రోగులు..
- అంకెల్లో మాత్రమే వైద్య సిబ్బంది..
- రోగులకు సకాలంలో అందని వైద్యం...
- షాద్ నగర్ ప్రభుత్వసుపత్రిలో వైద్యుల కొరత తీరేనా
- 86 మంది ఉండాల్సిన వైద్య సిబ్బందికి కేవలం 42 మంది మాత్రమే..
- ఆరుగురు గైనకాలజిస్టులకు ఒక్కరే దిక్కు..
- ప్రతినెలా 120 మందికి పైగా డెలివరీలు..
- నాటి నుండి నేటి వరకు అదే దుస్థితి

షాద్ నగర్ (జనంసాక్షి) నేను రాను బిడ్డో సర్కారు ధవాఖానాకు మందుళ్ళు గోళీలు అంటూ ఎర్రనీళ్ల మందు సున్నపు నీళ్ల సూదులు నేను రాను బిడ్డో సర్కారు ధవాఖానకు కడుపు నొప్పి అంటూ సర్కారు దవాఖానకు పోతే కాంపౌండర్ వచ్చి కాలుకు పట్టి కట్టే కన్నుకు బాధ అంటూ సర్కారు ధవాఖానకు పోతే ఉన్న కన్నులే పీకేస్తారంట నేను రాను బిడ్డో సర్కారు ధవాఖానా కు వాడు చిట్టి రాస్తే లంచం వీడు గేటు తీస్తే లంచం నేను రాను బిడ్డో సర్కారు ధవాఖానా కు ఇది ఓ సినిమాలో ఓ పాత్ర కానీ ప్రస్తుతం సరిపడా వైద్య సిబ్బంది లేక అటు గర్భిణీ స్త్రీలు ఇటు చిన్నారులు రోగులు సైతం సర్కారు ధవాఖానకు అడుగు పెట్టాలంటే భయపడుతున్న పరిస్థితి నెలకొంది రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ కమ్యూనిటీ ఆసుపత్రిలో నాటి నుండి నేటి వరకు సరిపడా వైద్య సిబ్బంది లేకపోవడంతో ఉన్న సిబ్బందికే పని భారంగా మారింది ఆరుగురు గైనకాలజిస్టులు ఉండాల్సిన ప్రభుత్వసుపత్రిలో ఒక్కరే విధులు నిర్వహిస్తుండడం దానికి తోడు గతంలో ప్రతి నెల 60 మంది గర్భిణీ స్త్రీల డెలివరీలు అయితే ప్రస్తుతం ఆ సంఖ్య 120 కి పైగా చేరింది షాద్ నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న మండలాలైనటువంటి కొందుర్గు చౌదర్ గూడ కేశంపేట నందిగామ కొత్తూరు మండలాల నుండే కాకుండా షాబాద్ బాలనగర్ మండలాల నుంచి కూడా గర్భిణీ స్త్రీలు సైతం ఇక్కడికి వైద్యం కోసం వస్తున్న పరిస్థితి నాటి నుండి నేటి వరకు కొనసాగుతూనే ఉంది గర్భిణీ స్త్రీలకు ప్రతి సోమవారము గురువారము ఓపి చూడడంతో పాటు ప్రతి బుధవారము నాడు వారికి నార్మల్ డెలివరీలతో పాటు అవసరమయ్యే వారికి సిజేరియన్లు కూడా చేస్తున్నారు ఒక్కరే గైనకాలజిస్ట్ ఉండడంతో వారిపైనే తీవ్ర పనిభారం పడుతుంది ఇక చిన్న పిల్లలకు సంబంధించి పీడియాట్రిక్ వైద్యులు ఆరు మంది ఉండాల్సి ఉండగా నలుగురు మాత్రమే ఉన్నారు సివిల్ అసిస్టెంట్ సర్జన్స్ ఇరవై రెండు మందికి గాను కేవలం ఐదుగురే మాత్రమే ఉన్నారు సిఎస్ఎస్ సివిల్ సర్జన్ స్పెషలిస్ట్ కు సంబంధించి తొమ్మిది మందికి ఏనిమిది మంది ఉన్నారు ఇక ల్యాబ్ టెక్నీషియన్స్ ఫార్మసిస్ట్ నర్సింగ్ స్టాఫ్, స్టాఫ్ నర్స్ జూనియర్ అనాలిస్ట్ ఇలా మొత్తం 86 మందికి కేవలం 42 మంది మాత్రమే ఉండడంతో ఉన్న సిబ్బందిపై పనిభారం పడుతుందని ప్రభుత్వం పూర్తిస్థాయిలో వైద్య సిబ్బందిని నియమించాలని కోరుతున్నారు అత్యవసర సమయంలో పూర్తి స్థాయిలో సౌకర్యాలు కూడా లేకపోవడంతో గర్భిణీ స్త్రీలను హైదరాబాద్ జెజ్జీఖానా పాముకాటుకు గురై పురుగుల మందు తాగి రోడ్డు ప్రమాదానికి గురైన వారిని మెరుగైన సౌకర్యాలు లేకపోవడంతో హైదారాబాద్ ఉస్మానియాకు రేఫర్ చేస్తున్న పరిస్థితి ఉంది కాబట్టి ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి మెరుగైన సౌకర్యాలతో పాటు పూర్తిస్థాయిలో వైద్య సిబ్బందిని నియమించాలని కోరుతున్నారు.

జనంసాక్షి www.janamsakshi.org
శనివారం 13 జూలై 2024

# పెదిరి రామచంద్ర రెడ్డి భూమిని దానం చేసిన మహనీయుడు



పెదిరి రామచంద్రారెడ్డి, భూదాన ఉద్యమంలో తన భూమిని పేద ప్రజలకు దానం చేసిన మహనీయుడు. భారతదేశంలో భూమి సంస్కరణలకు ప్రేరణగా నిలిచిన త్యాగశీలి. సంపదనం పెంచుకోవడమే కాదు అదే సంపదను పేద ప్రజలకు పంచటం కూడా సమాజ దేశాభివృద్ధికి తోడ్పడుతుందని తెలియజేసి, పేద ప్రజలకు వ్యవసాయం చేసుకోవడానికి ఆహారం పండించడానికి తన దగ్గర ఉన్న భూమిని దానం చేసిన మహానుభావుడు. పెదిరి రామచంద్ర రెడ్డి, 20వ శతాబ్దపు భారతదేశంలోని తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఒక మహానుభావుడు. భూమిని దానం చేయడానికి ప్రేరేపించబడిన భూదాన ఉద్యమంలో ఆయన కీలక పాత్ర పోషించారు. 1905 జులై 13న ప్రస్తుత తెలంగాణ యాదాద్రి భువనగిరి జిల్లా పోచంపల్లి గ్రామంలో భూస్వాముల కుటుంబంలో జన్మించాడు. 1947 ఆగస్టు 15 నుంచి 1948 సెప్టెంబర్ 17 వరకు జరిగిన తెలంగాణ సాయుధ పోరాట ఉద్యమంలో రావినారాయణరెడ్డి తో కలిసి పోరాటం సాగించి హైదరాబాద్ స్వతంత్ర ఉద్యమంలో కీలక పాత్ర వహించాడు. ఆ తరువాత గాంధీ ఆశయ సాధన ప్రయత్నిస్తూ 1951 ఏప్రిల్ 18న ఆచార్య వినోబాభావే చే ప్రారంభమైన బోధన ఉద్యమంలో భాగంగా రామచంద్రారెడ్డి తన తండ్రి నరసా రెడ్డి జ్ఞాపకార్థం 100 ఎకరాల భూమిని భూదానోద్యమంలో భాగంగా పేద ప్రజలకు తన భూమిని పంచిపెట్టాడు. ఆ తర్వాత ఆచార్య వినోబాభావే ఆశయ సాధన లో భాగస్తుడై "ఎనిమిది వందల" ఎకరాలను పేద ప్రజలకు తన భూమిని పంచతం జరిగింది. రామచంద్రారెడ్డి సామాజిక స్పృహతో తెలంగాణ అభివృద్ధిలో భాగంగా పేద ప్రజలకి తనకున్న భూమిని త్యాగం చేసి ఒక సామాజిక సంఘసంస్కర్తగా తనదైన తన ముద్రను చరిత్ర స్థాయిగా నిలుపుకున్నాడు. తనని ఆదర్శంగా తీసుకొని తెలంగాణలో అనేక మంది భూమిని దానం చేశారు. భూమిలేని పేదలకు భూమిని పంపిణీ చేయడానికి ఆయన కృషి చేశారు. భూదాన ఉద్యమంతో పాటు, రామచంద్ర రెడ్డి అనేక సామాజిక సంస్కరణలకు కృషి చేశారు.

అంటరానివారి వెలివేత, విద్య, ఆరోగ్యం వంటి రంగాలలో అందరికీ న్యాయం జరగాలని, ఆయన పోరాటం చేశారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కృషి చేశారు. రామచంద్రారెడ్డి పేద ప్రజలకు చేసిన సేవకులను పోచంపల్లి గ్రామం మధ్యలో 2006వ సంవత్సరంలో తన విగ్రహాన్ని నిర్మించడం జరిగింది. రామచంద్రారెడ్డి చేసిన భూదాన ఉద్యమాన్ని ప్రేరణగా చేసుకొని తన మనవడైన అరవింద్ రెడ్డి తనపై తెలుగు చలనచిత్రాన్ని నిర్మించడం జరిగింది. ఆ తర్వాత కేంద్ర ప్రభుత్వం రామచంద్రారెడ్డి సేవలను గుర్తించి 2022 జూలై 17న రామచంద్రారెడ్డి పేరు మీద పోస్టల్ కవర్ రూపొందించారు. రామచంద్రారెడ్డి 1986 డిసెంబర్ తొమ్మిదిన మరణించారు. అయినప్పటికీ నేటికీ తెలంగాణలోనే కాదు దేశవ్యాప్తంగా రామచంద్రారెడ్డి చేసిన సేవలు చరిత్ర ఎన్నటికీ మరువలేదు. రామచంద్రారెడ్డి ఒక నిజమైన సమాజ సేవకుడు. అతని దాతృత్వం సామాజిక సేవ తెలంగాణ రాష్ట్రం ఎప్పటికీ మర్చిపోదు. సామాజిక న్యాయం సమానత్వం కోసం అంకితభావంతో కృషిచేసిన రామచంద్రారెడ్డిని చరిత్ర ఎప్పటికీ మరువదు అతని స్ఫూర్తితో నేటి యువత సమ సమాజ నిర్మాణంలో పయనించాలని ఆశిద్దాం. భూమిలేని పేదలకు భూమిని అందించడానికి ఆయన చేసిన కృషి చాలా మంది జీవితాలను మెరుగుపరచింది. ఆయన తన త్యాగం మరియు సేవ ద్వారా భారత దేశంలోని అనేక మందికి స్ఫూర్తినిచ్చారు.

(జులై 13 భూదాన ఉద్యమకారుడు రామచంద్రారెడ్డి జయంతి సందర్భంగా)



**పూసపాటి వేదాద్రి**
కవి, సాహితీ విశ్లేషకులు
9912197694

# మానవత్వం సమాధైంది!

*ఎస్ మానవత్వం అక్కడ సమాధి అయ్యింది. ప్రతీ పసి వాడి ఆకలి కేక, అక్కడ చావు కేక అయిపోతుంది. నవజాతి శిశువుల మరణాలకు అయితే లెక్కే లేదు! యుద్ధం ఎవరి కోసం? ఎందుకోసం?దేశ రక్షణ పేరు మీద, మారణ హెూమం సృష్టిస్తున్న ఏకపక్ష యుద్దాలు అవసరమా?ఇక్కడ మనం ప్రస్తుతం ఉక్రెన్, రష్యా యుద్ధం కోసం కాదు, 'గాజా' మీద ఇజ్రాయిల్ ఏకపక్ష, అమానవీయ యుద్ధం, బాంబుల దాడి కోసం మాట్లాడుతున్నాం. ఇదేమి యుద్ధం, ప్రపంచం మూకుమ్మడిగా పాలస్థినీయుల 'గాజా' పట్టి మీద ఇజ్రాయిల్ దాడి గురించి ఆందోళన చెందుతున్నది. అయినా ఇజ్రాయిల్ ప్రధానికి పట్టదు! అక్టోబర్ ఏడు,2023 నుంచి ఇజ్రాయిల్ వరుస బాంబుదాడుల ఫలితంగా ఇప్పటికి 1,86,000 మంది పాలస్థినీయులు తమ ఊపిరి వదిలారు. ఇంకా ప్రాణాలు పోతూనే ఉన్నాయి. బక్రీద్, రంజాన్ లలో ప్రార్ధనలు సైతం పాలస్థినీయులు కూలిన తమ భవనాల వద్దే పూర్తి చేశారు. తమని కాపాడాలని అల్లా ను వేడుకున్నారు. 'గాజా' 70 శాతం బర్బాద్ అయిపోయింది.*



**ఎండి.మునీర్**
సీనియర్ జర్నలిస్ట్, విశ్లేషకులు
9951865223





ఇందులో సగానికి పైగా స్త్రీలు, పిల్లలే ఉన్నారు. అక్టోబర్ 4 న హమాస్ అనే తీవ్రవాద సంస్థ ఇజ్రాయిల్ మీద జరిపిన దాడిలో వెయ్యి మంది మరణించారు. ఆ వెంటనే ఇజ్రాయిల్ హమాస్ కు గాజా నే స్థావరం గా పేర్కొంటూ వారిని మట్టు పెట్టే పేరిట యుద్ధం మొదలు పెట్టింది. సగానికి పైగా భవనాలను కూల్చివేయడం తో పాటు, పెద్ద, పెద్ద ఆసుపత్రుల ను నేల మట్టం చేసింది ఇజ్రాయిల్,చివరికి, మంచినీరు, తిండి గింజలు లభించకుండా చేసింది. విదేశాల నుంచి వచ్చిన మానవ సహాయం ను కూడ అందకుండా చేసింది. యుద్ధంలో 38 వేల మంది దాకా నేరుగా మరణించగా, మూడింతలు అనారోగ్యం, ఆకలితో, వైద్యం అందక మరణించిన వారున్నారు అంటారు.

**జీవన విధ్వంసం!**

కేవలం 23 లక్షల జనాభా ఉన్న 'గాజా' లో ఇజ్రాయిల్ పెద్ద ఎత్తున మానవ, జీవన విధ్వంసం కు పాల్పడింది. భవనాల కింద మట్టిలో ఎందరో సజీవ సమాధికి గురి అయ్యారు. ఆకలి,చావుకేకల 'గాజా'అయిపోయింది. ప్రపంచ కోర్ట్ లో ఇజ్రాయిల్ ప్రధాన మంత్రి నెతన్యాహు క్రూరత్వం మీద కరీంఖాన్ అనే చీఫ్ ప్రాస్యుక్యూటర్ కేసు వేశారు. ఇంత మారణహెూమం సృష్టిస్తున్నప్పటికి హమాస్ ముఖ్య నేతలను ఇజ్రాయిల్ ఏమి చేయలేకపోయారు. కనీసం వారి బంధీలను విడుదల చేయించలేకపోయారు. మరోవైపు యుద్ధం ఆపాలని, యుద్ధ ప్రకటన చేస్తే బంధీలను విడుదల చేస్తామని, హమాస్ పేర్కొంటున్నది. ఇజ్రాయిల్ దేశ రక్షణ కోసం యుద్ధం అంటూ నెతన్యాహు అమానవీయ, ఏకపక్ష బాంబు దాడులకు పాల్పడుతున్నాడు.

**పాలస్థినీయులను మట్టుబెట్టాలని!**

మొత్తంగా పాలస్థినియులను మట్టుబెట్టాలనే దుర్బుద్ధి తో నెతన్యాహు ఉన్నాడు. ఐక్య రాజ్యసమితి లో మెజారిటీ దేశాలు యుద్ధ విరమణ కోరినా ఆయన వైఖరిలో మార్పు లేదు. యుద్ధం మానితే తాను ఎన్నికల్లో, గెలుస్తానో, లేదో అనే ఆలోచన కూడ నెతన్యాహుకు ఉన్నట్లు కనిపిస్తున్నది. మరణించిన వారు 1,86,000 ఉంటే గాయపడిన, ప్రతీ రోజు ఊపిరిని నిలబెట్టుకోవడం కోసం తన్లాడుతున్న వారు ఐదు లక్షలకు పైగానే ఉంటారు అంటున్నారు. ఒక మహిళా జర్నలిస్ట్ తన ప్రాణాలు కాపాడుకోడానికి 12 సార్లు గాజా లో తాను ఉండే చోటు నుంచి బాంబుదాడుల నుంచి తప్పించుకుంటూ స్థావరం మార్చినట్లు పలు రిపోర్ట్ లలో చూసాను. పదుల సంఖ్యలో ఇక్కడి వార్త లు స్టోరీలు కవర్ చేస్తూ జర్నలిస్ట్ లు తమ ఊపిరి కోల్పోయిన విషయం విధితమే!ఇంకా ఎంతో మంది జర్నలిస్ట్ లు అక్కడ గోస పడుతున్నారు. ప్రపంచం లో మనిషి అనే ప్రతీ ఒక్కడు స్పందిస్తున్నప్పటికి, గాజా పై దాడిని అపాలని కోరుతున్నప్పటికి ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహు మాత్రం అతి క్రూరమైన తన చర్యలను మానడం లేదు! స్వదేశంలోనూ ఆయన చర్యల పట్ల ప్రజలు సంతోషంగా లేరు!

## పోరాడుదాం.. పోరాడుదాం..

పోరాడుదాం... పోరాడుదాం...
అన్యాయాలని ఎదిరించడానికి
దారి పొడువునా ఎదురయ్యే
అడ్డంకులను తొలగించుకుంటూ
విరామ మెరుగక పోరాడుదాం.
పోరాడుదాం... పోరాడుదాం...
సమాజంలో పాతుకుపోయిన
మూఢనమ్మకాల బూజు దులపడానికి
ఎంచుకున్న మార్గం ఏదైనా
మార్పు కోసం పోరాడుదాం.
పోరాడుదాం... పోరాడుదాం...
నీ హక్కులను అనుభవించడానికి
ప్రభుత్వం విధించే ఆంక్షల
ఛత్రాన్ని ఛేదించుకుంటూ
స్వేచ్ఛ కోసం పోరాడుదాం.
పోరాడుదాం... పోరాడుదాం...
బలహీనుడి కడుపు కొట్టి
బలవంతుడి కడుపు నింపే
కార్పోరేట్ ప్రభుత్వ విధానాలకు
వ్యతిరేకంగా పోరాడుదాం.
పోరాడుదాం... పోరాడుదాం
%మానవత్వ విలువలు మంటగలిపి
నైతిక విలువలకు తిలోదకాలద్ది
నగరాల నడిబొడ్డున
ఆడబిడ్డల మాన ప్రాణాలను
బలితీస్తున్న మానవ మృగాలకు
వ్యతిరేకంగా పోరాడుదాం.
పోరాడుదాం... పోరాడుదాం
మన్ననల కోసం కాకుండా
మార్పు కోసం పోరాడుదాం
పోరాటాలు లేని చోట
పాలకులు నియంతలౌతారు
పాలితులు బానిసలౌవుతారు
ఇంకెన్నాళ్ళీ మనకీ
బానిస బ్రతుకులు
పోరాడితే విజయం తధ్యం.

- కోనేటి నరేష్, శ్రీ సత్య సాయి జిల్లా,
8499847863

# ఆ రెండు అప'జయాలు'.. భావితరాలకు స్ఫూర్తి శిఖరాలు!

*స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలు దాటుతున్నా పేదరికం, నిరుద్యోగం, నిరక్షరాస్యత,రైతుల ఆత్మహత్యలు వంటి సమస్యలతో సతమవుతున్న మన దేశంలో వందల కోట్ల రూపాయలు వెచ్చించి అంతరిక్ష రాకెట్ ప్రయోగాలు అవసరమా? అని కొంత మేధావి వర్గం విమర్శలకు ధీటుగా.."మన దేశంలోని అంతర్గత సమస్యలపై మనందరం ఐకమత్యంగా బాధ్యతతో యుద్ధం చేద్దాం.కానీ విక్రమ్ సారాభాయ్, అబ్దుల్ కలాం వంటి మహానుభావుల చెప్పినట్లు అభివృద్ధి చెందిన దేశంగా మనం ఎదగాలంటే శాస్త్ర, సాంకేతిక రంగాల్లో మనం ప్రపంచానికి దిక్సూచి కావాలి.కేవలం దీపావళి పండుగ టపాసులకు దేశవ్యాప్తంగా కొన్ని వందల కోట్ల రూపాయలు ఖర్చుచేస్తున్నాం మనమంతా..!"అంటూ స్పందించింది యావత్ భారతం.*






చంద్రయాన్-1మిషన్ సక్సెస్ తో ప్రపంచం దృష్టిని ఆకర్షించిన మన ఇస్రో బృందం చంద్రుని ఉపరితలంపైకి విక్రమ్ ల్యాండర్ ను చేర్చడమే లక్ష్యంగా చేసిన అసాధారణ ప్రయోగం చంద్రయాన్-2. 2019జూలై22న లాంచ్ చేసిన ఈప్రయోగం ఎన్నో దశలను దాటుకుంటూ 95%సఫలం అయిన తర్వాత ఆ మిషన్ సెప్టెంబర్ 7,2019 నాడు కేవలం చంద్రుడి ఉపరితలం నుంచి 2.1కిమీ ఎత్తున ల్యాండర్ భూమి తో సాఫ్ట్ వేర్ సమస్య తలెత్తి సంధానం తెగిపోయింది. సాధారణంగా క్రికెట్, సినిమా,రాజకీయాలపై మాత్రమే ఆసక్తి చూపే ఈ దేశ యువత ఆ రోజు అర్థరాత్రి మన జాతీయ జెండాలతో టివిలలో కార్యక్రమాన్ని ప్రత్యక్షంగా వీక్షించింది.కొన్ని లక్షల కిమీ సుదూర ప్రయాణం లో లక్ష్యానికి చేరువలో కొన్ని సెకన్ల వ్యవధిలో అవకాశం చేజారడం యావత్ మన దేశాన్ని తీవ్ర భావోద్వేగపు కన్నీళ్లతో ముంచేసింది.ఆగని కన్నీళ్లతో వున్న అప్పటి ఇస్రో చైర్మన్ కె.శివన్ ను మన ప్రధాని ఓదార్చిన దృశ్యం ఇప్పటికీ మన మనస్సులోనే వుంది.అయినా మన శాస్త్రవేత్తల, ఇంజనీర్ల కృషిని యావత్ భారతం కీర్తించింది.

వేల సంవత్సరాలుగా విభిన్న మతాల వైవిధ్యంలోని ఏకత్వంతో మానవత్వాన్ని చాటిచెప్పే మన భారత భూమిపై అందరికీ నచ్చిన మతం క్రికెట్.మహేంద్ర సింగ్ ధోనీ నాయకత్వంలో 2011 ఐసిసి వన్డే ప్రపంచకప్ గెలిచి మన క్రికెట్ దేవుడు మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్ ని తోటి ఆటగాళ్ళు హార్భజన్, కోహ్లి, యువరాజ్ సింగ్ తదితరులు తమ భుజాలపై మోసిన దృశ్యం సచిన్ రెండు రెండు దశాబ్దాల కలకు,శ్రమకు,పట్టుదలకు, అంకితభావానికి నిదర్శనం. ఈ జ్ఞాపకాలతో స్వదేశంలో జరిగిన 2023 ఐసిసి వన్డే ప్రపంచకప్ టోర్నమెంట్ లోని అన్ని మ్యాచ్ లు గెలిచిన భారత జట్టు ఫైనల్లో ఆస్ట్రేలియాతో తలపడింది.ఆ రోజు దాదాపు 518మిలియన్ల వీక్షణలు జరిగాయి.టాస్ ఓడి బ్యాటింగ్ కు వచ్చిన మన ఆటగాళ్ల ఆటకు ప్రతి భారతీయుడి గుండెవేగం పెరుగుతూనే వచ్చింది.కేవలం 240 పరుగుల వద్ద మన ఇన్నింగ్స్ ముగిసింది.తర్వాత వచ్చిన ఆసీస్ బ్యాట్స్ మన్ టావిస్ హెడ్(137) బ్యాటింగ్ విధ్వంసానికి 140 కోట్ల ప్రజల కలలు కన్నీళ్లయ్యాయి.పాట్ కమిన్స్ నాయకత్వం లో 2023 వరల్డ్ కప్ విజేతగా ఆస్ట్రేలియా (6వసారి)గెలిచింది.రోహిత్,కోహ్లి తదితర ఆటగాళ్ళ భావోద్వేగాలను కళ్ళారా చూశాం మనం ఆ సమయంలో.అయినా ఓటమి బాధతో మళ్ళీ ఓ స్వప్నం కోసం మన రోజుకోసం వేచివున్నాం.

2024 ట్వంటీ ట్వంటీ వరల్డ్ కప్ సమరం ఆరంభమయ్యింది.మన రోజు రానే వచ్చింది జూన్ 29,2024.ఆ అర్థరాత్రిలో కూడా 140 కోట్లమంది భారతీయుల కళ్ళల్లో విజయ కాంక్షపు వెలుగులు ప్రసరిస్తున్నాయి.ట్వంటీ ట్వంటీ వరల్డ్ కప్ 2024 ఫైనల్ లో భారత్ దక్షిణాఫ్రికా తో తలపడింది.మొదట బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 20ఓవర్లలో 176/7 పరుగులు చేసింది.అనంతరం బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికా ఆటగాళ్ళ ఆట చివరి ఐదు ఓవర్లు మన దేశాన్ని ఒక్కసారిగా ఉలిక్కిపడేలా చేసింది.ఓటమిని ఒప్పుకోని రోహిత్ సేన చేసిన పోరాటం యావత్ ప్రపంచపు క్రికెట్ అభిమానుల మనస్సు గెలిచింది.సూర్యకుమార్ పట్టిన క్యాచ్,చివరి బాల్ అయిపోగానే మళ్ళీ ఒకప్పటి కన్నీళ్లతో ఆ గ్రౌండ్ లోని మట్టిని ముద్దాడిన రోహిత్ తో కూడిన కోహ్లి విజయ గర్జన మళ్ళీ ఓసారి మనదేశపు త్రివర్ణ పతాకాన్ని ఎవ్వరికీ అందనంత స్థాయిలో నిలబెట్టింది.దక్షిణాఫ్రికాపై 7 పరుగుల తేడాతో గెలిచి 2024 ట్వంటీ ట్వంటీ విశ్వ విజేత గా భారత్ (2వసారి) ఆవిర్భవించింది.అంతే ఆ అర్థరాత్రిలోనే మన దేశపు నడిరోడ్లపై మన యువత మన జాతీయ జెండాల ప్రదర్శనతో మన విజయ గీతాన్ని ప్రపంచానికి ప్రకటించింది.కలాం గారు అన్నట్లు "మన కలలన్నీ నిజమవుతాయి.కానీ దానికి ముందు నువ్వు ఎన్నో సవాళ్ళను స్వీకరించాలి."

చంద్రయాన్ -2 లోని చిన్న చిన్న పొరపాట్ల నుంచి పాఠాలు నేర్చుకొని ఇస్రో ఈ సారి చంద్రయాన్ -3 మిషన్ సాయంతో చంద్రుని ఉపరితలంపై ఖచ్చితంగా భారత జెండా నిలపాలనే లక్ష్యంతో మన అందరి హీరో విక్రమ్ సారాభాయ్ స్ఫూర్తితో విక్రమ్ ల్యాండర్ జూలై 14,2023 ప్రయాణం మొదలెట్టింది.ఎన్నోరోజులు,ఎన్నో దశలు దాటుకుంటూ ఆగష్టు 23 వరకు వెళ్లింది.సాయంత్రం 6 గంటలకు మనమంతా నూతన చరిత్ర రాసే సమయం ఆసన్నమైంది.ఇస్రో ఛైర్మన్ సోమనాథ్ గారి కళ్ళల్లో ఆత్మవిశ్వాసం బలంగా వికసిస్తూనే వుంది.అయినా మనందరి గుండెల్లో తృటిలో చేజారిన ఆనాటి చంద్రయాన్ -2 విజయపు జ్ఞాపకం ఆందోళనను రెట్టింపు చేసింది.అందరూ టివిలముందు ప్రత్యక్ష ప్రసారంలో లీనమయ్యారు.ఈ సారి మన గురి తప్పలేదు.విక్రమ్ ల్యాండర్ ఇస్రోకి సందేశం పంపింది.' **India,I reached my destination and you too!**".ఎక్కడ పోగొట్టుకున్నామో అక్కడే గెలిచాం.అంతర్జాతీయంగా భారత్ సత్తాను చూపాం."హాలీవుడ్ సినిమా నిర్మాణం కంటే తక్కువ ఖర్చుతో భారత్ చంద్రుని ఉపరితలాన్ని చేరిందని" ప్రపంచ మీడియా మన శాస్త్రవేత్తలు, ఇంజనీర్ల కృషిని, స్ఫూర్తిని అభినందించింది.ప్రతి భారతీయుడి గుండె చంద్రున్ని ముద్దాడింది.

ఇక్కడ విశేషం ఏమిటంటే చంద్రయాన్ -2, చంద్రయాన్ -3 సందర్భాల్లో ఇస్రో కు, 2023,2024 వరల్డ్ కప్ లో మన క్రికెటర్లకు మన దేశం నుంచి సంపూర్ణ మద్దతునిస్తూ, ప్రోత్సాహం అందిస్తూ,ఓటమిని గెలుపు గా మార్చడంలో క్రియాశీలక పాత్ర పోషించిన వ్యక్తి..నేడు వరుసగా మూడవ సారి మనదేశానికి ప్రధాన మంత్రిగా పనిచేస్తున్న నరేంద్రమోడీ. ఈ ప్రయాణంలో ఆయన పాత్రకు ప్రతి భారతీయుడు గర్వ పడాలి.నిత్యం కుటుంబ, వ్యాపార,చదువు,ఉద్యోగ, ఆర్థిక వంటి ఎన్నో సమస్యలతో సతమవుతు డిప్రెషన్ లో ఆత్మహత్యలు చేసుకోవాలనుకుంటున్న ప్రపంచ యువతరానికి చంద్రయాన్ -2 నుంచి చంద్రయాన్ -3 మరియు 2023 వన్డే క్రికెట్ వరల్డ్ కప్ నుంచి 2024 ట్వంటీ ట్వంటీ వరల్డ్ కప్ సాగిన మన శాస్త్రవేత్తలు, ఇంజనీర్లు, సాంకేతిక నిపుణులు, క్రికెటర్లు తదితరులు సాగించిన ప్రయాణం అనితరసాధ్యం. స్ఫూర్తిదాయకం. విశ్వవిఖ్యాత ఖగోళ భౌతిక శాస్త్రవేత్త స్టీఫెన్ హాకింగ్ అన్నట్లు..."ఈ విశ్వం ఎంత పెద్దదైనా కావచ్చు.కానీ నీ ప్రయత్నం ముందు చాలా చిన్నదే..!".



**ఫిజిక్స్ అరుణ్ కుమార్**
మోటివేషనల్ స్పీకర్, కవి, రచయిత,సామాజిక కార్యకర్త
నాగర్ కర్నూల్
9394749536

# జనాభా లెక్కలు తేల్చేదెప్పుడు?

దేశ అభివృద్ధికి కావలసిన మానవ వనరులను అందించడంలో దేశ జనాభా బహుముఖ పాత్ర పోషిస్తుంది. జనగణన చట్టం ప్రకారం భారత దేశంలో ప్రతి పది సంవత్సరాలకు ఒకసారి జనాభా లెక్కలు సేకరిస్తారు. ప్రతి పది ఏళ్ళకు ఒక సారి లెక్కించే జనాభా లెక్కల సేకరణ.వల్ల జనాభా ఎంత మేరకు పెరిగిందో తెలుసుకోవచ్చు. జన గణన ఆధారంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు, అభివృద్ధి ప్రణాళిక, అభివృద్ధి పథకాలు ప్రాజెక్టుల నిర్మాణం విద్య వైద్య రంగాల అభివృద్ధి పథకాలు, ప్రజా సంక్షేమ పథకాల రూపకల్పన జరుగుతుంది. జనాభా లెక్కలు సకాలములో చేపట్టక పోవడం వల్ల పేదరికం' నిరుద్యోగం' ప్రాంతీయ అసమానతలు 'ఆర్థిక అసమానతలు ఆదాయ అసమానతలు స్త్రీ 'పురుష అసమానతలు 'లింగ వివక్ష 'బాల కార్మికులు ' శ్రామికుల వలస వికలాంగుల సంక్షేమం మున్నగు సమస్యల పరిష్కారం పై ప్రత్యక్ష పరోక్ష ప్రభావం ఉంటుంది. జనాభా పెరిగిన దేశం (నిష్పత్తిలో) ప్రభుత్వ రంగంలో పెట్టుబడులు పెరగక పోవడం వల్ల రాజ్యాంగ లక్ష్యమైన ఆర్థిక న్యాయం పంపిణీ న్యాయం ఎండమావిగానే మారింది. జాతీయ శాంపిల్ సర్వే జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ఆర్థిక సర్వే మొదలగు కీలక అధ్యయనాలకు జనాభా లెక్కలు కీలకం అయినప్పటికీ జనాభా గణన 3 యేళ్లు ఆలస్యమైంది.

కరోనా మహమ్మారి కారణంగా జనాభా లెక్కల సేకరణ ఆలస్యమైంది. పరిస్థితులు చక్కబడినప్పటికి కేంద్ర ప్రభుత్వం జనాభా గణన పట్ల అంతగా ఆసక్తి చూపడం లేదు. ఇప్పటికీ కేంద్ర ప్రభుత్వం జనాభా గణన నిర్వహణ పట్ల స్పష్టత ఇవ్వడం లేదు. జనాభా లెక్కలను వాయిదా వేయడం మీద చూపించే శ్రద్ధ నిర్వహణ పట్ల దృష్టి పెట్టని స్థితి నెలకొనడం వల్ల ప్రజా సంక్షేమం అటకెక్కింది.

**జనాభా గణన - చరిత్ర**

మన దేశంలో బ్రిటిష్ వారు తొలి జన గణన 1881 సం" లో నిర్వహించారు. బ్రిటిష్ వాళ్ళ పాలన కాలంలో దేశంలో కొన్ని విపత్తులు



సంభవించినప్పటికి జనాభా గణన వాయిదా పడలేదు. రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో జనాభా లెక్కలు సేకరించారు .వాయిదా వేయలేదు. దేశంలో 1918 లో దేశవ్యాప్తంగా స్పానిష్ ఫ్లూ ఏర్పడి ప్రజారోగ్యం దెబ్బతిన్న జనగణన ఆగిపోలేదు. 1921 లో రిజిస్ట్రార్ జనరల్ జనాభా లెక్కల కమిషనర్ కార్యాలయం జన గణన సకాలములో పూర్తి చేసింది. 1947 లో దేశ విభజన జరిగి పాకిస్థాన్ భారత దేశంగా విడిపోయినప్పటికీ జనాభా లెక్కలు ఆగిపోలేదు. బ్రిటిష్ వారి నుండి భారతీయులకు అధికార బదిలీ గందరగోళ పరిస్థితులు ఉన్నప్పటికీ 1951 లో జన గణన యదా విధంగా జరిగింది.

జనాభా లెక్కలు సేకరణ నిర్వహణకు ఒక సంవత్సరం ముందు నుండే ప్రణాళికలు రూపొందించి ఆ ప్రణాళిక ప్రకారం 2020 ఏప్రిల్ సెప్టెంబర్ మధ్య దేశం లోని అన్ని గృహాలకు వెళ్లి గృహాల లో నివాసం ఉంటున్న వ్యక్తుల వివరాలు సేకరించి తర్వాత సంవత్సరం ఫిబ్రవరిలో దేశము లోని మొత్తం జనాభా లెక్కిస్తారు కాని దేశంలో విజృంభించిన కరోనా మహమ్మారి వల్ల జన కదలిక మీద విధించిన నిబంధనలు అమలు వల్ల జనాభా గణన వీలు పడలేదు. కరోనా అనంతరం జనాభా గణన వాయిదా పడుతూనే వుంది. గతంలో జనాభా గణన సరిగ్గా జరుగలేదని సేకరించిన వివరాలు కచ్చితంగా లేవని జనాభా గణన కొత్త పద్ధతిలో చేపడతామని నూతన సాంకేతిక ఎలక్ట్రానిక్ పద్ధతిలో చేపట్టనున్నట్లు దేశ కేంద్ర హెూంమంత్రి అమిత్ షా వెల్లడించారు ఈ సారి జనాభా గణనలో ఇంతకు ముందు ఎన్నడూ లేని విధంగా 35 కంటే ఎక్కువ సామాజిక ఆర్థిక కొలమానాల ఆధారంగా జనాభా లెక్కలు స్వీకరించనున్నట్లు వెల్లడించారు. జన గణన ఆధారంగా జనాభా రిజిస్టర్ ఎలక్టోరల్ రోల్ రిజిస్టర్ 'ఆధార్ కార్డు రేషన్ కార్డు 'పాస్ పోర్ట్ ' డ్రైవింగ్ లైసెన్స్ కు సంబంధించిన వివరాలను డాటాను అప్డేట్ చేసి నవీకరించడానికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు కేంద్ర హెూంమంత్రి అమిత్ షా చెప్పడం గమనార్హం.

దేశంలో 2024 న లోకసభకు సార్వత్రిక ఎన్నికలు జరుగుతాయి .ఎన్నికల వల్ల జనాభా లెక్కల సేకరణ చేపట్టే అవకాశాలు లేవు. దేశంలో లోక్ సభ 'రాష్ట్ర విధాన సభల్లో మహిళా రిజర్వేషన్ బీసీ రిజర్వేషన్ జనగణనలో కుల గణన చేపట్టాలని డిమాండ్ బలంగా వున్నందున 2027 లో జరిగే జనాభా లెక్కల్లో పలు అంశాలను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది. జనాభా లెక్కల ప్రకారం లోకసభకు రాష్ట్ర విధాన సభలకు ఎస్సీ 'ఎస్టీ 'మహిళా' బి'సి రిజర్వేషన్ నిర్ధారించడం లోక్ సభ 'విధాన సభ నియోజక వర్గాల పరిధిని నిర్ణయించడం జరుగుతుంది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విడివిడిగా ప్రవేశ పెట్టే వార్షిక బడ్జెట్ లో ఎస్సీ ఎస్.స్టీల బీ.సీ ల సంక్షేమానికి వ్యవసాయ " పారిశ్రామిక ' సేవా రంగాలకు నిధుల కేటాయింపు జనాభా నిష్పత్తి ప్రకారం చెయ్యాలి .జన గణన తో ఆర్థిక వ్యవస్థలో వృధి' అభివృద్ధి స్థాయిలను అంచనా వేయవచ్చును. దేశంలో వెనుక బడిన ప్రాంతాలు పర్వత ప్రాంతాల ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి సమస్యల పరిష్కారం కోసం జనాభా గణన దిక్సూచి లాగా పనిచేస్తుంది..

ప్రభుత్వం జనాభా లెక్కలను నిర్దిష్ట కాలంలో నిర్వహించకపోవడం వల్ల అనేక నష్టాలు జరుగుతున్నాయి. దొంగ ఓట్ల బెడద ప్రభుత్వం జనాభా లెక్కలను సకాలంలో నిర్వహించి వుంటే జనాభా జాబితా తో ఓటర్ల జాబితాను సరిచుకునేది. దీని వల్ల దొంగ ఓటర్ల బెడద నమోదును అడ్డుకునే అవకాశం ఉండేది. దేశవ్యాప్తంగా అనేక నియోజక.వర్గాలలో ఒకే ఓటరు గ్రామీణ ప్రాంతంలో పట్టణ ప్రాంతాల నియోజక వర్గాలలో ఓటర్లుగా నమోదైన సంఘటనలు చోటు చేసుకున్నాయి. ఉదాహరణకు ఆంధ్రప్రదేశ్ లో నకిలీ ఓటర్లు అధిక సంఖ్యలో రిజిస్టర్ అయినట్లు తెలుస్తోంది. ఇంటి నెంబర్ "నో " అనే పేరు మీద వందల ఓటర్లు నమోదు అయినట్లు తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మరో వైపు నకిలీ ఆధార్ కార్డులు పెరిగి పోతున్నాయి. ఆధార్ కార్డ్ రేషన్ కార్డ్ జన్ దన్ ఖాతాలు ఆధార్ కార్డుతో అనుసంధానించడం వల్ల అనేక ప్రభుత్వ ప్రాయోజిత పథకాల ప్రయోజనాలు అసలు లబ్ధిదారులకు అందడం లేదు. నకిలీ వ్యక్తులు ప్రయోజనం పొందుతున్నారు. కేంద్ర ప్రభుత్వం సకాలంలో జనాభా లెక్కలు సేకరిస్తే ఇలాంటి నష్టాలను అరికట్టవచ్చును. మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో అటవీ కొండ ప్రాంతాల్లో నివసించే వారికి ఆధార్ కార్డ్ ను అందుబాటులోకి తేవాలి. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరంగా వున్న వారిని అభివృద్ధి సంక్షేమ పథకాలలో భాగస్వాములను చేయాలంటే జనాభా లెక్కలు సేకరించాలి.

ఇప్పటికీ దేశంలో 2011లో నిర్వహించిన జనాభా లెక్కల ప్రకారమే రేషన్ కార్డులు జారీ చేయడం వల్ల 10 కోట్ల మంది అసలైన లబ్ధిదారులు నష్ట పోతున్నారు ఒక అధ్యయనంలో వెల్లడైంది. జనాభా గణన ఆలస్యం అయితే కోట్లాది లబ్ది దారులు నష్టపోయే ప్రమాదం వుంది. ప్రభుత్వం త్వరిత గతిన సకాలములో జనాభా లెక్కలు పూర్తి చేసేందుకు కార్యాచరణ ప్రణాళికలు చేపట్టాలి. జనగణన పైననే జన సంక్షేమం అభివృద్ధి ఆధారపడి వుంది.

(ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా)



**నేదునూరి కనకయ్య**
అధ్యక్షులు, తెలంగాణ ఎకనామిక్ ఫోరం
కరీంనగర్ 9440245771

# అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు వేగవంతం చేయండి



- ఆరోగ్య కేంద్రంలో పేదలకు అందుతున్న వైద్యంపై ఆరా..
- మహిళలకు సబ్సిడీ రుణాలు అందే విధంగా చర్యలు తీసుకోండి
- వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

**వికారాబాద్ జిల్లా బ్యూరో జూలై 12 (జనం సాక్షి):**
అమ్మ ఆదర్శ పాఠశాలల పనులను వేగవంతంగా చేపట్టి పూర్తి చేయాలని వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశించారు. వివిధ పాఠశాలల్లో మౌలిక వసతుల పనులు పరిశీలించారు. శుక్రవారం వికారాబాద్ జిల్లా దోమ మండలం .అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో ఆయా ప్రభుత్వ బడులలో కొనసాగుతున్న పనులను వేగవంతంగా చేపట్టి సత్వరమే పూర్తి చేయాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. దోమ మండలంలోని బొంపల్లి, బాసుపల్లి గ్రామాలలో ఉన్నత, మరియు ప్రైమరీ ప్రభుత్వ పాఠశాలలను కలెక్టర్ సందర్శించారు. మౌలిక సదుపాయాలు పెంపొందించేందుకు వీలుగా చేపట్టిన పనులను పరిశీలించారు. దోమ మండలంలోని బొంపల్లి ఉన్నత, ప్రాథమిక పాఠశాలలను, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లను సందర్శించారు. పాఠశాలల్లో వంట గది, వరండా, వాటర్ సంప్, టాయిలెట్స్ తదితర నిర్మాణాలు, మరమ్మతు పనులను పరిశీలించి, అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. మిషన్ భగీరథ నీరు సరఫరా జరుగుతోందా, వాటర్ సప్లై కనెక్షన్ ఉందా, నీటి సరఫరా విషయమై వివరాలు సేకరించి రిపోర్ట్ ఇవ్వాలని . అధికారులకు ఆదేశించారు. ఇప్పటికే చాలావరకు పాఠశాలల్లో పనులు పూర్తయ్యాయని, ఇంకనూ పలు స్కూళ్లలో వివిధ దశల్లో కొనసాగుతున్న పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. అవసరమైన పనులను మాత్రమే చేపట్టాలని, నాణ్యతా ప్రమాణాలు పాటించేలా పకడ్బందీ పర్యవేక్షణ జరపాలని సూచించారు. వర్షాకాలం సీజన్ అయినందున పాఠశాలల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య మరియు ఉపాధ్యాయుల సంఖ్యకు సంబంధించి పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వన మహోత్సవంలో భాగంగా పాఠశాలల ఆవరణలో మూడువరుసలు మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అనంతరం దోమ మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు.ప్రతి రోజు ఓపికి ఎంత మంది వస్తున్నారు. అంబులెన్సు ఉందా, ఎంత మంది స్టాఫ్ ఉన్నారని వివరాలు అడిగి తెలుసుకున్నారు.. ఆసుపత్రికి వచ్చిన పేసెంట్ల తో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితు లపై ఆరా తీశారు. ఓపి స్లిప్స్ అందుబాటులో ఉంచుకోవాలని సంబంధిత డాక్టర్కు ఆదేశించారు.స్థానిక తహసీల్దార్ కార్యాలయం లో ఏర్పాటు చేసిన మహిళల తో మాట్లాడారు. మహిళలు సబ్సిడీ లోన్స్ తీసుకొని ఏమి పనులు చేస్తున్నారని అడుగగా కుట్టు మిషన్లు, కోళ్ల ఫామ్స్, క్యాంటీన్ పెట్టుకొని నడుపుతున్నామని కలెక్టర్ కు తెలిపారు. ఐకెపి ద్వారా ప్యాడి ప్రో క్యూర్ మెంట్ జరుగుతుందా, వివరాలు అడిగి తెలుసుకున్నారు. తదనంతరం దోమ మండలం కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం సందర్శించారు. వంట గది, టై లెట్స్, రన్నింగ్ వాటర్ అన్నింటిని పరిశీలించారు. మిషన్ భగీరత వాటర్ సప్లై ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు.బాలికలు అందరితో కలిసి సహపంక్తి భోజనం చేశారు. కలెక్టర్ తో పాటు జిల్లా విద్యా శాఖ అధికారి రేణుక దేవి, ఎంపీడీఓ మహేష్ బాబు, తహసీల్దార్ పురుషోత్తం, ఈఈ బాబు శ్రీనివాస్, ఎమ్ ఇఓ హరి చందు, పద్మజ, ప్రధాన ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు, డాక్టర్ రజిత, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## వృత్తి విద్య కోర్సులకు ఎంతో ఆదరణ

### ఎమ్మెల్యే కేపీ వివేకానంద

**కుత్బుల్లాపూర్ జూలై 12 (జనం సాక్షి)**
వృత్తివిద్య కోర్సులకు మంచి అవకాశాలు ఉన్నాయని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద గౌడ్ అన్నారు. శుక్రవారం నియోజకవర్గ పరిధిలోని బహదూర్ పల్లి లో కేయం పాండు గవర్నమెంట్ వొకేషనల్ జూనియర్ కళాశాల నందు నిర్వహించిన అప్రెంటిస్ మేళాకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో వృత్తి విద్యా కోర్సులకు ఎంతో ఆదరణ ఉందన్నారు. విద్యార్థులు చదువులలో నైపుణ్యతను ప్రదర్శించినప్పుడే బంగారు భవిష్యత్తు ఉంటుందన్నారు. గత పది ఏళ్లలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం లో జూనియర్ కళాశాల, ఒకేషనల్ కళాశాల ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రానున్న రోజులలో డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేసేందుకు తాను కృషి చేస్తానన్నారు. డిగ్రీ కళాశాల ఏర్పాటు కోసం ఇప్పటికే స్థల పరిశీలన చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్జెడి జయప్రద, జోష్నారాణి, ప్రిన్సిపాల్ మైమూన్, తిరుపతయ్య ,విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.




## వానకాలం జాగ్రత్తలు అవసరం

**రాజేంద్రనగర్, జూలై 12(జనం సాక్షి)**
వర్షాకాలంలో దోమల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని నార్సింగి మున్సిపాలిటీ చైర్పర్సన్ మైలారం నాగపూర్ణ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మంచి రేవులో చైర్పర్సన్ నాగపూర్ణ, కమీషనర్ ప్రవీణ్ రెడ్డి, స్థానిక కౌన్సిలర్ గోపాల సునీత గణేష్ తో కలిసి దారి వెంబడి ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పిస్తూ ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఇంటి ఆవరణలో ఎక్కడ కూడా చెత్త చెదారం, నీరు నిల్వ ఉండకుండా మురుగు, పూల కుండీలో, వ్యర్థ వస్తువులో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, దీని ద్వారా విష జ్వరాలైన డెంగ్యూ, చికెన్ గున్యా, మలేరియా వంటి వ్యాధుల నుండి అప్రమత్తంగా ఉండాలని గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ రేఖ, ప్రేమ్, సంతోష్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## సఫిల్ గూడా చెరువు రూపు రేఖలు మార్చాలి

- పార్క్ అంటే ఇలా ఉంటదా
- అధికారులపై మండిపడ్డ మేయర్
- కార్పొరేటర్కు కృతజ్ఞతలు తెలిపిన స్థానికులు



**మల్కాజిగిరి జూలై 12 (జనంసాక్షి)**
15 రోజులలో సఫిల్ గూడ మినీ ట్యాంక్ బండ్ చెరువు రూపురేఖలు మార్చాలని గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ మేయర్ గద్వాల విజయలక్ష్మి అధికారులను ఆదేశించారు. మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రావణ్ కౌన్సిల్ సమావేశాలలో చెరువు సుందరీకరణ, చెరువులో మురికి నీరు కలవకుండా ఏర్పాటు చేయాలని, గుర్రపుడెక్క తొలగించాలని తదితర సమస్యలను కౌన్సిల్ సమావేశాలలో డిమాండ్ చేశారు. మేయర్, జిహెచ్ఎంసి కమిషనర్ సఫిల్ గూడా చెరువును సందర్శించాలని పట్టు వదలని విక్రమార్కుడిలా పోరాటం చేశాడు. స్పందించిన మేయర్ జిహెచ్ఎంసి కమిషనర్ ఆమ్రపాలి తో కలిసి శుక్రవారం చెరువును సందర్శించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ శ్రావణ్ చెరువు పరిస్థితులను దాని వలన ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను కూలంకషంగా వివరించారు. చెరువులోని గుర్రపు డెక్క తొలగించి అక్కడ వేయడంతో విపరీతంగా దుర్వాసన, దోమలతో స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారని ఎంటమాలజీ అధికారి ఎక్కడున్నారని మేయర్ మండి పడ్డారు. వినాయక నిమజ్జన కొలనులో మురికి నీరు తొలగించి లోతు పెంచాలని అధికారులకు సూచించారు.చిన్నపిల్లలు ఆడుకునే పార్క్ లో ఆట వస్తువులు తుప్పు పట్టిపోవడంతో వెంటనే కొత్తవి ఏర్పాటు చేయాలని,బాత్రూంలు, వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్ పరికరాలు 15 రోజులలో మళ్లీ చెరువును సందర్శిస్తానని, కార్పొరేటర్ శ్రావణ్ సలహాలతో, పార్క్ హెచ్ఎండిఏ పరిధిలో ఉన్నందున అన్ని రంగాలలో అభివృద్ధి చేయాలని అధికారులను ఆదేశించారు. సఫిల్ గూడా మినీ ట్యాంక్ బండ్ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేసిన కార్పొరేటర్ శ్రావణ్కు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ రవి కిరణ్, మల్కాజిగిరి సర్కిల్ అధికారులు పాల్గొన్నారు.



## హెచ్ఎంటి పరిశ్రమను సందర్శించిన కేంద్ర భారీ పరిశ్రమల మంత్రి

### కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరిన ఎమ్మెల్యే కేపీ వివేకానంద

**కుత్బుల్లాపూర్ జూలై 12 ( జనం సాక్షి)**
కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని హెచ్ఎంటి పరిశ్రమను శుక్రవారం కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి కుమారస్వామి, సహాయ మంత్రి భూపతి రాజులు స్థానిక ఎమ్మెల్యే కేపీ వివేకానందతో కలిసి హెచ్ఎంటి పరిశ్రమను పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో పరిశ్రమ మనుగడ తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ వివేకానంద కార్మికుల సమస్యలపై పలు అంశాలను కేంద్ర మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా 1992 నుండి ఉద్యోగులకు రావలసిన బకాయిలను చెల్లించాలన్నారు. ఈఎల్ పేమెంట్లను వెంటనే చేయాలని కోరారు. ఉద్యోగులకు అందవలసిన గ్రాడ్యుటి అందలేదని తెలిపారు. రిటైర్మెంట్ సమయంలో దాదాపు 600 మంది ఉద్యోగులకు తమకు అందవలసిన బకాయిలు అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి ఉద్యోగులకు న్యాయం చేయాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంటి సిఎండి రాజేష్ కోహ్లీ, వర్కర్స్ అండ్ స్టాఫ్ యూనియన్ నాయకులు, హెచ్ఎంటి రిటైర్డ్ ఎంప్లాయిస్ ఫోరం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ మోసపూరిత మాటలకు అమాయక ప్రజలు బలి

- అమలుకు నోచని ఆరు గ్యారెంటీ పథకాలతో కాంగ్రెస్ గారడి
- ప్రజలకు సేవలు అందించేందుకు స్థానికంగానే ఉంటా
- మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి



**తాండూరు జూలై 12(జనంసాక్షి)**
కాంగ్రెస్ పార్టీ మోసపూరిత మాటలకు అమాయక ప్రజలు బలి అవుతున్నారని మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం తాండూరు పట్టణం మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రోహిత్ రెడ్డి మాట్లాడుతూ అమలుకు నోచుకోని ఆరు గ్యారెంటీ పతకాలతో కాంగ్రెస్ ప్రభుత్వం గారడీ చేస్తుందని విమర్శించారు.కాంగ్రెస్ హయాంలో ఓయూలో విద్యార్థులను చితక బాదడం బాదకరం అన్నారు.బిఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరుద్యోగుల పక్షాన ఉటు పోరాడుతామన్నారు. 8నెలలు గడిచిన ప్పటికి రుణమాఫీ చేయలేని పరిస్థితి నెరకొందని విమర్శించారునేను ఎమ్మెల్యే గా ఉన్నప్పుడు తీసుకోచ్చిన అభివృద్ధి పనులు కోనసాగుతున్నారు. కాంగ్రెస్ పార్టీ నేతలు ప్రజల కష్టలు వదిలేశారన్నారు.రాబోయే రోజులలో కాంగ్రెస్కి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. అమాలుకాని పథకాలతో ప్రజలను మబ్యపెట్టారు.ఆనారోగ్యంతో నే రాలేకపోయానని ప్రజలకు ప్రతినిత్యం అందుబాటులో ఉంటామన్నారు. మహిళా పెంక్షన్ విషయంలో కాంగ్రెస్ నిరుగారు. స్తుందన్నారు.కళ్యాణ లక్ష్మీ పథకం లో తూలం బంగారు ఎక్కడ ఇస్తున్నారని ప్రశ్నించారు. కాంగ్రెస్ హయాంలో రీయల్ ఎస్టేట్ తీవ్రసంక్షోభంలో ఉందన్నారు. ఆక్రమార్కులకు పాల్పడుతున్న కాంగ్రెస్ నాయకులు దోరణి మార్చుకోవలన్నారు.అదికారులు కాంగ్రెస్ నాయకులకు వతస్తు పలుకుతున్నారు. పనితీరు మార్చుకోవాలన్నారు. గ్రామాల్లో అబివృద్ధి కుంటుపడిందన్నారు. కాంట్రాక్టు లకు బిల్లులు చెల్లించాలని తెలిపారు. కాంగ్రెస్ తమ వైకరి మార్చుకోకుంటే పరిమాణం తప్పదన్నారు. తాండూరును వదిలేదులేదు. తాండూరు లోనే ఉంటు ప్రజల సేవలు అందేస్తాం. పార్టీ విడే ప్రసక్తేలేదన్నారు. కోత్త పను అమలుకు నోచుకోవడంలేదన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.



## గాన కోకిల అవార్డు అందుకున్న వెంకటేశం

### 40 మంది కళాకారులకు అవార్డులు

**జవహర్ నగర్ జులై 12 (జనం సాక్షి)**
ఉత్తర తెలంగాణలోని కవులు, కళాకారులకు, ఉత్తర తెలంగాణ పీపుల్స్ మూమెంట్ ఆధ్వర్యంలో ఉద్యమ గాన కోకిల అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. శుక్రవారం కరీంనగర్ కలెక్టర్ కార్యాలయం ఎదురుగా ఉన్న ప్రెస్ భవన్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఉమ్మడి అదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం, జిల్లాలకు చెందిన 40 మంది కళాకారులకు ఉత్తర తెలంగాణ పీపుల్స్ మూమెంట్ వ్యవస్థాపక అధ్యక్షులు మేకల చంద్రశేఖర్ యాదవ్, ప్రధాన కార్యదర్శి ముక్కెర సంపత్ కుమార్, అవార్డులను అందజేసి గౌరవించారు. జానపద కళా రంగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన జవహర్ నగర్ అంబేద్కర్ నగర్కు చెందిన కానుగంటి వెంకటేశం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సాంస్కృతిక శాఖలో పని చేస్తూ అనేక కళా ప్రదర్శనలు ఇచ్చి రాష్ట్ర స్థాయిలో రెండు అవార్డులను అందుకున్నాడు. మూడవ అవార్డు శుక్రవారం కరీంనగర్లో ఉత్తమ ఉద్యమ గాన కోకిల అవార్డు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో కవులు, కళాకారులు, మేధావులు, తదితరులు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజనం వికటించి విద్యార్థులు అస్వస్థత

- 17 మంది విద్యార్థులు ఆసుపత్రిలో చికిత్స
- వివరాలు వెల్లడించిన మాత శిశు ఆసుపత్రి వైద్యులు అనిల్ కుమార్ రెడ్డి





**తాండూరు జులై 12(జనంసాక్షి)**
ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం వికటించి విద్యార్థులు తీవ్ర స్వస్థతకు గురైన సంఘటన వికారాబాద్ జిల్లా పెద్దేముల్ మండలం కందనెల్లి తాండ పరిధిలో చోటుచేసుకుంది. పభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సౌజన్య మరియు విద్యార్థుల తల్లిదండ్రులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దేముల్ మండలం కందనెల్లి తండా పరిధిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్నం విద్యార్థులకు భోజనం పథకం క్రింద పులిహోర ఆహారాన్ని వడ్డించారు.. ఈ ఆహారం తిన్న విద్యార్థులు వెంబడి 17 మంది చిన్నారులు వాంతులు చేసుకోవడం జరిగింది. విషయాన్ని గమనించి స్థానికంగా ఉన్న ఏఎన్ఎంలను పాఠశాలలకు పిలిపించి ప్రాథమిక చికిత్సలు అందించడం జరిగిందని తెలిపారు. విద్యార్థులకు యధావిధిగా వాంతులు అవడంతో తాండూర్ మాతా శిశు ఆసుపత్రికి అంబులెన్స్ ద్వారా తరలించి చికిత్స అందించారు.విద్యార్థులను పరిశీలించిన వైద్యులు అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ..17 మంది విద్యార్థులలో ముగ్గురు చిన్నారులకు తీవ్ర అస్వస్థతకు గురయ్యారని తెలిపారు. పరిసరాల పరిశుభ్రం లేకపోవడంమరియు మధ్యాహ్న భోజనం వికటించడం కారణంగా ఇలాంటి సంఘటనలు చోటు చేసుకుంటాయన్నారు. పాఠశాల ఆవరణలో పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

# ఫ్రైడేని డ్రైడేగా పాటిద్దాం..!

- సీజనల్ వ్యాధుల నివారణపై అవగాహన కార్యక్రమాలు
- పరిసరాల పరిశుభ్రత పాటించి సీజనల్ వ్యాధులు నివారిద్దాం



**హైదరాబాద్ సిటీ, జూలై 12(జనంసాక్షి):**
జిహెచ్ఎంసి వ్యాప్తంగా శుక్రవారం డ్రై డే నిర్వహించడంతో పాటు సీజనల్ వ్యాధుల నివారణ, దోమల నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆయా విభాగాల అధికారులు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిహెచ్ఎంసిసి ఆయా విభాగాల అధికారులు సంయుక్తంగా అన్ని సర్కిళ్లలో కాలనీ ప్రజలకు, పాఠశాలల విద్యార్థులకు వర్షాకాలం నిల్వ నీరుతో, ఇంట్లో, పరిసరాల్లో అపరిశుభ్ర వాతావరణంలో దోమలు వ్యాప్తి చెంది, వాటి ద్వారా డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా, విష జ్వరాలు ప్రబలుతాయని, దోమల నివారణకు, వ్యాధుల నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ప్రతి శుక్రవారం డ్రైడే గా పాటించాలని, ఇంట్లో ఉన్న పనికిరాని దోమల నివాస వస్తువులు తీసివేయాలని, డ్రమ్ములు, తొట్ల లో ఉన్న నిల్వ నీటిని పడవేసి, శుభ్రం చేసుకోవాలని, ఎల్లప్పుడూ ఇల్లు, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, గుంతలో నీరు నిలువకుండా మట్టితో పూడ్చాలని, దోమలు పుట్టకుండా, కుట్టకుండా చూసుకోవాలని నగరంలోని అన్ని సర్కిళ్లలో ప్రజలకు అవగాహన కల్పించారు. జోనల్ కమిషనర్లు కూడా ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు బస్తీ దవాఖానా ఆకస్మిక పరిశీలన చేసి డెంగ్యూ, మలేరియా వ్యాధులు పై అరా తీశారు. ఈ కార్యక్రమంలో ఆయా సర్కిళ్లలో డిప్యూటీ కమిషనర్లు, ఏఎంహెచ్ఓలు, వైఎంటమాలజీ అధికారులు, ఏఎంహెచ్వోలు, ఆయా కార్పొరేటర్లు పాల్గొన్న పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

## మహిళా శక్తి కార్యక్రమాల ఏర్పాటుకు తగిన చర్యలు

### జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్



**నారాయణపేట జిల్లా బ్యూరో (జనం సాక్షి):**
నారాయణ పేట జిల్లాలో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లను ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశించారు. జిల్లాలోని నారాయణ పేట,మక్తల్, కొస్గి పట్టణ కేంద్రాలలోని ప్రభుత్వ సామాజిక భవనాలను గుర్తించి వాటిలో వీలైనంత త్వరగా మహిళా శక్తి క్యాంటీన్లను ప్రారంభించాలన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో సెర్ఫ్ కార్యకలాపాలపై కలెక్టర్ సమీక్ష జరిపారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను ప్రణాళిక బద్ధంగా చేరుకుని జిల్లాను రాష్ట్రంలోనే ముందు వరుసలో నిలపాలని సూచించారు.న్యూ ఎంటర్ ప్రైజెస్ యూనిట్ల గురించి ఆమె అడిగి తెలుసుకున్నారు. పిఎంఎఫ్ఎంఈ యూనిట్లను రెండు రోజుల్లో గుర్తించాలన్నారు.డైరీ ఎనిమల్స్ 35 యూనిట్లను కూడా రెండు రోజుల్లో పూర్తి చేయాలన్నారు. జిల్లాలో ని ధన్వాడ మండలం కోయిల్ సాగర్, కృష్ణా మండలం గూడెబల్లూరులో గుర్తించిన ఫిష్ మొబైల్ వెహికల్ యూనిట్లతో పాటు ప్రభుత్వ ఆదేశాల ప్రకారం మహిళా శక్తి యూనిట్లను పూర్తి చేసేందుకు సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకోవాలని ఆమె ఆదేశించారు. అలాగే జిల్లాలో 7 పౌల్ట్రీ మదర్ యూనిట్లు ఉన్నాయని ఆమె తెలిపారు.మరికల్ మండలంలో ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్ మెంట్ ను గుర్తించాలన్నారు. మహిళా శక్తికి సంబంధించిన అన్ని కార్యక్రమాలను జిల్లాలో ఏర్పాటు చేసేందుకు అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలోని ప్రజా పాలన కేంద్రాలను అధికారులు సందర్శించి అక్కడి ప్రజల సమస్యలను గుర్తించి పరిష్కరించాలని సూచించారు.జిల్లాకు మంజూరైన 10 మీ సేవా కేంద్రాల నిర్వహణ బాధ్యతలను ఉన్నత విద్యార్హత కలిగిన నిరుద్యోగులకు అప్పగించాలని కలెక్టర్ ఆదేశించారు. ఊట్కూరు మండలంలో మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటుచేసే రైస్ మిల్ స్థల సేకరణ ఎంతవరకు వచ్చిందని ఆమె అడిగి తెలుసుకున్నారు. ఈ సమీక్షలో స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ మయాంక్ మిత్తల్, డిఆర్డిఓ రాజేశ్వరి, మున్సిపల్ కమిషనర్లు, డిపిఎంలు, ఏపీఎంలు తదితరులు పాల్గొన్నారు.

## 19,37 కోట్లు డ్రగ్స్తో పట్టుబడిన వ్యక్తి

### 12 ఏళ్ల జైలు శిక్షతో పాటు లక్ష జరిమానా

**శంషాబాద్, జూలై 12 (జనంసాక్షి)**
డ్రగ్స్తో పట్టుబడిన వ్యక్తికి జైలు శిక్ష పడిన ఘటన శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం ఎయిర్పోర్ట్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటలిజెన్స్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం 2021 జూన్ 21వ తేదీన ఎయిర్పోర్టులో 19.37 కోట్లు విలువ చేసే 2980 గ్రాముల హెరాయిన్తో పట్టుపడ్డాడు. దర్యాప్తులో భాగంగా అధికారులు జిల్లా సివిల్ కోర్టులో కేసు వేశారు. విచారించిన కోర్టు నిందితునికి 12 సంవత్సరాల జైలు శిక్షతో పాటు లక్ష రూపాయల జరిమానా విధించింది.

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
13 జూలై 2024



## ప్రతి పోలింగ్ బూత్‌లో పది మొక్కలు నాటాలి

**జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ రాకాసి లోక్నాథ్ రెడ్డి**

**వనపర్తి బ్యూరో జులై12 (జనంసాక్షి)**

బిజెపి రాష్ట్ర పార్టీ పిలుపుమేరకు వనపర్తి పట్టణంలోని 8 వార్డులో పట్టణ కార్యదర్శి కడమంచి శివ ఆధ్వరంలో మొక్కలు నాట్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ ఆర్ లోకనాథరెడ్డి మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ మాతృ సంస్థ భారతీయ జనసంఘ వ్యవస్థాపకులు డా శ్యామ ప్రసాద్ ముఖర్జీ జయంతి ఈనెల 5వ తేదీ నుండి రాష్ట్రవ్యాప్తంగా ప్రతి పోలింగ్ బూత్ కేంద్రంలో నాయకులు పది మొక్కలను నాటాలని రాష్ట్రవ్యాప్తంగా 5 లక్షల మొక్కలను నాటాలని లక్ష్యంగా పెట్టుకుందని దానికి అనుగుణంగా ప్రతి నాయకుడు కూడా మొక్కలు నాటే కార్యక్రమంలో విరివిగా పాల్గొనాలన్నారు. మొక్కలను నాటడం కేవలం ప్రభుత్వం పనే కాదని ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా ప్రకృతిని పరిరక్షణ పరిరక్షించాల్సిన అవసరం ఉందని తెలియజేశారు. మొక్కలు నాటే కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు బండారు కుమారస్వామి, పట్టణ ప్రధాన కార్యదర్శి రాయన్నసాగర్, ఐటీ సెల్ కన్వీనర్ విజయ కుమార్ సాగర్, కార్యకర్తలు వెంకటయ్య ,ముత్యాలు, చిన్న రాయుడు, రమేష్ ,పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

# అన్నదాతల సూచనల మేరకే రైతుభరోసా

- ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించిదనడం అవివేకం
- రాష్ట్ర మంత్రులు తుమ్మల, పొంగులేటి
- వనపర్తిలో రైతు భరోసాపై అభిప్రాయ సేకరణ
- హాజరు కాని ఉప ముఖ్యమంత్రి భట్టి మరో ఇద్దరు మంత్రులు

**వనపర్తి, జూలై 12 (జనంసాక్షి):**

అందరి నోట ఒకటే మాట .10 ఎకరాల వరకే రైతు భరోసా ఇవ్వాలి. అదీ సాగు చేస్తేనే వర్తింపజేయాలి. శుక్రవారం వనపర్తి ఐడీఓసీ కార్యాలయంలో రైతు భరోసాపై ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా స్థాయి అభిప్రాయ సేకరణ కార్యక్రమం జరిగింది. రైతు భరోసా క్యాబినెట్ సబ్ కమిటీ చైర్మెన్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అద్యక్షతన అభిప్రాయ సేకరణ జరుగుతుందని గత రెండు రోజులుగా ప్రచారం జరగడమే కాకుండా ఆ మేరకు ఆయన పర్యటనకు సంబంధించిన షెడ్యూలు కూడా ఆయా జిల్లాల కలెక్టర్లు, ఎస్పీ తదితర అధికారులకు అందింది. కాని డిప్యుటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఈ సమావేశానికి రాలేదు .ఇందులో సభ్యులైన మరో ఇద్దరు మంత్రులు దామోదర రాజ నర్సింహ్మా, దుద్దిళ్ళ శ్రీధర్ బాబు కూడా రాలేదు ,వ్యవసాయ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు ఐటి పరిశ్రమల శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడి రైతులనుంచి అభిప్రాయాలు సేకరించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ తమ ప్రభుత్వం అమలు చేయనున్న రైతు రుణమాఫీ వల్లనే రైతు భరోసా సాయం ఆలస్యమైందన్నారు. గత ఐదేళ్ళలో పంట సాగు చేయని వారికి రూ.25 వేల కోట్ల ప్రజా ధనం దుర్వినియోగం అయిందన్నారు. ఎన్ని ఎకరాలకు పరిమితి విధించాలన్న విషయాన్ని రైతుల అభిప్రాయానికి అనుగుణంగానే నడుచుకుంటామని అన్నారు. ప్రస్తుతం రైతు భరోసా ఇవ్వాలంటే



రూ.7500 కోట్లు కావాలన్నారు. రెవిన్యూ శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ రైతు భరోసా పరిమితిపై ప్రభుత్వం ఇప్పటికే ఓ నిర్ణయానికి వచ్చిందని, కేవలం తూతూ మంత్రంగా అభిప్రాయాలు సేకరిస్తున్నారని విపక్షాల నేతలనడం అవివేకం అన్నారు. ఇన్ కం ట్యాక్సు చెల్లించే వారికి, పాన్ కార్డు ఉన్న వారికి, ఉమ్మడి కుటుంబంలో ఎక్కువ మంది ఉన్న రైతులకు రైతు భరోసా సాయం ఇచ్చేది లేదని ప్రభుత్వం ఎక్కడా చెప్పలేదని, రైతులు, వివిధ వర్గాల నుంచి సేకరించిన అభిప్రాయాలను ఈ నెల 24 నుంచి జరిగే అసెంబ్లీ, కౌన్సిల్ సమావేశాల్లో చర్చించిన అనతరం నిర్ణయం ఉంటుందన్నారు.

### 10 ఎకరాల వరకే రైతు భరోసా ఇవ్వాలి

గతంలో మాదిరి కొండలు గుట్టలు ఉన్న భూములకు, సాగు చేయకుండా పడావు పడిన వాటికి రైతు భరోసా సహాయం వద్దని, 10 ఎకరాల లోపు ఉన్న రైతులకే వర్తింపజేయాలని అభిప్రాయ సేకరణలో పాల్గొన్న 90 శాతం రైతులు సూచించారు. కష్టపడి పంట పండించే రైతులకు మాత్రమే రైతు భరోసా ఇవ్వాలి తప్ప వందల ఎకరాలు ఉన్నవారికి, ఇప్పటికే వెంచర్లు అయిన వాటికి, కొండలు, గుట్టలకు, ఇంకం ట్యాక్స్ పరిధిలో ఉన్న వారికి రైతు భరోసా ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. కౌలు రైతులకు సైతం రైతు భరోసా ఇవ్వాలని అదే సమయంలో రైతుకు సైతం ఇవ్వాలన్నారు. సబ్సిడీపై నాణ్యమైన విత్తనాలు ఎరువులు యంత్రాలు ఇవ్వాలని అదేవిధంగా రైతు భరోసాతో పాటుగా పంటకు అదనంగా బోనస్ చెల్లించాలని కొంతమంది రైతులు కమిటీ దృష్టికి తీసుకువచ్చారు. మరికొంత మంది రైతులు మాట్లాడుతూ రైతు భరోసా కు బదులుగా పంట గిట్టుబాటు ధరకు అదనంగా బోనస్ చెల్లిస్తే రైతులు వ్యవసాయంపై ఎక్కువ దృష్టి పెడతారని సూచించారు. రాష్ట్ర ఎక్సైజ్ శాఖా మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మెన్ జిల్లెల్ల చిన్నారెడ్డి రైతు బంధు అమలులో గత ప్రభుత్వం చేసిన అవకతవకలు నిధుల దుర్వినియోగం గురించి మాట్లాడారు. ఈ సమావేశంలో నాగర్ కర్నూల్ ఎంపీ మల్లు రవి స్థానిక శాసన సభ్యులు తూడి మేఘా రెడ్డి, ఎమ్మెల్సీ కూచుకుళ్ళ దామోదర్ రెడ్డి, నాగర్ కర్నూల్ శాసన సభ్యులు కే. రాజేష్ రెడ్డి, అచ్చంపేట నుండి వంశీకృష్ణ, మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి నారాయణపేట ఎమ్మెల్యే పర్ణిక రెడ్డి జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి, గద్వాల నుండి కృష్ణ మోహన్ రెడ్డి, వ్యవసాయ శాఖ కమిషనర్ రఘునందన్ రావు, మహబూబ్ నగర్ కలెక్టర్లు విజయెందిరా బోయి, వనపర్తి కలెక్టర్ సంచిత్ గంగ్వార్, నాగర్ కర్నూల్ కలెక్టర్ బాదావత్ సంతోష్, నారాయణ పేట కలెక్టర్ సీక్త పట్నాయక్, అదనపు కలెక్టర్లు, రైతులు, రైతు సంఘాల నాయకులు, వ్యవసాయ శాఖ అధికారులు తదితరులు హాజరయ్యారు.

# అంతర్ రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

- 36 లక్షల విలువగల 43-తులాల బంగారం స్వాధీనం
- వివరాలు వెల్లడించిన జిల్లా అదనపు ఎస్పీ ఎ. సంజీవరావ్

సంగారెడ్డి జులై 12 (జనం సాక్షి )

వరుస దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్ రాష్ట్ర దొంగల ముఠాను జిల్లా పోలీసులు చాకచక్యంగా పట్టుకొని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ. 36 లక్షల విలువ గల 43 తులాల బంగారం, 5 కిలోల వెండి, రెండు ద్విచక్ర వాహనాలుస్వాధీనం చేసుకున్నారు. శక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అదనపు ఎస్పీ మాట్లాడుతూ నిందితులు జాదవ్ జైరాం, జాదవ్ శంకర్ అలియాస్ శంకు, ఇప్పు సింగ్ అలియాస్ ఇప్పు ముగ్గురు వ్యక్తులు ముఠాగా ఏర్పడి, సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట, సిరిసిల్ల తదితర జిల్లాలో గ్రామ శివారు ప్రాంతంలో తాళం వేసిన ఇండ్లను ఎంచుకొని రాత్రి నేరాలకు పాల్పడుతూన్నారని తెలిపారు. తప్పుడు



మార్గంలో డబ్బులు సంపాదిస్తూ జల్సా చేస్తున్నారన్నారు. ఇదే క్రమంలో గత నెల జూన్ 2 వ తేదీ అర్ధరాత్రి సంగారెడ్డి జిల్లా, అందోల్ మండలం, ఎర్రారం గ్రామంలో 8 తాళం వేసి ఉన్న ఇండ్లు, జూన్ 8వ తేదీ అర్ధరాత్రి మాసాన్ పల్లి గ్రామంలో 4 తాళం వేసి ఉన్న ఇండ్లు, జూన్ 14 వ తేదీ అర్ధరాత్రి చౌటాకూర్ గ్రామంలో 5 తాళం వేసి ఉన్న ఇండ్లలో తాళాలు పగులగొట్టి దొంగతనాలకు పాల్పడుతూ బంగారు, వెండి ఆభరణాలు నగదు చోరీ చేయడం జరిగిందన్నారు. పుల్కల్ పోలీసు స్టేషన్ పరిధిలో నమోదైన మూడు నేరాలకు సంభందించి జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సంగారెడ్డి డియస్పి సత్యయ్య గౌడ్, జోగిపేట సీఐ అనిల్ కుమార్ పర్యవేక్షణలో పుల్కల్ ఎస్సై శ్రీకాంత్, జోగిపేట ఎస్సై అరుణ్ కుమార్ కొంత మంది సిబ్బందితో టీం ను ఏర్పాటు చేసి అంతర్ రాష్ట్ర దొంగల ముఠాను చేదించుటకు గాను దొరికిన క్లూస్ తో గత నెల రోజులుగా గాలిస్తూ ఈ రోజు తేది: 12న శుక్రవారం సిర్గాపూర్ మండలం బిబియా నాయక్ తాండాలో నెరస్తులను అదుపులోకి తీసుకొని విచారించగా వారు చేసిన నేరాలను ఒప్పుకోవడంతో వారి వద్ద నుండి కొంత నేర సొత్తును వీరి వద్ద నుండి దొంగ సొత్తు తీసుకుంటున్న మాలి భాయ్, రాఖీ భాయ్ ను నేరానికి ఉపయోగించిన బైక్ మరియు సెంతరింగ్ రాడ్, గ్లాస్ లను రికవరీ చేసి నిందితులను రిమాండ్ కు తరలించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి డియస్పి సత్యయ్య గౌడ్, జోగిపేట సిఐ. అనిల్ కుమార్, జోగిపేట ఎస్ఐ. అరుణ్ కుమార్, పుల్కల్ ఎస్ఐ. శ్రీకాంత్, సిసియస్. టీం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఈ అంతర్ జిల్లా దొంగల ముఠాను పట్టుకొన్న మొత్తం టీంను జిల్లా ఎస్పీ అభినందించి రివార్డులు అందించడం జరుగుతుందని తెలిపారు.

# నిమ్జ్‌కు..శరవేగంగా రోడ్డు విస్తరణ!

**రూ:100 కోట్లతో నిర్మాణ పనులు**
**హుండాయ్ కంపెనీ శంకుస్థాపనకు సీఎం**



**న్యాల్ కల్, జులై 12, (జనం సాక్షి)**

రూ: రెండున్నర లక్షల కోట్ల పెట్టుబడుల అంచనా..ఈ పాటికే రూ:31వేల కోట్ల పెట్టుబడులు..ప్రత్యక్షంగా రెండు లక్షలు, పరోక్షంగా మరో మూడు లక్షల యువతకు స్వయం ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన నిమ్జ్ (జాతీయ ఉత్పాదక మండలి), పరిశ్రమలకు అవసరమైన మౌలిక సౌకర్యాల కల్పన ఏర్పాటుకు అవసరమైన పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. పవన విద్యుత్, భూసేకరణ, రోడ్డు విస్తరణ పనులు చకచకా కొన సాగుతున్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ , 2013లో కడప జిల్లాలోని పులి వెందుల, మెదక్ జిల్లాలోని జహీరాబాద్ ప్రాంతానికి నిమ్జ్ ప్రాజెక్టులను మంజూరు చేశారు. అప్పటి భారీ పరిశ్రమల శాఖ మంత్రి డాక్టర్ జె గీతారెడ్డి, సీఎం స్వర్గీయ డాక్టర్ రాజశేఖర్ రెడ్డి చొరవతో ప్రాజెక్టు మంజూరైంది. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రం, సంగారెడ్డి జిల్లా, జహీరాబాద్ ప్రాంతంలోని న్యాల్ కల్, ఝరాసంఘం మండలాల్లోని 17 గ్రామాల్లో 12635 ఎకరాల్లో నిమ్జ్ ప్రాజెక్టును ఏర్పాటు చేసేందుకు గుర్తించింది. ఈ పాటికే తొలివిడతదా 5000 ఎకరాల మేర భూమిని సేకరించింది. రెండో విడతలో నిమ్జ్ డిప్యూటీ కలెక్టర్ నాగలక్ష్మి, ఆర్డీవో రాజు, అధికారుల చొరవతో భూ సేకరణ శరవేగంగా కొనసాగుతోంది. ఈ పాటికే పలు పరిశ్రమలు ఏర్పాటుకు శంకుస్థాపన చేయగా, తాజాగా త్వరలోనే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా హుండాయ్ కంపెనీ ఏర్పాటుకు శంకుస్థాపనకు చేయనున్నట్లు సమాచారం.

### రూ 100 కోట్లతో రోడ్డు విస్తరణ

నిమ్జ్ ప్రాంతానికి మౌనిక సదుపాయాల ఏర్పాటులో భాగంగా రూ:100 కోట్లతో రోడ్డు విస్తరణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. రోడ్డు నిర్మాణం కోసం 65 ఎకరాల మేర భూమిని సేకరించింది. హైదరాబాద్ - ముంబై రోడ్డు, జహీరాబాద్ సమీపంలోని హుగ్గెల్లి శివారు నుండి ఝరా సంఘం మండలం, బర్దిపూర్ మీదుగా.. న్యాల్ కల్ మండలం, రుక్మాపూర్ గ్రామ శివారు వరకు 9 కిలో మీటర్ల పొడవు, 100 అడుగుల వెడల్పుతో తారు రోడ్డు విస్తరణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. రుక్మాపూర్ నుండి అల్లాదుర్గం - మెటల్ కుంట రోడ్డు, హద్నూర్ వరకు రోడ్డు విస్తరణ పనులు చేపట్టేందుకు అధికారులు దృష్టి సారించారు. వారం రోజులుగా బీటీ రోడ్డు విస్తరణ పనులు చకచకా కొనసాగుతున్నాయి. అతి త్వరలోనే హుండాయ్ పరిశ్రమ ఏర్పాటుకు మంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన చేపట్టనుండడంతో రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేసేందుకు అధికారులు మరింత దృష్టి సారించి పనులను వేగవంతం చేశారు.

# ఒత్తిడి తాళలేక ప్రభుత్వ ఉద్యోగి మృతి



- నిండు ప్రాణాన్ని బలి తీసుకున్న పై అధికారులు
- వీధిన పడ్డ కుటుంబం



**పుల్కల్ జులై 12 (జనం సాక్షి)**

పుల్కల్ ఉమ్మడి మండల పరిధిలోని చౌటాకూర్ ఫారెస్ట్ రేంజిలో 1992 నుండి ప్లాంటేషన్ వాచ్ మెన్ గా పుల్కల్ మండల పరిధిలోని మిన్పూర్ గ్రామానికి చెందిన బి. బాలేష్ (50) ఫారెస్ట్ డిపార్ట్మెంట్‌లో విధులు నిర్వహిస్తున్నారు. ఈ మధ్యకాలంలో విధులు నిర్వహిస్తున్న సమయంలో అనివార్య కారణాలవల్ల అతని కాలుకు చిన్న గాయం కావడంతో దీన్ని ఆసరాగా చేసుకున్న పై అధికారులు ఇకనుండి నీవు విధులకు రావద్దు అంటూ తమ పై అధికారులు చెప్పడంతో ఆయన తీవ్ర మనస్థాపానికి గురయ్యాడు. దీంతో అతను కొన్ని నెలల నుండి తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. అనునిత్యం పై అధికారుల ఒత్తిడి పెరగడంతో అతను దిక్కుతోచని పరిస్థితిలో పడ్డాడు ప్రతి రోజు లాగానే గురువారం నాడు యధావిధిగా విధులకు హాజరయ్యాడు. అయినా కూడా తమ పై అధికారులు తీవ్ర ఒత్తిడి చేయడంతో తీవ్ర మనస్థాపానికి గురైన బేగరి బాలేష్ గురువారం రాత్రి ఒక్కసారిగా అనారోగ్యానికి గురి కావడంతో గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన పుల్కల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రికి తరలించే సమయంలో ఆయన మార్గమధ్యలోనే తుది శ్వాస విడిచాడని అక్కడి వైద్యులు చెప్పారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఒక్కసారిగా బోరున విలపించారు. మృతునికి భార్య ఇద్దరు కుమార్తెలు ఒక కుమారుడు ఉన్నారు. దీంతో ఆయన మరణ వార్త విన్న గ్రామస్తులు ఒక్కసారిగా కన్నీరు పెట్టారు. కుటుంబ పెద్దదిక్కు కోల్పోవడంతో ఆ కుటుంబం రోడ్డున పడింది. ఇట్టి విషయాన్ని అతని కుటుంబ సభ్యులుపై అధికారులకు సమాచారం అందించారు. ఇతని మరణ వార్త తెలుసుకున్న ఫారెస్ట్ డివిజన్ మేనేజర్ విజయభారతి తమ సిబ్బందితో కలిసి హుటా హుటీనా శుక్రవారం. ఉదయం సంఘటన స్థలానికి చేరుకొని చనిపోయిన బేగరీ బాలేష్ మృతదేహంపై పుష్పగుచ్చం అందజేసి నివాళులు అర్పించారు. అంతేకాకుండా దహన సంస్కరాల కోసం రూ. 7500 రూపాయలు నగదును ఆ కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ ఫారెస్ట్ రేంజ్ లో విధులు నిర్వహిస్తున్న. వ్యక్తి మృతి చెందడం ఎంతో బాధాకరం అన్నారు ఈట్టి కుటుంబానికి అన్ని విధాల ఆదుకునే విధంగా తమ పై అధికారులకు నివేదికలు సమర్పిస్తామన్నారు. అంతేకాకుండా కుటుంబంలో ఒకరికి ఉద్యోగం వచ్చే విధంగా తమ వంతు కృషి చేస్తామని. ఆమె అన్నారు. అనంతరం కాసేపు ఆ కుటుంబ సభ్యులను ఓదార్చారు. వీరి వెంట ప్లాంటేషన్ మేనేజర్ నీలకంఠం,.రవికుమార్, ప్లాంటేషన్ వాచర్స్ మొగులయ్య, జగన్నాథం, శంకరయ్య, రమేష్, సత్యనారాయణ పాల్గొన్నారు.

# పెండింగ్ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి

**నాగర్ కర్నూల్ ఆర్సీ జూలై 12(జనంసాక్షి):**

నాగర్ కర్నూల్ నియోజకవర్గంలో అభివృద్ధిని పరుగులు పెట్టించడమే లక్ష్యంగా తన ప్రణాళికలు ఉన్నాయని పెండింగ్ పనులను పూర్తి చేసేందుకు ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు నిధుల మంజూరు కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకు వెళ్తానని ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఉదయం జిల్లా కేంద్రంలోని వెజ్ మరియు నాన్ వెజ్ మార్కెట్ల నిర్మాణపు పనులను కొల్లాపూర్ చౌరస్తాలో పుట్టపాగ మహేందర్ నాథ్ విగ్రహ సమీపంలో పనులను పరిశీలించారు. అనంతరం టిటిడి కళ్యాణ మండప సమీపంలో అండర్ డ్రైనేజీ పైప్ లైన్ల పనులను పరిశీలించి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, గతంలో ఎమ్మెల్యేగా ఉన్న వ్యక్తి అనుమతులు లేకుండానే కొన్ని రహదారులు వేయడం జరిగిందని అదేవిధంగా వెజ్ మరియు నాన్ వెజ్ మార్కెట్ పనుల బిల్లులు రాకపోవడం వల్లే ఆగిపోయాయని తన దృష్టికి వచ్చిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో మాట్లాడి నిధుల మంజూరుకు చర్యలు తీసుకుంటానని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లో పనులను వేగవంతం చేయాలని సూచించారు ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వంతో చర్చించి ఎన్ని నిధులైన



తీసుకువస్తానని కాంట్రాక్టర్లు సకాలంలో పనులను పూర్తి చేయాలని కోరారు. ఈనెల 17న కొల్లాపూర్ చౌరస్తాలో శంకుస్థాపన కార్యక్రమం ఉంటుందని అదేవిధంగా టీటీడీ వద్ద అండర్ డ్రైనేజీ పనులకు కూడా శంకుస్థాపన చేయనున్నట్లు వివరించారు. అనంతరం కూరగాయల రైతులతో మాట్లాడి వారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కొత్త శ్రీనివాసులు, నిజాముద్దీన్, సునీంద్ర, జక్క రాజ్ కుమార్ రెడ్డి, బచ్చన్న యాదవ్ తో పాటు పలువురు పాల్గొన్నారు.



## నాయకులం-కాదు సేవకులం

**మాజీ మంత్రి చంద్రశేఖర్**

కోహీర్ జులై 12 (జనం సాక్షి):

నాయకులుగా భావించకుండా సేవకులుగా ఎల్లవేళలా అందుబాటులో ఉండి కార్మిక శ్రేయస్సు కోసం కృషి చేస్తామని మాజీ మంత్రి చంద్రశేఖర్ పేర్కొన్నారు. మండలంలోని దిగ్వాల్ పార్మ కార్మాగారంలో కార్మిక సంఘం ఎన్నికలను పురస్కరించుకొని శుక్రవారం సాయంత్రం నిర్వహించిన గేటు మీటింగులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్ని మాట్లాడారు. ఐఎన్‌టీయుసి అభ్యర్థి హుగెల్లి రాములును కార్మిక సంఘ అధ్యక్షునిగ గెలిపించాలని ఆయన కార్మికులకు విజ్ఞప్తి చేశారు. ఐఎన్‌టీయుసీ అభ్యర్థి హుగెల్లి రాములు, మాట్లాడుతూ కార్మిక సంఘ నాయకునిగా తనకు ఉన్న అపారమైనా అనుభవంతో కార్మికుల శ్రేయస్సు కోసం కృషిచేస్తామన్నారు. న్యాయ మైన వేతన ఒప్పందం సాధిస్తామన్నారు. రెటైర్ మెంట్ వయో పరిమితిని పెంచుతామన్నారు. కార్మికుల పిల్లలకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. ప్రమోషన్ పాలసీని అమలుచేసి రిటైమెంట్ బెనిఫిట్లను పెంచుతామన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రామలింగా రెడ్డి, బ్లాక్ అధ్యక్షులు అర్షద్ నాయకులు హనుమంత్ రావు పటేల్, గోవర్ధన్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## నిషేధిత గుట్కా అమ్మితే కఠిన చర్యలు

- విక్రయదారులపై టాస్క్ ఫోర్స్ పోలీసుల దాడి
- రూ. 2 లక్షల విలువ గల సిగరెట్లు స్వాధీనం
- జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్

**సంగారెడ్డి ప్రతినిధి, జులై 12 (జనం సాక్షి)**



ప్రభుత్వం నిషేధించిన గుట్కా, పాన్ మసాలా, సిగరేట్ల నమ్మిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ హెచ్చరించారు. శుక్రవారం సంగారెడ్డిలో నిషేధిత గుట్కా అమ్మకాలపై స్పెషల్ టాస్కోఫోర్స్ పోలీసుల దాడులు నిర్వహించి సుమారు రూ. 2 లక్షల విలువ గల సిగరేట్ల స్వాదీనం స్వాధీనం చేసుకున్నారు. జిల్లా ఎస్పీ ఆదేశానుసారం విస్తృత స్థాయిలో దాడులు నిర్వహిస్తూన్నారు. ఇందులో భాగంగా శుక్రవారం నమ్మదగిన సమాచారం మేరకు సంగారెడ్డి శివాజీ నగర్‌కు చెందిన సద్దుల శ్రీనివాస్ ఇంటిపై దాడి చేసి సాగర్-340, ఆర్ ఎం-39, బ్లూ బుల్ -267, మిరాజ్-130, విమల్ పాన్ మసాలా-207, స్వాగత్-26, వి 1-204, చైనీ-5, ఎస్ఆర్ 1 -328, బ్లాక్ లాబుల్ 18-97, ధరివాలా- 29, సూయ్ ధర్ పూడి- 51, గాయి-7, రాజ్ నివాస్-35, రాజ్ శ్రీ-28, ఎం-10, ఆర్.ఆర్-47, అంబర్-7, పారిస్ సిగరెట్ బ్లాక్-40 బాక్సులు, పారిస్ సిగరెట్లు-40 బాక్సులు, ఏ 10 సిగరెట్- 11 బాక్సులు సుమారు రూ. 2 లక్షల విలువ గల పాన్ మసాలా, సిగరెట్ బాక్సలను స్వాధీనం చేసుకొని నిందితులను సంగారెడ్డి టౌన్ పోలీసు స్టేషన్‌కు తరలించారు.

# ఇంటింటా ఇన్నోవేటర్..!

**జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి**

మహబూబ్ నగర్ బ్యూరో (జనం సాక్షి)



ప్రత్యేక ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇంటింటా ఇన్నోవేటర్ సెల్ ఏర్పాటు చేసిందని, గృహిణి నుంచి పాఠశాలలు, కళాశాలల స్థాయి విద్యార్థులు, విద్యావేత్తలు, వ్యవసాయదారులు ఎవరైనా ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమంలో పాల్గొనవచ్చని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలోని కలెక్టర్ ఛాంబర్‌లో ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమం పోస్టర్ ను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్థానిక సమస్యలను పరిష్కరించే వినూత్న ఆవిష్కరణలు పంపించే అవకాశం ఇంటింటా ఇన్నోవేటర్ కల్పిస్తుందని తెలిపారు. వినూత్న ఆవిష్కరణలు దరఖాస్తు చేసుకోవడానికి ఆగష్టు 3 చివరి తేదీ అన్నారు . ప్రతి ఒక్కరికి అవకాశం కల్పించాలని ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు ఇంటింటా ఇన్నోవేటర్ సెల్ ఏర్పాటు చేసిందని, గృహిణి నుంచి పాఠశాలలు, కళ్లాశాలలు స్థాయి విద్యార్థులు, విద్యావేతలు , వ్యవసాయదారులు ఇలా ఎవ్వరైన ఇందులో పాల్గొనవచ్చుని అయన తెలిపారు.

### దరఖాస్తు చేసుకొనే విధానం

పేరు, వయస్సు, ఫోటో, వృత్తి, చిరునామా, మండలం, జిల్లా, ఆవిష్కరణ పేరు, ఆవిష్కరణ వివరిస్తూ 100 పదాలలో రాసి పంపండి. ఆవిష్కరణ 4 ఫోటోలు. ఆవిష్కరణ వీడియో 2 నిమిషాలు, పైన చెప్పిన వివరాలు అన్నియు తెలంగాణ ఇన్నోవేషన్ సెల్ వాట్సాప్ నెంబర్ 9100678543 కు ఆగష్టు 3వ తేదీలోపు పంపించాలి. ఆగష్టు 15 వ తేదీ స్వాతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా ఆవిష్కరణల ప్రదర్శన ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, ఈ డిస్ట్రిక్ట్ మేనేజర్ చంద్ర శేఖర్, జిల్లా సైన్స్ అధికారి బిజ్జ శ్రీనివాసులు, ఇంటింటా ఇన్నోవేటర్ జిల్లా సమన్వయకర్త లాస్య తదితరులు పాల్గొన్నారు.





# ట్రాఫిక్‌తో ఆత్మ సాక్షాత్కారం!


మొన్ననగా వెళ్లారు సుప్రియ మరియు పిల్లకాయలు, జూబిలీ హిల్స్‌లో వాళ్ళ అక్క వాళ్ళింటికి. నేనెళ్ళి నసపెట్టి తీసుకురాక పోతే, వాళ్లకు నేనొక్కడి వుండనని గుర్తుకే రాదు. టాకీ టౌన్ దగ్గర హైవే 65 మీదకి ఎక్కా, ట్రాఫిక్ స్మూత్ గానే ఉండటంతో కొంచెం స్పీడ్ పెంచా, అంతలోనే మియాపూర్ బస్సు స్టాండ్ దగ్గర, ఒక గుంపు రోడ్ ని అడ్డంగా దాటుతూ, అందులోనూ ఒకడు చెయ్యెత్తి మరీ, మీ వెహికల్స్ అన్నీ ఆపండెహె అన్నట్టు. నాలుగడుగులు ముందుకేస్తే, మియాపూర్ సర్కిల్ దగ్గర ఫుట్ ఓవర్ బ్రిడ్జి వుంది, లిఫ్ట్ కూడా ఉందిగా, ఏమి మాయ రోగం వీళ్లకి రోడ్ ని అడ్డం గా దాటక పోతే అనుకుంటూ, విసుగ్గా వెహికల్ స్లో చేసి వాళ్ళు దాటాక ముందుకు కదిలా. జె.ఎన్.టి.యూ సిగ్నల్ దాటాక ఎర్రగడ్డ మీద కాకుండా అయ్యప్ప సొసైటీ మీద వెళదామని, విశ్వనాథ సినిమా దాటాక వచ్చే యూ-టర్న్ తీసుకుందామని రైట్ ఇండికేటర్ వేసి యూ-టర్న్ తీసుకుంటున్నా, ఇంతలో ఓ బండోడు స్కూటర్ లో నా వెహికల్ కి, మెట్రో పిల్లర్ కి, వుండే గ్యాప్ లో నాతో పాటు పార్లల్ టర్న్ తీసుకోవాలని దూరుతున్నాడు, ఆడిని దూరనివ్వకూడదని ఆ గ్యాప్ ని ఇంకొంచెం నారో చేస్తూ టర్న్ తీసుకున్నా. ఎప్పుడు నేర్చుకుంటారో ఈ వెధవలు ఒక వెహికల్ టర్న్ తీసుకునేటప్పుడు పార్లల్ గా టర్న్ తీసుకోకూడదు అని తిట్టుకుంటూ ముందుకెళ్లా.

జె.ఎన్.టి.యూ దగ్గర, రైతు బజార్ దగ్గర, మంజీరామాల్ కి ముందు, ట్రాఫిక్ బాగానే వుంది కానీ, ఒక్క సారి ఫ్లై ఓవర్ ఎక్కగానే కాస్త తగ్గింది ట్రాఫిక్. ఎలాగూ ఆ ఫ్లై ఓవర్ దిగాక ఆ ఎదవ మలేషియన్ టౌన్ షిప్ దగ్గర ట్రాఫిక్ తప్పదు అనుకుంటూ ఫ్లై ఓవర్ మీద వెళ్తున్న, అంతలో నా ముందు ఒక డొక్కు ఆర్.టీ.సి బస్, ఎడమ లేన్ నుండి నా లేన్ లోకి ఏమాత్రము ఇండికేషన్ లేకుండా వచ్చేస్తున్నాడు. ఒరే నేనున్నాను రా! ఈ లేన్ లో ఆల్రెడీ, నన్ను వెళ్లనివ్వరా, నేనెందుకు ఆగాలిరా నీకోసం, అనుకుంటూ వాడూ ముందు కెళ్లాలని చూశా . వాడేం బోయా! సగం బస్ నా లేన్ లోకి తెచ్చేసాడు. ఎంజేద్దాం! బస్సుతో పెట్టుకుంటే పడేది మనకే బొక్క అనుకుంటూ ఆగక తప్పలేదు నాకు. జూబిలీ హిల్స్ కి చేరేసరికి ఇటువంటివే మరల మరల పునరావృత్తమవుతూ నా ఓపిక తినేసాయి. ఉసూరుమంటూ సుప్రియా అక్క వాళ్ళింటికి చేరేసరికి, అక్కడ నాకు వాళ్ళు మేము సెకండ్ షోకి వెళ్తున్నాం, నీతో ఇంటికి రాము అని ఇన్ఫర్మేషన్ ఇచ్చారు, నీకే మాత్రం చెప్పటమే గొప్ప అన్న విధంగా. కావాలంటే భోజనం పెడతాం తిని ఇక్కడన్నా తొంగో లేక ఉదయాన్నే నీ ఆఫీసుకు ఉద్దరిద్దామని అనుకుంటే ఇప్పుడే కొంపకు పో అని ఆఫర్ ఇచ్చారు. చూడు నాకు మా అక్క చాలా మూటా ముల్లె ఇచ్చింది, అది మన ఇంటికి రావాలంటే నీ వెహికల్ వొదిలేసి వెళ్ళు, నేను రేపు ఆ మూటా ముల్లె వేసుకొని వస్తా అని అల్టిమేటం ఇచ్చింది సుప్రియా,.

సరే నా కొంపకు పోయి, నే హాయిగా



ఉంటా అని అనుకోని, వాళ్ళ అక్కకొడుకుని అడిగా, నన్ను మెయిన్ రోడ్ దాకా డ్రాప్ చేయరా బాబు అని. వాడికి సినిమా టైం అవుతుంది , స్కూటర్ లో అయితే తొందరగా డ్రాప్ చెయ్యొచ్చు అని స్కూటర్ తీసాడు. తెలివిగల్లోడు వాడు నా నస తప్పించుకోవొచ్చు అని నన్నే డ్రైవ్ చేయమంటారు ఎప్పుడూ. సరే బయలు దేరాం యూ-టర్న్ని సర్రుమని కార్‌కి పిల్లర్ కి మధ్య గాప్‌లో పార్లల్‌గా తిప్పేసా. మా వోడు బాబాయ్, అలా తిప్ప కూడదు అంటూ మొదలెట్టాడు ,సర్లే రా ఆ బండ కారోడు వాడిదే పెద్ద కారు అనుకుంటూ ,అంత పెద్ద టర్నింగ్ రేడియస్



తీసుకుంటూ ఉంటే, మనకి టైం అయిపోవటంలా అంటూ దూసుకెళ్లిపోయా. వాడు వాడి తలకొట్టుకోవటం మిర్రర్ లో కనిపించింది. మెయిన్ రోడ్ లో దింపి వాడు సక్కా బోయాడు ఎనక్కి తిరగకుండా.

ఇంతలో లింగంపల్లి బోయే బస్సు వచ్చింది, ఎక్కేసా. విండో సీట్ దొరికింది, ఏసీ బస్సు కావటంతో సౌలభ్యంగా వుంది. ఆహా! హాయిగా వుంది ప్రయాణం. పబ్లిక్ ట్రాన్స్పోర్టేషన్ జిందాబాద్, ఒక్క బస్సు నలభై మందిని తీసుకెళ్తుంది అంటే పది కార్లకి సమానమబ్బా, దీనికి రోడ్ మీద మహారాజ ట్రీట్మెంట్ ఇవ్వాలి ఎవడైనా, ముందు బస్సు తర్వాతే ఏదైనా, కార్తైనా గీరైనా అని ఆలోకాప్నేలలో మునిగిపోయా. ఇంతలో మా వోడు పక్క లైన్ లోకి తిరుగుతున్నాడు, ఎనక నుండి కారోడు భయ్ మంటూ హార్న్ కొడుతున్నాడు. బుద్దిలేనోడా! నీ కారేంత బే, అందులోను అన్నీ బస్సులకు ఇండికేటర్స్ వుండవు, బస్సుల బ్లైండ్ స్పాట్ చాలా పెద్దది, అస్సలకి నువ్వు వెనకున్నవని ఎవడికి ఎరుక బే , ఐన ఈ జనాలెప్పటికీ తెలుసుకుంటారు అని తిట్టుకున్నా.

బస్సు హై టెక్ సిటీ మీద వెళ్తుంది, బాగా ట్రాఫిక్ గా వుంది. అందులోనూ, మన ఐ.టి పిల్లకాయలు పదకొండు దాటితే , అడ్డమైన తిండీ తినడానికి రోడ్ మీదకొస్తారు. వీళ్ళని చూస్తే నాకు ఓ డాక్టర్ ఫ్రస్ట్రేషన్ గురుంచి మొన్న వాట్సాప్ లో చదివిన మెసేజ్ గుర్తుకొచ్చింది. ప్రతీ అడ్డమైనవి తింటారు, ఎన్ని రోజుల నూనో, ఎన్ని సార్లు రీ యూజ్ చేశారో చూడకుండా, బజ్జీలు, పునుగులు, నానా గడ్డీ తిని వస్తారు మా దగ్గరకు. మేము ఒక టాబ్లెట్ రాయగానే, డాక్టర్! డాక్టర్! ఏమన్నా సైడ్ ఎఫెక్ట్ ఉంటాయా అని అమాయకంగా అడుగుతారు, వీళ్ల జిమ్మడా అని. ఆ డాక్టర్ ఏమో కానీ వీళ్ల వలన ఐన జాం వలన చాలా లేట్ గా దిగా ఆల్విన్ చౌరస్తా దగ్గర. కొంచెం దూరంలోనే వుంది ఫుట్ ఓవర్ బ్రిడ్జి. నడిచే ఓపిక లేదు. రోడ్ దాటేద్దాం అడ్డంగా అని డిసైడ్ అయ్యా. చీకట్లో కనపడనేమో అని చెయ్యి ఎత్తి దాటుతున్నా, ఒక కార్ వెధవ నేనాగను, నువ్వే ఆగు అన్నట్టు డిం అండ్ డిప్ కొడుతూ వస్తున్నాడు. ఏబ్రాసెదవా! ఎప్పుడు తెలుసుకుంటార్రా మీరు, పాదచారులు దేవుళ్ళు రా! వాళ్లకి ప్రాధాన్యత ఇవ్వాలిరా అని తిట్టుకుంటూ, కాళ్ళీడ్చుకుంటూ ఇల్లు చేరా.

వచ్చేసరికి అమ్మ ఎదో సినిమా చూస్తూ వుంది హాల్లో. ఏంటమ్మా ఈ టైం లో మేలుకోవటం , హాయిగా పడుకోక అని మా అమ్మని తన రూమ్ లోకి తోలేసి, ఏమి సినిమా అబ్బా అంటూ టీ.వీ వైపు చూసా. సౌందర్య కోపంగా అంటుంది శ్రీకాంత్ తో నువ్వు చేస్తే సంసారం అదే ఎదుటోళ్లు చేస్తే వ్యభిచారమా అని. కళ్ళు నులుము కున్నా నాకేంటి అక్కడ శ్రీకాంత్ ప్లేస్ లో నేను కనపడుతున్నాను.

# ఆయమ్మ అంతే!

## ఆమె ఒక మదర్ థెరీసా!



మా నాయన చెమటలు కార్చుకుంటా గసపోసుకుంటా సాయంత్రమో రాత్రో ఇంటికి వస్తాడు.

ఊసురోమని ఆయన ఇల్లు చేరే టయానికి సరిగ్గా మా అమ్మ ఎప్పుడూ ఇంట్లో ఉండదు.

పగలని లేదు రాత్రని లేదు, ఎవరు ఎప్పుడొచ్చి " జయమ్మక్కా.. ఏం చేసేది ఇప్పుడిట్లా అయిపోయిం దే ..ఇప్పుడింక నాకు నువ్వే దిక్కు. ఏం చేస్తావో, యెట్లా చేస్తావో నీ ఇష్టం అక్కా .." అని ఏడిస్తే చాలు, ఆయమ్మ అంతగా కరిగి పోతుంది. మాయమ్మ ముక్కుపుల్ల, ఉంగరం, కమ్మలు ఎప్పుడూ ఎవరికోసమో కుదవలోనే(తాకట్టు) వుంటాయి. ఆ మూడూ కలిపి ఆయమ్మ వేసుకుంది మాత్రం మా కళ్ళతో మేం మా చిన్నప్పుడు ఎప్పుడూ చూసిందే లేదు. మా నాయన రూపాయి రూపాయి కూడబెట్టి ఇదారేళ్ళకు అప్పుడు ఒకటి, అప్పుడు ఒకటి కష్టపడి చేపించిన సొత్తులు అవి.

మా ఇంట్లో ఏ గ్లాసు చూసినా, ఏ ప్లేట్ చూసినా, మంచం, టేబుల్ చూసినా, మేము చదువుకోవడాని రాసుకోవడానికి చేయించిన ఒకప్పుడు కరణాలు వాడే చెక్క దస్కులు చూసినా..ఎప్పుడూ మాకు మా నాయన చెమటా , రక్తమే.. గుర్తుకు వస్తాయి. మేము తినే ప్రతి అన్నంముద్ద పైనా అయన చెమట, రక్తం వుంటాయి అనేది మా అమ్మ. అందుకే ఇప్పటికి మేము తినే ప్రతి అన్నంముద్దకు ముందు మా అమ్మా నాయనా గుర్తుకు రాకుండా వుండరు.

మా యస్టీ కాలని లోనే అదెందుకో తెలియదు కానీ ఎవరికి ఏం కష్టం వచ్చినా ముందుగా అందరికి గుర్తుకు వచ్చేది మా అమ్మే.. జయమ్మే..! అట్లా అని మేం ఏమీ బాగా వుండే వాళ్ళం కాదు. మా నాయన ఒక్కడే చిన్న జీతగాడు. ఇల్లు మొత్తానికి మా నాయన జీతమే ఆధారం. అందునా మా నాయనకు జీతం చాలా తక్కువ. లంచాలు, మామూల్లు తీసుకునే మనిషి కాదు. దానికి తోడు ఆయన వైద్యం కోసం చాలా ఊర్లు, ఆస్పత్రులు తిరగాల్సి రావటంతో చాలా డబ్బులు ఖర్చు అయ్యేవి. చాలా కష్టాలతోనే మా బాల్యం గడచింది.

సెలవుల్లో నన్ను మాయమ్మ కూలి పనులకు పంపేది.కూలి పనులంటే పెద్దగా కాయకష్టంతో కూడిన పనులు కావు, చింతపండు తొక్కు తీయడం గింజలు వేరుచేయడం , వేరుసెనగకాయలు వల్చడం లాంటి పనులు.ఒక్క రూపాయి ఎంత కష్టపడితే వస్తుందో పిల్లోల్లకి తెలియల్ల కదా చిన్నప్పటి నుంచే అనేది. ఆయమ్మ మాటకు మా ఇంట్లో అడ్డం చెప్పే వాళ్ళు ఎవురుండారు? నన్ను మా తమ్ముడిని కొట్టినప్పుడు , దండించినప్పుడు మేము గట్టిగా ఏడిస్తే ఆయమ్మ శబ్దం రాకుండా మౌనంగా ఏడ్చేది. మా ఏడుపు కళ్ళతో ఆయమ్మను కోపంగా చూస్తామా ..ఆమె కళ్ళనిండా నీళ్ళు కనపడేవి. మమ్మల్ని కొట్టి ,ఆయమ్మ ఎందుకు ఏడ్చేదో అప్పట్లో మా అన్నతమ్ముల్లకి అర్థం అయ్యేది కాదు.

ఎవరైనా మా అత్తలో పిన్నమ్మలో, పెద్దమ్మలో పసికందలు కదమ్మా చింతబర్రతో నువ్వు కొట్టేది ఎందుకు? మళ్లింకా నువ్వు ఏడ్చేది ఎందుకూ అని వ్యంగ్యంగా అంటే, ఆమె ముక్కు చీదుకుంటా, చీరకొంగుతో కళ్ళు తుడుచుకుంటా " మొక్కగా వుండగానే వంచాలమ్మా మాను అయినాక వంగు అంటే వంగుతుందా యాడన్నా" అనేది. అదంతా అయిపోయాక, మాకు అన్నం కలిపి తినిపిస్తా బుద్ధి మాటలు, నీతి కథలు చెప్పేది.అట్లా ఎన్నిసార్లు ఆమె ఎన్నెన్ని మాటలు, నీతి కథలు చెప్పిందో లెక్కే లేదు. మేం ఇంట్లో వున్నప్పుడు రోజంతా నిద్ర లేచిందగ్గర నుంచి, మేం పడుకునేదాకా మాయమ్మ మాతో ఎన్నో మాటలు మాట్లాడేది,ఎప్పుడూ మంచి ఏమిటో, చెడు ఏమిటో చెపుతూనే ఉండేది. ఆయమ్మ బాగా పుస్తకాలు చదివేది కదా అందుకే అన్ని మాటలు, కథలు నేర్చి ఉంటుందని మేమంతా అనుకునే వాళ్ళం. ఫారెస్ట్ డిపార్టుమెంటులో ఉద్యోగస్తులకి ప్రతి సంవత్సరం టార్గెట్ వుంటుంది. అడవిలో మేతకు వెళ్ళే పశువులపైనా, కట్టెలు కొట్టే వాళ్ళ పైనా పన్నులు, అపరాధాలు వుంటాయి. అడవి నుండి కట్టెలు కొట్టి తెచ్చి అమ్మే వాళ్ళ నుండి అపరాధరుసుం వసూలు చేసి గవర్నమెంట్ కు చలాన్ కట్టాలి. ఆ చలాన్ కట్టాల్సిన మార్చ్ నెల వచ్చిందటే చాలు మా అమ్మ మొహంలో కళ తప్పిపోయేది. ఎందుకంటే ఆ నెల మా నాయన జీతం తీసుకుని, ఆయనకు వాళ్ళ పై ఆఫీసర్లు ఇచ్చిన టార్గెట్ ప్రకారం తను వసూలు చేసి ఉండాల్సిన టార్గెట్ ఎంతో





# ఓ విప్లవాత్మక అడుగు ట్రాఫిక్ మార్షల్ ఏర్పాటు

### సైబరాబాద్ సిపి అవినాష్ మహంతి

**శేరిలింగంపల్లి, జూన్ 12 (జనంసాక్షి) :** నగరంలో విపరీతంగా పెరుగుతు న్న జనాభా తది అనుగుణంగా పెరుగుతు న్న వాహన రద్దీకి అనుగుణంగా ట్రాఫిక్ నియంత్రణకై ప్రవేశపెట్టిన ట్రాఫిక్ మార్షల్ వ్యవస్థ దేశంలోనే ఒక విప్లవాత్మక అడుగుగా సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి అభివర్ణించారు. ఈ మేరకు సైబరాబాద్ కమిషనరేట్ పరిధి సమావేశ మందిరంలో శుక్రవారం ఏర్పాటుచేసిన ప్రత్యేక మీడియా సమావేశంలో ఈ మేరకు ఆయన ప్రసంగించారు. సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ (ఎస్సీ ఎస్సీ) సంస్థ సహకారంతో సైబరాబాద్ పరిధిలో ట్రాఫిక్ నియంత్రణ తో పాటు వాహన రద్దీని సమీక్షిస్తూ ప్రతి ఒక్కరికి నిర్దిష్టతతోకూడిన సులభతరమైన ప్రయాణాన్ని అందించడానికి ఎప్పటికప్పుడు సాంకేతిక పరిజ్ఞానాన్ని, స్వచ్ఛంద సంస్థల సహకారాన్ని తీసుకుంటూ ట్రాఫిక్ పద్మవ్యూహంలో అవిశ్రాంత పోరాటాన్ని కొనసాగిస్తూనే ఉన్నామని సిపి వెల్లడించారు. క్రమశిక్షణతో బాధ్యతాయుతంగా పనిచేసి పోలీసు వ్యవస్థకు మరింత వన్నె తెచ్చే విధంగా, ట్రాఫిక్ నియంత్రణకై ఒక విప్లవాత్మక అడుగుగా ప్రజలు భావించేలా ట్రాఫిక్ మార్షల్స్ పనిచేయాల్సిన బాధ్యతను సిపి గుర్తు చేశారు. ట్రాఫిక్ విభాగం జాయింట్ సిపి జోయల్ డేవిస్ మాట్లా డుతూ ట్రాఫిక్ మార్షల్స్ పనితీరును ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఐటీ కారిడార్ పరిధిలోని వివిధ కంపెనీల సహాయ సహకారాలతో ట్రాఫిక్ మార్షల్స్‌కి వేతనాలను అందజేయడం జరుగుతుందని, భాగస్వామ్య పద్ధతిలో వ్యవస్థను తీర్చిదిద్దుకోవడానికి ఇది ఒక గొప్ప ముందడుగుగా ఆయన కీర్తించారు. ట్రాఫిక్ మార్షల్స్ ట్రాఫిక్ నియంత్రణ, సులభతరమైన వాహన రవాణా కోసం పూర్తిస్థాయిలో విధులను నిర్వర్తిస్తారని, యదేచ్ఛగా ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించే వారి విషయంలో ఆధారాలతో కూడిన సమగ్రమైన రిపోర్టును ట్రాఫిక్ విభాగం కార్యాలయా లకు అందజేస్తారని... తద్వారా ట్రాఫిక్ విషయంలో రూల్స్ బ్రేక్ చేసే వారికి ఇక చుక్కలు చూపించక తప్పదని జోయల్ డేవిస్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ ఎస్సీ ప్రతినిధులు రమేష్ కాజా, రాజేష్, రహేజా మైండ్ స్పేస్ డైరెక్టర్ శ్రవణ్ కుమార్, ట్రాఫిక్ విభాగం అడిషనల్ డిసిపిలు శివ కుమార్, వీరన్న, మాదాపూర్ ట్రాఫిక్ ఏసిపి సత్యనారాయణ, రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఏసిపి బాలాజీ, శంషాబాద్ ట్రాఫిక్ ఏసిపి నాగభూషణం, కూకట్పల్లి ట్రాఫిక్ ఏసిపి వెంకటయ్య, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు, ట్రాఫిక్ మార్చల్స్ పాల్గొన్నారు.

# పారదర్శకంగా.. ప్రభుత్వ పాలన





- 6 గ్యారంటీలు తప్పక అమలు చేస్తాం...
- రైతుబంధు పేర ప్రజాధనం దుర్వినియోగం
- రాష్ట్ర శాసనసభ సభాపతి ప్రసాద్ కుమార్

**వికారాబాద్ జిల్లా బ్యూరో జూలై 12 (జనం సాక్షి):** ప్రజాస్వామ్యానికి లోబడి ప్రజలకు సేవ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టు బడి ఉందని శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. శుక్ర వారం వికారాబాద్ పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు స్పీకర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన 6 వాగ్దానాలను తప్పనిసరిగా నెరవేరుస్తుందన్నారు. ఇచ్చిన వాగ్దానాలను ఇప్పటికే ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ ప్రజలకు చేరవేస్తున్నట్లు ఆయన తెలిపారు. గత ప్రభుత్వం రైతుబంధు పేరిట ప్రజాధనాన్ని వృధా చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వం రైతు భరోసా కింద ఎకరానికి 15 వేల రూపాయల చొప్పున చెల్లించేందుకు వీలుగా ప్రజాభిప్రాయ సేకరణ చేసేందుకు సబ్ కమిటీని వేయడం జరిగిందని ఆయన తెలిపారు. ప్రజా సేకరణ అనంతరం ఎన్ని ఎకరాలకు రైతు భరోసాను వర్తింపచేయాలో నిర్ణయం తీసుకున్న తర్వాత తప్పనిసరిగా రైతులకు పెట్టుబడి కింద ఎకరాకు 15 వేల రూపాయలు అందించడం జరుగుతుందని స్పీకర్ హామీ ఇచ్చారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు 2 లక్షల రూపాయల మేరకు రుణమాఫీ చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా షాదీ ముబారక్ కింద 18 మంది లబ్ధిదారులకు, కళ్యాణ లక్ష్మి కింద 27 మంది లబ్ధిదారులకు స్పీకర్ చేతుల మీదుగా చెక్కులను పంపిణీ చేశారు.చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఇంచార్జ్ అదనపు కలెక్టర్ సుధీర్, మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల రమేష్ , ఫ్లోర్ లీడర్ సుధాకర్ రెడ్డి, ఆర్డీఓ వాసు చంద్ర, తహసిల్దార్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రతతో రోగాలు దరిదాపునకు రావు

- ఇంట్లో పేరుకుపోయిన చెత్త నీటి నిల్వలను తొలగించాలి
- మున్సిపల్ చైర్ పర్సన్ తాటికొండ స్వప్న పరిమళ్



**తాండూరు జులై 12(జనంసాక్షి) :** పరిసరాల పరిశుభ్రతతోనే రోగాలు దరిదాపునకు రావని మున్సిపల్ చైర్ ర్సన్ తాటికొండ స్వప్న పరిమల్ పేర్కొన్నారు.శుక్రవారం తాండూరు పట్టణంలో ని ఆరవ వార్డులో ఫ్రైడే డ్రైడే కార్యక్రమం మున్సిపల్ కమిషనర్ విక్రమ్ సింహరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా వార్డులో ఇంటింటికి తిరుగుతూ ఇళ్లలో పేరుకుపోయిన చెత్త మరియు నీటి నిలువలను తొలగించాలని ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ తాటికొండ స్వప్న పరిమళ్ మాట్లాడుతూ.. పరిసరాల పరిశుభ్రత తోనే మెరుగైన వాతావరణం లభిస్తుందని తెలిపారు. ఇంటి పరిసరాలలో పేరుకుపోయిన చెత్తను తొలగించాలని సూచించారు అదేవిధంగా నీటి నిలువలద్వారా దోమలు ఉత్పత్తిఅయి ప్రజలు రోగాల బారిన పడతారని సూచించారు. ప్రజలు తమ తమ ఇళ్లలో నీటి నిలువలు నిలువ లేకుండా తగు జాగ్రత్తలు వహించాలని సూచించారు. వర్షాకాలన్ని దృష్టిలో ఉంచుకొని పట్టణ ప్రజలు దోమల బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తగా కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని తెలిపారు .ప్రతి శుక్రవారం మరియు ఆదివారం పట్టణంలో ని వార్డు లలో 10 గంటల పది నిమిషాలకు ఫ్రైడే ఫ్రైడే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, వార్డు కౌన్సిలర్, అంగన్వాడి ఆర్పీలు తదితరులు ఉన్నారు.

# దోమ మండలంలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు

- అమ్మ ఆదర్శ పాఠశాలల పనులను వేగవంతం చేయాలి
- రోగులకు అందుబాటులో వైద్యులు ఉండాలి
- విద్యార్థులకు అన్ని వసతులు కల్పించాలి : కలెక్టర్ ప్రతీక్ జైన్







**దోమ జులై 12 (జనం సాక్షి) :** పాఠశాలల్లో మౌలిక వసతుల పనులు పరిశీలన శు క్రవారం దోమ మండలం అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో ఆయా ప్రభుత్వ బడులలో కొనసాగుతున్న పనులను వేగవంతంగా చేపట్టి సత్వరమే పూర్తి చేయాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. దోమ మండలంలోని బొంపల్లి, బాసుపల్లి గ్రామాలలో ఉన్నత, ప్రైమరీ ప్రభుత్వ పాఠశాలలను కలెక్టర్ సందర్శించారు. మౌలిక సదుపాయాలు పెంపొందించేందుకు వీలుగా చేపట్టిన పనులను పరిశీలించారు. దోమ మండలంలోని బొంపల్లి ఉన్నత, ప్రాథమిక పాఠశాలలను, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లను సందర్శించా రు. పాఠశాలల్లో వంట గది, వరండా, వాటర్ సంప్, టాయిలెట్స్ తదితర నిర్మాణాలు, మరమ్మతు పనులను పరిశీలించి, అధికారుల ను వివరాలు అడిగి తెలుసుకున్నా రు. మిషన్ భగీరథ నీరు సరఫరా జరుగుతోందా, వాటర్ సప్లై కనెక్షన్ ఉందా, నీటి సరఫరా విషయమై వివరాలు సేకరించి రిపోర్ట్ ఇవ్వాలని అధికారులకు ఆదేశించారు. ఇప్పటికే చాలావరకు పాఠశాలల్లో పనులు పూర్తయ్యా యని, ఇంకనూ పలు స్కూళ్లలో వివిధ దశల్లో కొనసాగుతున్న పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయించాలని కలెక్టర్ సంబంధి త అధికారులను ఆదేశించారు. అవసరమైన పనులను మాత్రమే చేపట్టాలని, నాణ్యతా ప్రమాణాలు పాటించేలా పకడ్బందీ పర్యవేక్షణ జరపాలని సూచించారు. వర్షాకాలం సీజన్ అయినందున పాఠశాల ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. పాఠశాలల్లో విద్యార్థు ల సంఖ్య మరియు ఉపాధ్యాయుల సంఖ్యకు సంబంధించి పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వన మహోత్సవంలో భాగంగా పాఠశాలల ఆవరణలో మూడువరుసలు మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకో వాలని అధికారులకు సూచించారు. అనంతరం దోమ మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ప్రతిరోజు ఓపికి ఎంత మంది వస్తున్నారు, అంబులెన్సు ఉందా, ఎంత మంది స్టాఫ్ ఉన్నారని వివరాలు అడిగి తెలుసుకున్నారు.. ఆసుపత్రికి వచ్చిన పేసెంట్లతో మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీశారు. ఓపి స్లిప్స్ అందుబాటులో ఉంచుకోవాలని సంబంధిత డాక్టర్‌కు ఆదేశించారు. స్థానిక తహసీ ల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మహిళలతో మాట్లాడారు. మహిళలు సబ్సిడీ లోన్స్ తీసుకొని ఏమి పనులు చేస్తున్నారని అడుగగా కుట్టు మిషన్‌లు, కోళ్ల ఫామ్స్, క్యాంటీన్ పెట్టుకొని నడుపుతున్నామని కలెక్టర్‌కు తెలిపారు. ఐకెపి ద్వారా ప్యాడి ప్రోక్యూర్‌మెంట్ జరుగుతుందా, వివరాలు అడిగి తెలుసు కున్నారు. తదనంతరం దోమ మండలం కస్తూరిబాగాంధీ బాలికల విద్యాలయం సందర్శించారు. వంట గది, టై లెట్స్, రన్నింగ్ వాటర్ అన్నింటిని పరిశీలించారు. మిషన్ భగీరత వాటర్ సప్లై ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు.

**బాలికలు అందరితో కలిసి సహపంక్తి భోజనం చేశారు.**

కలెక్టర్ తో పాటు జిల్లా విద్యా శాఖ అధికారి రేణుక దేవి,ఎంపీడీఓ మహేష్ బాబు, తహసీల్దార్ పురుషోత్తం,ఇఇ బాబు శ్రీనివాస్, ఎమ్ ఇఓ హరి చందు, పద్మజ, ప్రధాన ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు, డాక్టర్ రజిత, సంబంధిత అధికారులు,తదితరులు ఉన్నారు.

# నైని బొగ్గు గనుల తవ్వకానికి పూర్తిగా సహకరిస్తాం

- ఒడిస్సా సీఎం మోహన్ చరణ్ మాంజీ
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వినతికి స్పందించిన ఒడిస్సా సీఎం
- వెంటనే చర్యలు చేపట్టండి అంటూ అధికారులకు ఒడిస్సా సీఎం ఆదేశాలు



**ఖమ్మం జిల్లా బ్యూరో,జులై12(జనంసాక్షి):**
2015లో సింగరేణి కేటాయించిన ఒరిస్సా రాష్ట్రం అంగుల్ జిల్లాలోని నైని బొగ్గు గనుల్లో తవ్వకాలు చేపట్టడానికి సహకరించాల్సిందిగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు ఒడిస్సా సీఎంను కోరగా ఆయన వెంటనే స్పందించారు. నైనీ బొగ్గు గనుల తవ్వకానికి పూర్తిగా సహకరిస్తామని ఒడిస్సా సీఎం భరోసా ఇవ్వడం కాకుండా తగిన చర్యలు చేపట్టాలని ఆ రాష్ట్ర ఉన్నతాధికారులకు వెను వెంటనే ఆదేశాలు జారీ చేశారు. నైని బ్లాక్ లో సింగరేణి కార్యకలాపాల ప్రారంభానికి సంబంధించి ఎలాంటి అడ్డంకులు లేకుండా చూడాలని కోరేందుకు శుక్రవారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అధికారుల బృందంతో కలిసి ఒడిస్సా సీఎంను ఆ రాష్ట్ర సచివాలయంలో కలిశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సింగరేణికి బొగ్గు బ్లాకుల ఆవశ్యకతను వివరించారు. 2017 లోనే సింగరేణికి నైని గనులను కేటాయించారు తెలంగాణలో కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఈ విషయాలకు సంబంధించి గత ప్రభుత్వంలో నాటి బొగ్గు గనుల మంత్రి ప్రహ్లాద జోషిని కలిసి విజ్ఞప్తి చేసిన విషయాన్ని వివరించారు. నాడు అందచేసిన వినతి పత్రాల ను అందజేశారు. తాడిచర్ల బ్లాక్, నైని బ్లాక్ లకు సంబంధించిన అడ్డంకులను తొలగించాల్సిందిగా గతంలోనే విజ్ఞప్తి చేసినట్టు వివరించారు. నైనీ బ్లాకు లో గనుల తవ్వకానికి పారిశ్రామిక, పర్యావరణ అనుమతులు సైతం వచ్చాయని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఒడిస్సా సీఎంకు వివరించారు. అటవీ, ప్రైవేటు భూములను సింగరేణికి బదలాయించాల్సిన అంశం పెండింగ్లో ఉంది, ఈ సమస్య పరిష్కారం అయితే సింగరేణి తవ్వకాలను ప్రారంభిస్తుందని వివరించారు. నైని బ్లాక్లో తవ్వకాలు చేపట్టడం మూలంగా ఒరిస్సా రాష్ట్ర యువకులకు పెద్ద సంఖ్యలో ఉపాధి, పన్నుల రూపంలో 600 కోట్ల వరకు ఒరిస్సా సర్కార్ కు ఆదాయం సమకూరుతుందని వివరించారు. దేశంలో విద్యుత్ సరఫరా సమస్యను పరిష్కరించడానికి, ప్రభుత్వ సంస్థ సింగరేణి మనుగడకు నైనీ బొగ్గు గనులు అత్యంత ఆవశ్యకమని డిప్యూటీ సీఎం వివరించారు. ఈ మేరకు అన్ని వివరాలతో కూడిన లేఖను ఒడిస్సా సీఎంకు అందజేశారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క విన్నపం తో ఒడిస్సా సీఎం వెంటనే స్పందించారు. నైని బొగ్గు గనుల తవ్వకానికి పూర్తిస్థాయిలో సహకరిస్తామని డిప్యూటీ సీఎం భట్టి బృందానికి స్పష్టం చేశారు. భూముల బదలాయింపు, విద్యుత్తు, రహదారుల సమస్యలను వెను వెంటనే పరిష్కరించాలని స్థానికంగా ఉన్నత అధికారులకు ఒడిస్సా సీఎం ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశంలో ఇంధన శాఖ ప్రధాన కార్యదర్శి రోనాల్డ్ రోస్, సింగరేణి సిఎండి బలరాం నాయక్, ఇంధన శాఖ ఓఎస్డి సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

**పెన్ పహాడ్, జూలై 12 (జనంసాక్షి) :**
మండల కేంద్రంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలను శుక్రవారం జిల్లా కలెక్టర్ తేజ స్ నందలాల్ పవర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు, ముందుగా సింగారెడ్డి పాలెం ప్రాథమిక పాఠశాలను సందర్శించి ఉపాధ్యాయుల హాజరు పట్టికను పరిశీలించిగా ఇద్దరు ఉపాధ్యాయులు సెలవు చీటి పెట్టకుండా గైరాజరవడంతో ఆగ్రహం వ్యక్తం చేసి, మల్లి ఇలాంటివి పునరావృతం కాకుండా చూసుకోవాలని హెచ్చరించారు, మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి సిబ్బంది అటెండెన్స్ రికార్డులను పరిశీలించి డాక్టర్ స్రవంతి కి పలు సూచనలు చేసి ఆరోగ్య కేంద్రంలోని ల్యాబ్ రూమ్, డ్రగ్స్ రూమ్ లను తనిఖీ చేశారు, అనంతరం ఆరోగ్య కేంద్రంలోని పరిసరాలను పరిశీలించి ప్లాంటేషన్ నిర్వహించాలని కార్యదర్శి శివ నాయక్ కు సూచనలు చేసి మొక్కను నాటారు, అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వెళ్లి ఉపాధ్యాయుల హాజరు పట్టికను పరిశీలించి సెలవుల్లో ఉన్న వారిని వివరాలు అడిగి తెలుసుకున్నారు, తదుపరి పదో తరగతి విద్యార్థులతో ముచ్చటించారు, అనంతరం మధ్యాహ్న భోజనాన్నిపరిశీలించి మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం వడ్డించాలని ఆదేశించారు, ఆపై మండల తహసిల్దార్ కార్యాలయాన్ని పరిశీలించి తహసిల్దార్ మందడి మహేందర్ రెడ్డి పలు విషయాలపై వివరాలు అడిగి తెలుసుకుని కార్యాల సిబ్బందిని పరిచయం చేసుకున్నారు, ఈ కార్యక్రమంలో తహసిల్దార్ మందడి మహేందర్ రెడ్డి, ఎంపీడీవో జె వెంకటేశ్వరరావు, డాక్టర్ స్రవంతి, ఎంఈఓ నకిరేకంటి రవి, ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## గ్రామ ప్రజలు పరిశుభ్రత పాటించాలి

- జనంసాక్షి' కథనానికి జెడ్పీసీఈవో సురేష్ కుమార్ స్పందన

**మునగాల, జూలై 12(జనంసాక్షి):**
మండలంలోని తాడువాయిలో గత కొన్ని రోజులుగా ప్రజలు వలు విషజ్వరాలతో బాధపడుతున్న వైనాన్ని గురువారం 'జనంసాక్షి' దినపత్రిక మొదటి పేజీలో 'విష జ్వరాలతో తాడ్వాయి గ్రామం' శీర్షికన ప్రచురితమైన కథనానికి జిల్లా పంచాయితీ అధికారి కె. సురేష్ కుమార్ స్పందించారు. దీంతో ఆయన శుక్రవారం తాడ్వాయి గ్రామానికి చేరుకొని గ్రామంలో పారిశుధ్యం, మురుగు కాలువల పరిస్థితిని పరిశీలించారు. పంచాయితీ కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో మురుగుకాలువల నిర్మాణం సక్రమంగా లేదని, గ్రామప్రజలు నివాస ప్రాంతాలలో పెంటదిబ్బలు ఏర్పాటు చేయడంతో దోమల వ్యాప్తి ఉధృతంగా ఉందన్నారు. కాగా గ్రామంలోని మంచినీరు సరఫరా చేసే ఓపైపు మురుగు కాలువలో ఉండడంతో తక్షణమే అటువంటి పైపును మార్చాలని గ్రామపంచాయితీ సెక్రటరీని ఆదేశించారు. గ్రామంలో సిసిరోడ్లపై కొంతమంది గేదెలను కట్టివేయడం మూలంగా ఆ ప్రాంతంలో పరిశభ్రత లోపిస్తుందన్నారు. సిసిరోడ్లపై గేదెలను కట్టివేసే వారికి నోటీసులు ఇచ్చి తగుచర్యలు తీసుకోవాలని పంచాయితీ కార్యదర్శిని ఆదేశించారు. అనంతరం వైద్యసిబ్బందితో ఆయన పలు వీధులలోకి వెళ్లి నిల్వ ఉన్న నీటి తొట్లను శుభ్రం చేయించారు. ప్రతి ఒక్కరు తను ఇంటితో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే ఆరోగ్యవంతంగా ఉంటారన్నారు. వైద్యసిబ్బంది గత పదిహేను రోజులుగా క్యాంపులు నిర్వహిస్తున్నారని, ఇదే తరహా మరికొన్ని రోజులు శిబిరాలను ఏర్పాటు చేసి ప్రతి ఇక్కడికి వైద్యం అందుబాటులోకి తీసుకురావాలని కోరినట్లు తెలిపారు. ఇదిలా ఉండగా మండల పంచాయితీ అధికారి ఎన్. భూపాల్ రెడ్డి, పంచాయితీ కార్యదర్శి ఎ.సతీష్ ప్రతి వీధిలో బ్లిచింగ్ పౌడర్ ను సిబ్బందితో చల్లించారు. జిల్లాపంచాయితీ అధికారి వెంట ఎంపిడిఓ, కె.రమేష్ దీనదయాళ్, తహసిల్దార్ వలిగొండ ఆంజనేయులు, మండల పంచాయితీ అధికారి ఎన్. భూపాల్ రెడ్డి, గ్రామపంచాయితీ కార్యదర్శి అబ్బగాని సతీష్, రేపాల ప్రాథమిక కేంద్రం వైద్యాధికారి డా శ్రీశైలం, తాడువాయి పల్లెదవాఖాన వైద్యాధికారి వైష్ణవి, వీహెచ్చి వైద్య సిబ్బంది, గ్రామానికి చెందిన ఆశావర్కర్లు ఉన్నారు.




### పేదల కడుపు కొట్టి రేషన్ బియ్యాని గుంటనక్కల్లా తన్నుకు పోతున్న అక్రమ దందాగాళ్ళు
### అధికారుల చర్యలేమవుతున్నాయి..
### నిఘావర్గాల నిఘా ఏమవుతుంది
### రేషన్ దందాకు అడ్డు కట్ట లేదా..

**పెనుబల్లి, జులై 12 (జనంసాక్షి):**
ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలంలోరేషన్ బియ్యం ఎదేచ్చగా, అడ్డు అదుపు లేకుండా అధికారుల కళ్ళుకప్పి అక్రమరవాణా జరుగు తుందని గ్రామాలలో ప్రజా ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి, పేదలశ్రేయస్సు కోసం వారు కూడా రెండు పూటలు బియ్యం తొ కడుపు నింపు కోవాలనే సదుద్దేశ్యంతొనాటి ప్రభుత్వాలుప్రవేశ పెట్టిన ఈ పథకం అక్రమార్కుల జేబులు నింపుతుంది,రెక్కాడితే గాని డొక్కాడని బడుగు బలహీన వర్గాల పేదలకు అందాలసిన బియ్యాన్ని గోతికాడ గుంట నక్కల్లా కాపుకాసి, వారి ఆర్ధిక బలహీనతలను సొమ్ము చేసుకొనివారి వద్ద నుండి రేషన్ బియ్యాని కొల్లకొడుతూ సొమ్ము చేసుకుంటున్నారు,రేషన్ అక్రమార్గం పట్టకుండా, అక్రమార్కులకు అడ్డు కట్ట వేసేందుకు సంబందిత అధికారులు తీసుకున్న ముందు జాగ్రత్త చర్యలు ఏమవుతున్నాయి, నిగావర్గాలు చేసే ప్రయిత్నాలు ఏమవుతున్నాయి, రేషన్ అక్రమార్కుల భరతం పట్టే యాక్ట్ లు ఏ మైనాయి.. ఇవ్వన్నీ..ఈ చర్యలన్నీ రేషన్ అక్రమార్కులకు బలాదూరేనా.. అనేది అంతు పట్టని ప్రశ్న,పెనుబల్లి మండలం లో పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా దర్జాగ నడుస్తోంది. అక్రమ రవాణా అడ్డుకట్ట వేసేందుకు అధికారులు అనేక చర్యలు తీసుకున్న రేషన్ మాఫియా అక్రమ రవాణా మాత్రం ఆగడం లేదు,రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా ఎన్ని సంస్కరణలు తెచ్చిన.. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించినా ఫలితం లేకుండా పోతోంది, సరైన నిఘా లేకపోవడం, సంబంధిత అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడం వల్లే ఈ అక్రమ దందా దర్జాగా సాగుతోందనేది గుప్పుమంటున్న ప్రజల ఆరోపణలు,రేషన్ డీలర్ లే డాన్ లకు ఏజెంట్లు గా మారి స్వయంగా బియ్యాన్ని కొనుగోలు చేసి రాత్రికి రాత్రే రాష్ట్ర సరిహద్దు దాటిస్తున్నారు, మరో వైపు గ్రామాల్లో రేషన్ బియ్యం సేకరించడానికి ఏజెంట్లను నియమించుకొని రూ.15 కి రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేస్తున్నారు,ఎకరించిన రేషన్ బియ్యాన్ని రాత్రి వేళ్లలో అక్రమ రవాణా ఇబ్బందిగా ఉండటం తో తెల్లవారుజామున అధికారులు గ్రామస్థులు నిద్రకు ఉపక్రమించే సమయంలోగుట్టు చప్పుడుగా దర్జాగా రేషన్ బియ్యాన్నిగమ్యానికి తరలిస్తున్నారు, తెల్లవారు జామున 3 గంటల నుంచి ఉదయం వరకు అక్రమ రవాణా కొనసాగుతుందని ఆయా గ్రామాల ప్రజలు బహిరంగానే చర్చించుకోవడం విశేషం,అక్రమ రవాణాకు అడ్డు అదుపు లేకపోవడంతో అక్రమార్కుల వ్యాపారం మూడు పూలు, ఆరుకాయలుగా విరాజిల్లుతోంది, అంతేకాకుండా రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న దళారులను, వ్యాపారులను అదుపులోకి తీసుకుని జరిమానాలతోనే సరిపెడుతున్నారే తప్ప.. కఠిన చర్యలు తీసుకోపోవడంతోభయపడకుండా అక్రమ మార్కులు కేసులు నమోదు చేసి కోర్టుకు హాజరు పర్చినా ఇట్లే బెయిల్పై వచ్చి తిరిగి అదే అక్రమ సాగించడంతో రేషన్ బియ్యం అక్రమ దందా ఆగడం లేదని సంబంధిత శాఖ అధికారులు వాపోతున్నారు..



## న్యాయ విజ్ఞాన సదస్సులతోనే చట్టాలపై అవగాహన

### సీనియర్ సివిల్ జడ్జి శ్యాం కుమార్

**నేరేడుచర్ల (జనంసాక్షి):**
న్యాయ విజ్ఞాన సదస్సులు గ్రామాల్లో నిర్వహించడం ద్వారా గ్రామీణ ప్రజలకు చట్టాలపై అవగాహన వస్తుందని, హుజూర్ నగర్ సివిల్ సీనియర్ జడ్జి జిట్ట శ్యామ్ కుమార్,జూనియర్ సివిల్ జడ్జి మారుతి ప్రసాద్ అన్నారు.. మండలంలో పెంచీకల్ దీన్నే గ్రామంలో మండల న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో హుజూర్ నగర్ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జక్కుల వీరయ్య అధ్యక్షతన న్యాయ విజ్ఞాన సదస్సు పై రైతు చట్టాలపై నకిలీ విత్తనాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు విత్తనాలు కొనేటప్పుడు రసీదులు తీసుకోవాలని, చట్టాలపై గాని న్యాయ వ్యవస్థ పై అవగాహన పెంచుకోవాలని, వ్యవసాయ భూములు, స్థలాల పట్టా ప్రకారంగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, సివిల్ సమస్యలు కోర్టు ద్వారా పరిష్కారమవుతాయని,చిన్న చిన్న కేసుల పరిష్కారం కొరకు లోక్ అదాలకు ద్వారా పరిష్కారమవుతాయని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ సైదులు,పాలక వీడు ఎస్ఐ లక్ష్మీ నరసయ్య, న్యాయవాదులు కాల్వల శ్రీనివాస్,భూక్యా నగేష్,మాధవ రెడ్డి, సుంకరి క్రాంతి కుమార్,ప్రదిప్తి,రమణ రెడ్డి, మాజీ ఎంపీటీసీ లింగయ్య,గ్రామ ప్రజలు,తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవడం ఎలా ?

- ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలు చేరకపోవడానికి కారణం ఏమిటి ?
- సంస్కరణలు అవసరం ,బడి అంటే ఎలా ఉండాలి?



**ఖమ్మం జిల్లా బ్యూరొ,జులై12((జనంసాక్షి):**
ప్రభుత్వ పాఠశాలలు నేడు ప్రజల అభిరుచులకు అనుగుణంగా లేవేమో అనిపిస్తుంది. గతంతో పోలిస్తే అనేక సౌకర్యాలు పెరిగాయి. మనఊరు/మనబస్తీ – మనబడి పేరుతో అనేక హంగులు సమకూరినయి. మంచినీరు, టాయిలెట్స్, విద్యుత్ సౌకర్యం, లైట్లు, ఫ్యాన్లు, డెస్క్ బల్లలు తదితరాలు సమకూరాయి. ఇటీవల కాలంలో ఉపాధ్యాయుల ప్రమోషన్లతో ఉన్నత పాఠశాలల్లోని ప్రధానోపాధ్యాయుల, సబ్జెక్టు టీచర్ల పోస్టులు భర్తీ అయ్యాయి. పండిట్, పి.ఈ.టి. పోస్టుల అప్గ్రేడేషన్ పూర్తయింది. ఎస్ జి టి లకు కూడా పెద్ద సంఖ్యలో ప్రమోషన్లు రావడంతో వారు కూడా ఒకమేరకు సంతోషంగా ఉన్నారు. ప్రాథమిక పాఠశాలల్లో ఏర్పడిన ఉపాధ్యాయ ఖాళీలను %ఙూజ% ద్వారా భర్తీచేసే వరకు తక్షణ%శీ% విద్యా వాలంటీర్లను నియమించాల్సి ఉంది. ఇదే సమయంలో బడిబాట ఘనంగా నిర్వహించుకున్నాం. కానీ పిల్లలు పెద్దగా చేరినట్లు కనిపించడం లేదు. ప్రభుత్వ పాఠశాలల్లో చేరుతున్న పిల్లల సంఖ్య ప్రతి ఏటా తగ్గిపోతుంది. రాష్ట్రంలో మొత్తం 60లక్షల మంది బడి ఈడు పిల్లలు ఉండగా 2020-21 నాటికి 28లక్షల పదివేల మంది(46.5%) మాత్రమే ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్నారు. కోవిడ్ పుణ్యమా అని అది 2021-22 సంవత్సరంలో 31లక్షల 73వేలకు (52.2%) పెరిగింది.(మూడున్నర లక్షల మంది) ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ వైద్యశాలల ప్రాధాన్యత ఏమిటో ప్రజలకు తెలిసి వచ్చిన సమయం కూడా అదే. అయినా పెరిగిన విద్యార్థులను నిలుపుకోవడంపై నాటి ప్రభుత్వం ఏమాత్రం శ్రద్ధ పెట్టలేదు. అదనంగా ఒక్క ఉపాధ్యాయుడిని నియమించలేదు. కనీసం విద్యావాలంటీర్లను ఇవ్వలేదు. దాంతో 2022-23 సంవత్సరంలో తిరిగి ఆ సంఖ్య 28లక్షల 85వేలకు(48.9%) తగ్గింది. అంటే అదనంగా వచ్చిన వాళ్ళందరూ ప్రైవేటు బడులకు తిరిగి వెళ్ళిపోయారు. 2023-24 సంవత్సరంలో ఆసంఖ్య 26లక్షల 40వేలకు(43.7%) పడిపోయింది. అదే సమయంలో ప్రైవేటు పాఠశాలల్లో చేరిన విద్యార్థుల సంఖ్య 2022-23లో 30 లక్షల 14 వేల(51.1%) నుండి 2023-24లో 34లక్షల 2వేలకు(56.3%) పెరిగింది. 2024-25 సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో చేరుతున్న విద్యార్థుల సంఖ్య మరింత పడిపోతున్నట్లుగా తెలుస్తుంది. రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో ఘనంగా చెప్పుకుంటున్న 1000కి పైగా రెసిడెన్షియల్ స్కూల్స్, 500 కేజీబీవీలు, 200 వరకు మోడల్ స్కూల్స్, 1000 వరకు ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ స్కూల్స్ లాంటి భోజనం, వసతి కల్పిస్తున్న పాఠశాలలలతో కలిపినా ఈపరిస్థితి ఉంది. ఇక ప్రభుత్వ పాఠశాలల్లో సగటున నలుగురు ఉపాధ్యాయులు మాత్రమే ఉండగా, ప్రైవేటు పాఠశాలల్లో ఆ సంఖ్య 15.5గా ఉంది. మొత్తం 19000 ప్రాథమిక పాఠశాలల్లో 75 మంది విద్యార్థులు ఉన్నవి 3000 మాత్రమే. 5000 వరకు ఏకోపాధ్యాయ పాఠశాలలు, మరో 8000 ఇద్దరు ఉపాధ్యాయులతో మాత్రమే నడుస్తున్నాయి.

**ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలు చేరకపోవడానికి కారణం ఏమిటి**
ప్రభుత్వ పాఠశాలలు నేటి పిల్లల తల్లిదండ్రుల అభిరుచులకు అనుగుణంగా లేవనిపిస్తుంది. తమ పిల్లలను నాలుగో యేట నుండే నర్సరీ విద్య కోసం బస్సు ఎక్కించి ఎంత దూరమైనా లెక్కచేయకుండా ప్రైవేటు బడులకు పంపిస్తున్నారు. ప్రభుత్వ బడుల్లో నర్సరీ తరగతులు లేకపోవడం ప్రధాన కారణం. మూడు సంవత్సరములు నిండిన పిల్లలను అంగన్వాడీ కేంద్రాల్లో చేర్పించే అవకాశం ఉన్నా అంగన్వాడీ కేంద్రాల్లో చదువు రాదు అనే బలమైన అభిప్రాయం తల్లిదండ్రులకు ఉంది. 4ం వారిని ఒక్కసారి ప్రైవేటు బడికి పంపినాక, ఇక ఊరిలోబడి ఉన్నా, దానిలో ఇంగ్లీష్ మీడియం బోధిస్తున్నా, మంచి విద్యావంతులైన, శిక్షణ పొందిన ఉపాధ్యాయులు ఉన్నా, బాగానేచదువు చెబుతున్నారు అని తెలిసినా కూడా తమ పిల్లలను ప్రైవేటు బడుల నుండి వెనుకకు తీసుకువచ్చి ప్రభుత్వ బడుల్లో చేర్పించడానికి సిద్ధపడడం లేదు.

**ఇందుకు కారణాలు:**
1. ఐదు సంవత్సరాల వయస్సు నిండే వరకు తల్లిదండ్రులు తమ పిల్లలను ఇంటివద్ద ఉంచుకోవడానికి సిద్ధంగా లేరు. అందుబాటులో ఉన్న అంగన్వాడీ కేంద్రంలో చేర్చడానికీ ఇష్టపడటం లేదు. 2. ఒకరిద్దరు ఉపాధ్యాయులతో ఎక్కువ పాఠశాలలు (13000) నడుస్తున్న పరిస్థితి తల్లిదండ్రులను ఆకర్షించడం లేదు. 3. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియం ప్రవేశపెట్టినా ఇంగ్లీష్ మీడియం ప్రభావవంతంగా బోధించడానికి ప్రత్యేకంగా ఉపాధ్యాయులు లేకపోవడం. 1నుండి 5తరగతులకు 18సబ్జెక్టులను ఇద్దరు టీచర్లు బోధిస్తే మా పిల్లలకి న్యాయం జరుగదు అని భావిస్తున్నారు. అదే సందర్భంలో ప్రైవేటు పాఠశాలల్లో తరగతికి ఒక గది, ప్రతి తరగతిగదిలో ఒక ఉపాధ్యాయుడు పిల్లల్ని ఎప్పుడూ అంటిపెట్టుకొని ఉండడం తల్లిదండ్రులు గమనిస్తున్నారు. ఎక్కువ ప్రైవేటు పాఠశాలలు నర్సరీ తరగతుల నుండి పదవ తరగతి వరకు ఒకే క్యాంపస్లో నిర్వహించబడటం, పాఠశాలలు ఆకర్షణీయంగా ఉండటం కూడా తల్లిదండ్రులకు నచ్చినట్లుగా ఉంది.

**సంస్కరణలు అవసరం**
వాస్తవ పరిస్థితిని దృష్టిలో ఉంచుకున్నప్పుడు పిల్లల తల్లిదండ్రుల ఆర్థిక స్థితి బాగుండి తమ పిల్లలను ప్రైవేట్ బడులకు పంపడం లేదు. వితంతు, వృద్ధాప్య పెన్షన్లు అందుకుంటున్న వారు, తెల్లరేషన్ కార్డులు ఉన్నవారు, అంత్యోదయ అన్న యోజన పథకం కింద లబ్ధిదారులు, వాటి కోసం ఎదురుచూస్తున్న వారు చాలా పెద్ద సంఖ్యలో ఉన్న విషయం గమనించినప్పుడు ఈవిషయం తేటతెలమవుతుంది. వారిలో దళితులు, గిరిజనులు, వెనకబడిన వర్గాల వారు ఎక్కువగా ఉన్నారు. వారికి ప్రభుత్వ పాఠశాలల అవసరం ఉన్నా కూడా వాటిలో చేర్పిస్తే తమ పిల్లలకు మంచి చదువు వస్తుందన్న నమ్మకం కలగక ప్రైవేటు బడులకు పంపిస్తున్నారు. తద్వారా వారు పేదరికంలోకి దిగజారుతూ, అప్పుల ఊబిలో కూరుకుపోతూ ఆత్మహత్యలు చేసుకోవడంలో కూడా ప్రైవేట్ చదువుల భారం ఒక కారణంగా కొన్ని సర్వేలు వెల్లడించాయి. ఈ పరిస్థితుల్లో పిల్లల తల్లిదండ్రుల అభిరుచుల కనుగుణంగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దాల్సిన అవసరం ఉంది.

**బడి అంటే ఎలా ఉండాలి?**
ఐక్యరాజ్యసమితి- యునెస్కో మార్గదర్శకాల ప్రకారం ఉన్నత పాఠశాలలో ఒక తరగతిలో కనీసంగా 24మంది, ప్రాథమిక పాఠశాలలో 18మంది అంటే మొత్తంగా ఉన్నత పాఠశాలల్లో 120 మంది, ప్రాథమిక పాఠశాలల్లో 90 మంది పిల్లలకు తగ్గకుండా ఉండాలి. లేదా మన రాష్ట్రంలో ప్రాథమిక స్థాయిలో 15మంది విద్యార్థులు, సెకండరీ స్థాయిలో 20మంది విద్యార్థులు తరగతికి కనీస సంఖ్యగా ఉండేట్లు పాఠశాలల పునర్వ్యవస్థీకరణ జరగాలి. అప్పుడు మాత్రమే పీర్ గ్రూప్ అభ్యసనానికి సానుకూల వాతావరణం ఉంటుంది. పిల్లల్లో పోటీ తత్వం పెరగటానికి కూడా దోహదపడుతుంది. ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడు, ప్రతి పాఠశాలకు ఒక ప్రధానోపాధ్యాయుడు ఉండటంతో పాటు అవసరమైన తరగతి గదులు,ఆఫీస్, లైబ్రరీ, లేబొరేటరీ, కంప్యూటర్ విద్య, టాయిలెట్స్, క్రీడలు, మంచినీరు, విద్యుత్ కనీస సౌకర్యాలు గా ఉండాలి. పేదల పిల్లల చదువులకోసం, ప్రభుత్వ బడుల బాగు కోసం పరితపించే రిటైర్డ్ ఐఏఎస్ ఆకునూరి మురళి యుటిఎఫ్ బృందంతో కలిసి చర్చించిన సందర్భంలో ప్రతి పాఠశాలలో 35అంశాలు ఉండాలని, వాటన్నిటినీ 13%-15% రాష్ట్రబడ్జెట్ తోనే సమకూర్చుకోవచ్చని అన్నారు. అదేవిధంగా పాఠశాల అంటే నర్సరీ నుండి పదవ తరగతి వరకు ఒకే క్యాంపస్లో నిర్వహించబడేలా చూడాలి. ఇప్పుడున్న 30 వేల పాఠశాలను ఆవిధంగా తయారు చేయాల్సిన అవసరం ఉండదు. మండలానికి బడి ఈడు పిల్లల సంఖ్యను అనుసరించి కనీసం ఐదు నుండి పది పాఠశాలలను ఆవిధంగా తీర్చిదిద్ది, పిల్లలకు రవాణా సౌకర్యం ఏర్పాటుచేస్తే ప్రభుత్వ పాఠశాలల పట్ల ప్రజలకు నమ్మకమేర్పడి పిల్లలతో కళకళలాడుతుంటాయి. "ఈసురోమని మనుషులుంటే దేశమే గతి బాగుపడనోయ్" అన్న గురజాడ మాటలను మన విద్యారంగానికి అన్వయించుకుంటే "ఈసురోమని ప్రభుత్వ బడులుంటే, పేదల చదువులేగతి ముందుపడునోయ్" అనే విధంగా పాడుకోవాల్సి ఉంటుంది.

**జాతీయ విద్యా విధానం-2020**
ప్రభుత్వ విద్యారంగానికి గొడ్డలి పెట్టు
జాతీయ విద్యా విధానం(%చీజూ%) 2020లో సానుకూలమైన అంశం ఏదైనా ఉంది అంటే అది "నర్సరీ తరగతులను ప్రారంభించాలని సిఫార్సు చేయడమే". కానీ ఆ నర్సరీ తరగతులతో ఒకటి రెండు తరగతులను కూడా కలిపి అంగన్వాడీ కేంద్రాల్లో చేర్చాలనే దుష్టతలంపు ప్రభుత్వ విద్యారంగానికి చరమగీతం పాడటానికే. అంతేకాదు పాఠశాలలను నాలుగు ముక్కలుగా విడగొట్టాలనే ప్రతిపాదన కూడా ఆ కుట్రలో భాగమే. కనుక నర్సరీ తరగతుల నుండి పదవ తరగతి వరకు ఒకే క్యాంపస్లో, ఆకర్షణీయమైన వాతావరణంలో, అన్ని రకాల హంగులతో ఏర్పాటు చేయడం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి. పేదల పిల్లలకు నాణ్యమైన చదువును అందించాలి. ఆ క్రమంలో %చీజూ%-2020 ని రాష్ట్ర ప్రభుత్వం తిరస్కరించాలి. కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల మేనిఫెస్టోలో వాగ్దానం చేసిన మేరకు విద్యారంగానికి 15% బడ్జెట్ ని కేటాయించడం ద్వారా ఇది సాధ్యమే. అందుకుగాను వామపక్ష అభ్యుదయ శక్తులు ప్రజా ఉద్యమాలు నిర్మించే కృషి చేయాలి.

# విపణి



## లాభాల్లో స్టాక్ మార్కెట్ సూచీలు.. నిఫ్టీ ఏ 24,388

ముంబయి:
దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు శుక్రవారం లాభాలతో ప్రారంభమయ్యాయి. అంతర్జాతీయంగా ప్రతికూల సంకేతాలు ఉన్నప్పటికీ..మన సూచీలు ఆరంభంలో లాభాల్లో కొనసాగుతుండడం విశేషం. ఉదయం 9:26 గంటల సమయంలో సెన్సెక్స్ 257 పాయింట్ల లాభంతో 80,155 వద్ద కొనసాగుతోంది. నిఫ్టీ 72 పాయింట్లు పెరిగి 24,388 వద్ద ట్రేడవుతోంది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ రూ.83.54 వద్ద ప్రారంభమైంది.
సెన్సెక్స్-30 సూచీలో టీసీఎస్, ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్, అల్ట్రాటెక్ సిమెంట్, టాటా స్టీల్, ఎం అండ్ ఎం, బజాజ్ ఫిన్‌సర్వ్, యాక్సిస్ బ్యాంక్, ఎస్‌బీఐ షేర్లు లాభాల్లో ఉన్నాయి. మారుతీ, ఏషియన్ పెయింట్స్, ఎన్‌టీపీసీ, ఐటీసీ, పవర్‌గ్రిడ్, సన్‌ఫార్మా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐటీసీ, కోటక్ మహీంద్రా బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్ షేర్లు నష్టాల్లో కొనసాగుతున్నాయి.అమెరికా మార్కెట్లు గురువారం నష్టాలతో ముగిశాయి. అక్కడినుంచి సంకేతాలు అందుకున్న ఆసియా మార్కెట్లు నేడు నష్టాల బాటలో పయనిస్తున్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్యారెల్ బ్రెంట్ చమురు ధర 85.61 డాలర్ల వద్ద కొనసాగుతోంది. విదేశీ సంస్థాగత మదుపర్లు గురువారం నికరంగా రూ.1,137 కోట్ల విలువ చేసే షేర్లను విక్రయించారు. దేశీయ సంస్థాగత మదుపర్లు రూ.1,676 కోట్ల వాటాలు కొనుగోలు చేశారు.



స్కామ్ అలర్ట్

# ఇండియా పోస్ట్ పేరుతో లింకులు..




సైబర్ నేరగాళ్లు మరో కొత్తతరహా మోసానికి తెర తీశారు. ఇండియా పోస్ట్ పేరుతో లింకులు పంపిస్తూ డబ్బు దోచేందుకు ఎత్తుగడలు వేస్తున్నారు.
ఎస్సెమ్మెస్ ద్వారా వస్తున్న ఈ మోసపూరిత లింకులపై ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో ఫ్యాక్ట్ చెక్ విభాగం అప్రమత్తం చేసింది. ఈతరహా మోసాలపై అప్రమత్తంగా ఉండాలని సూచిస్తూ తాజాగా ట్వీట్ చేసింది.'పోస్టల్ డిపార్ట్‌మెంట్ నుంచి మీకో పార్శిల్ వచ్చింది. డెలివరీ చేద్దామని రెండుసార్లు ప్రయత్నించినా చిరునామా సరిగా లేనందువల్ల సాధ్యం కాలేదు. 48 గంటల్లో అడ్రస్ అప్‌డేట్ చేసుకోండి. లేదంటే ప్యాకేజీ రిటర్న్ వెళ్లిపోతుంది" అంటూ కొందరికి సైబర్ నేరగాళ్లు సందేశాలు పంపిస్తున్నారు. చిరునామా అప్‌డేట్ కోసం ఓ లింక్‌ను కూడా అందులో ఇస్తున్నారు. అప్‌డేట్ చేసుకుంటే 24 గంటల్లోనే పార్శిల్ డెలివరీ చేస్తామన్నది ఆ సందేశంలోని సారాంశం.
ఈ మెసేజ్ చూసినవారికి అచ్చం పోస్టల్ డిపార్ట్‌మెంట్ పంపించినట్లుగా కనిపిస్తుంది. పైగా లింక్‌లో వచ్చే యూఆర్‌ఎల్ కూడా ఇండియా పోస్ట్‌ను పోలి ఉంటుంది. తమకు ఎవరో పార్శిల్ పంపి ఉంటారని ఈ తరహా లింకులు క్లిక్ చేస్తే సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడినట్లే! ఈ లింక్‌ను క్లిక్ చేసినప్పుడు ఇండియా పోస్ట్ తరహా వెబ్‌సైట్ ఓపెన్ అవుతుంది. అక్కడ ట్రాకింగ్ ఐడీ దగ్గర డెలివరీ ఫెయిల్యూర్ అనే సందేశం కనిపిస్తుంది. తర్వాత చిరునామా అప్‌డేట్ చేసుకోండనే సందేశం చూపించి ఈ క్రమంలోనే మోసపూరిత సాఫ్ట్‌వేర్‌ను మీ ఫోన్‌లోకి జొప్పించి మీ మొబైల్‌ను సైబర్ నేరగాళ్లు అధీనంలోకి తీసుకొనే అవకాశం ఉంటుంది.

**వాటి జోలికెళ్లొద్దు..**
సైబర్ నేరగాళ్లు పంపించే ఈతరహా లింకులను క్లిక్ చేయొద్దని పీఐబీ ఫ్యాక్ట్ చెక్ విభాగం ప్రజలకు సూచిస్తోంది. స్మిషింగ్‌గా పేర్కొనే ఈతరహా మోసాలు సాధారణంగా ఎస్సెమ్మెస్ రూపంలోనే వస్తుంటాయి. ఇండియా పోస్ట్ వంటి ప్రముఖ సంస్థలను పోలిన డొమైన్‌లను క్రియేట్ చేసి ఇటువంటి మోసాలకు సైబర్ నేరగాళ్లు పాల్పడుతుంటారు. కాబట్టి ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా వ్యక్తిగత సమాచారం కోరుతూ అడిగే లింకులను ఎట్టి పరిస్థితుల్లోనూ క్లిక్ చేయకూడదు. నిజంగానే ఏదైనా పార్శిల్ వచ్చిందా అనేది అధికారిక వెబ్‌సైట్‌కి వెళ్లి తనిఖీ చేసుకోవాలి. ఒకవేళ పొరపాటున లింక్ క్లిక్ చేసి సైబర్ నేరానికి గురైతే వెంటనే 1930 కాల్ చేసి ఫిర్యాదు ఇవ్వండి.

**గుడ్ల ధరలు**

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.03 | ₹ 5.32 |

**బంగారం ధరలు (10 గ్రాములు)**
హైదరాబాద్

| 22 క్యారెట్లు | 24 క్యారెట్లు |
|---|---|
| ₹67,300 | ₹73,700 |

చెన్నై

| 22 క్యారెట్లు | 24 క్యారెట్లు |
|---|---|
| ₹67,850 | ₹71,240 |

**వెండి ధరలు (కేజీ)**
హైదరాబాద్
₹ 95,500

## టీవీఎస్ నుంచి తొలి సీఎన్‌జీ స్కూటర్!

### సెప్టెంబరు/అక్టోబరులో ఉత్పత్తి ప్రారంభం



దిల్లీ: టీవీఎస్ మోటార్ నుంచి తొలి సీఎన్‌జీ స్కూటర్ రాబోతోంది. టీవీఎస్ జూపిటర్ 125ను సీఎన్‌జీ ఇంధనంతో నడిచేలా తీర్చిదిద్దనుంది.ఈ ఏడాది సెప్టెంబరు/అక్టోబరులో ఈ స్కూటర్ల ఉత్పత్తి ప్రారంభించి, పండగ సీజన్‌లోనే విపణిలోకి విడుదల చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇటీవల బజాజ్ ఫ్రీడమ్ 125 సీఎన్‌జీ బైక్‌ను రూ.95,000-1,10,000 శ్రేణిలో విపణిలోకి ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. తొలుత నెలకు 1,000 సీఎన్‌జీ స్కూటర్లను విక్రయించాలని టీవీఎస్ లక్ష్యంగా నిర్దేశించుకుందని సమాచారం. ప్రస్తుతం టీవీఎస్ జూపిటర్ 125 స్కూటర్..124.8 సీసీ, సింగిల్ సిలిండర్ 4-స్ట్రోక్, ఎయిర్‌కూల్డ్, సీవీటీ ఆటోమేటిక్ ఇంజిన్‌తో వస్తోంది. ఇందులో 3 వేరియంట్లు ఉన్నాయి. వీటి ధరలు రూ.79,299 -84,001, 90,480గా ఉన్నాయి. కొత్త సీఎన్‌జీ స్కూటర్ ధర, ఇతర వివరాలు త్వరలో వెల్లడయ్యే అవకాశం ఉంది.

## రూ.25,000 కోట్ల మోసం కేసులో ఆమ్‌టెక్ గ్రూప్ ప్రమోటరు అరెస్టు



దిల్లీ: రూ.25,000 కోట్ల బ్యాంకు రుణం మోసం కేసులో.. మనీ లాండరింగ్ దర్యాప్తులో భాగంగా ఆమ్‌టెక్ గ్రూప్ ప్రమోటరు అరవింద్ ధామ్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) గురువారం అరెస్టు చేసింది.ఈనెల 9న అరవింద్‌ను కస్టడీలోకి తీసుకున్నట్లు ఈడీ గురువారం తెలిపింది. దిల్లీలోని పీఎమ్‌ఎల్‌ఏ ప్రత్యేక కోర్టులో నిందితుణ్ని హాజరుపరచగా.. ఏడు రోజుల కస్టడీకి కోర్టు అనుమతించింది. ఐడీబీఐ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర నుంచి రాతపూర్వక ఫిర్యాదుల అనంతరం ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. గత నెలలో ధామ్, ఇంకో డైరెక్టర్ గౌతమ్ మల్హోత్రా నివాసాల్లో సోదాలు చేసింది. మోసం, విశ్వాస ఘాతుకానికి పాల్పడి, బ్యాంకు రుణాలను మళ్లించడంతో బ్యాంకులకు రూ.673.35 కోట్ల మేర నష్టం వచ్చినట్లు ఈడీ ఆరోపించింది. 15 బ్యాంకులకు రూ.25,000 కోట్లకు పైగా రుణాలను ఆమ్‌టెక్ గ్రూప్ ఎగవేసిందని ఈడీ తెలిపింది.

## వృద్ధి వేగానికి ఊతమివ్వండి

### ప్రధానితో ప్రముఖ ఆర్థికవేత్తలు

దిల్లీ: ఆర్థిక వృద్ధి వేగవంతం అయ్యేలా.. మౌలిక వసతులు మెరుగుపరిచేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రధాని నరేంద్ర మోదీకి ప్రముఖ ఆర్థికవేత్తలు విజ్ఞప్తి చేశారు.నీతి ఆయోగ్ ఆధ్వర్యంలో గురువారమిక్కడ జరిగిన సమావేశంలో ఆర్థికవేత్తలు మోదీ 3.0 ప్రభుత్వ తొలి బడ్జెట్‌కు పలు సూచనలు చేశారు. 'ఈ రోజు ఆర్థికవేత్తలతో చర్చలు జరిగాయి. వృద్ధిని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు వారి అభిప్రాయాలను తీసుకున్నాన'ని ప్రధాని మోదీ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. ఈనెల 23న కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్న సంగతి తెలిసిందే. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ముఖ్య ఆర్థిక సలహాదారు వి. అనంత నాగేశ్వరన్, ఆర్థికవేత్తలు సుర్జీత్ భల్లా, అశోక్ గులాటి, దిగ్గజ బ్యాంకరు కేవీ కామత్‌తో పాటు నీతి ఆయోగ్ వైస్ ఛైర్మన్ సుమన్ బెరీ, ఇతర సభ్యులు ప్రధానితో సమావేశంలో పాల్గొన్న వారిలో ఉన్నారు. సామాన్యులకు పన్ను ఊరటనివ్వాలని చాలా మంది నిపుణులు కోరారు. తద్వారా వినియోగానికి ఊతమిచ్చినట్లు అవుతుందన్నారు. ద్రవ్యోల్బణాన్ని అదుపులో ఉంచేందుకు, ఆర్థిక వృద్ధిని వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. వ్యవసాయ ఉత్పాదకత పెంపునకూ సూచనలు చేసినట్లు సమాచారం. 2047 కల్లా భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చేందుకు కార్యాచరణ ప్రణాళికను రానున్న బడ్జెట్‌లో మోదీ ప్రభుత్వం ప్రకటించే అవకాశం ఉంది.

## భూములిస్తే అనంతలో ఎయిర్‌పోర్టు

### సమిక్షలో వెల్లడించిన మంత్రి రామ్మోహన్ నాయుడు



**అమరావతి, జూలై 12 (జనంసాక్షి):** అనంతపురంలో అనువైన భూమి చూపితే విమానాశ్రయం ఏర్పాటుపై అధ్యయనం మొదలుపెడతామని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు పేర్కొన్నారు. ఉద్యాన ఉత్పత్తుల ఎగుమతుల కోసం ఇక్కడ ఎయిర్‌పోర్టు ఏర్పాటుచేయాలని రాష్ట్ర ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్, స్థానిక ఎంపీలు అంబికా లక్ష్మీనారాయణ, బీకే పార్థసారథి ఇటీవల చేసిన విజ్ఞప్తిపై ఆయన స్పందించారు. విమానాశ్రయానికి కావాల్సిన భూమి చూపితే తదుపరి కార్యాచరణ చేపడతామన్నారు.ఇందుకు 1,200 ఎకరాలు అవసరమవుతాయని పేర్కొన్నారు. గన్నవరం విమానాశ్రయం అభివృద్ధి కమిటీ సమావేశంలో ఎయిర్ పోర్ట్ అభివృద్ధి కమిటీ వైస్ చైర్మన్, విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గన్నవరం ఎయిర్ పోర్ట్ అంత ర్జాతీయ టెర్మినల్ పనులు గత ప్రభుత్వం హయాంలో అటకెక్కాయి.. గత ప్రభుత్వం ఐదు సంవత్సరాలు అధికారంలో ఉండి విమానా శ్రయాన్ని అభివృద్ధి చేయకపోవడం దారుణమని విమర్శించారు. రాష్ట్రంలో ఎన్డీయే ప్రభుత్వం ఆధ్వర్యంలో ఎయిర్ పోర్ట్ టెర్మినల్ అభివఅద్ధి పనులను సంవత్సరంలోపు పూర్తి చేసి ప్రజలకు అంకితం చేస్తామని ఎంపీ కేశినేని చిన్ని వెల్లడించారు. ఇక, కేంద్ర పౌర విమానయాన మంత్రి రామ్మోహన్ నాయుడుతో మాట్లాడుతూ.. గన్నవరం ఎయిర్ పోర్టు అభివృద్ధికి కృషి చేసి రాష్ట్రంలో నెంబర్ వన్ స్థాయిలో నిలుపుతామన్నారు. విమానాశ్రయం అభివృద్ధికి అను విధాలుగా కృషి చేస్తాను అని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వంలో పనులను ఎయిర్ పోర్టుల్లో సందర్శించి సమీక్షించారు.. పనుల్లో జాప్యం ఉంటే కాంట్రాక్టర్లను మార్చాలి.. అంతేగాని గత వైసీపీ ప్రభుత్వం ఐదు సంవత్సరాలు ఎయిర్ పోర్ట్ పనులు నిలిపి వేసి చోద్యం చూశారని కేంద్రమంత్రి మండిపడ్డారు. మా ఎన్డీయే ప్రభుత్వం లో కేవలం 9 నెలలోనే ఎయిర్ పోర్ట్ ను అంతర్జాతీయ టెర్మినల్స్ ను పూర్తి చేసి ప్రజలకు అంకితం చేస్తామన్నారు. ఎయిర్ పోర్టులో అంతర్జాతీయ టెర్మినల్ పనులు సమీక్షించి అధికారులకు దిశా నిర్దేశర చేశారు.

## రఘురామపై కస్టోడియల్ టార్చర్



- హత్యాయత్నం చేసినట్లు పేర్కొన్న ఎమ్మెల్యే
- ఆనాడు ఎంపిగా ఉన్నప్పుడు వేధింపులు
- సీఐడీ డీజీ సునీల్‌కుమార్, జగన్‌లపై ఫిర్యాదు
- రఘురామ ఫిర్యాదుపై గుంటూరులో కేసు నమోదు

**గుంటూరు, జూలై 12 (జనంసాక్షి):**
మాజీ సీఎం జగన్, ఐపీఎస్ అధికారి పీవీ సునీల్ కుమార్ సహ పలువురిపై కేసు నమోదైంది. తెదేపా ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు ఫిర్యాదు మేరకు గుంటూరులోని నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. వైకాపా ప్రభుత్వ హయాంలో రాజద్రోహం చట్టం కింద తనను అరెస్టు చేసి వేధించారని రఘురామ పేర్కొన్నారు. మాజీ సీఎం జగన్‌తో పాటు అప్పటి సీఐడీ డీజీ పీవీ సునీల్‌కుమార్, మరికొందరు అధికారులపై ఫిర్యాదు చేశారు. కస్టడీకి తీసుకున్న సమయంలో తనపై దాడి చేశారని ఆరోపించారు. దాంతోపాటు హత్యాయత్నం చేశారని ఫిర్యాదులో తెలిపారు. తప్పుడు నివేదికలు ఇచ్చారన్నారు. ఈ నేపథ్యంలో సునీల్‌కుమార్ (ఏ1), ఇంటెలిజెన్స్ మాజీ డీజీ పీఎస్ఆర్ ఆంజనేయులు (ఏ2), జగన్ (ఏ3),అప్పటి సీఐడీ ఏఎస్పీ విజయ్‌పాల్ (ఏ4), గుంటూరు జీజీహెచ్ మాజీ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతి (ఏ5)పై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. హత్యాయత్నం, తప్పుడు నివేదికలు, భయభ్రాంతులకు గురిచేయడం తదితర అంశాలకు సంబంధించిన పలు సెక్షన్లు పెట్టారు. వీటిలో బెయిల్‌బుల్, నాన్‌బెయిల్‌బుల్ సెక్షన్లు కూడా ఉన్నాయి. వైసీపీ ప్రభుత్వంలో సునీల్ సీఐడీ డీజీగా పని చేశారు. అప్పుడు ఎంపీగా ఉన్న రఘురామ కృష్ణంరాజును కస్టడీకి తీసుకున్న సమయంలో కొట్టడమే కాకుండా హత్యాయత్నం చేశారని, చిత్ర హింసలు పెట్టారని ఫిర్యాదు చేశారు. దీంతో మాజీ సీఐడీ సునీల్‌తోపాటు పలువురు అధికారులపై పోలీసులు పలు సెక్షన్లకింద కేసు నమోదు చేశారు. జగన్ ప్రభుత్వ హాయంలో తనపై జరిగిన కస్టోడియల్ టార్చర్‌పై గుంటూరు ఎస్పీకి రఘురామకృష్ణంరాజు ఫిర్యాదు చేశారు. తనపై పోలీస్ కస్టడీలో జరిగిన హత్యాయత్నానికి బాధ్యులుగా సీఐడీ మాజీ చీఫ్ సునీల్ కుమార్, ఇంటిలిజెన్స్ చీఫ్ సీతారామంజనేయులు, మాజీ సీఎం వైఎస్ జగ్మోహన్ రెడ్డి, అప్పటి సీఐడీ, అడిషనల్ ఎస్పీ విజయ్ పాల్‌లపై కేసు నమోదైంది. తనకు అయిన గాయాలపై కోర్టుకు గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతి తప్పుడు నివేదిక ఇచ్చారని ఫిర్యాదు చేశారు. జగన్ రెడ్డిని విమర్శిస్తే తనను చంపేస్తానని సునీల్ కుమార్ తనను బెదిరించారని కూడా రఘురామ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆయన ఫిర్యాదు మేరకు గుంటూ జిల్లా పోలీసులు కేసు నమోదు చేశారు.

## మాజీ ఎమ్మెల్యే సివేరి సోమ కుటుంబాన్ని ఆదుకుంటా

### సిఎం చంద్రబాబు నాయుడు హామీ



**అమరావతి, జూలై 12 (జనంసాక్షి):**
నక్సల్స్ చేతిలో హతమైన అరకు మాజీ ఎమ్మెల్యే సివేరి సోమ కుటుంబ సభ్యులు సీఎం చంద్రబాబును కలిశారు. ఈ సందర్భంగా సోమ భార్య ఇచ్చావతి యోగక్షేమాలను సీఎం అడిగి తెలుసుకున్నారు. సోమ కుమారుడి చదువు బాధ్యతను తాను తీసుకుంటానని చంద్రబాబు హామీ ఇచ్చారు. అంతకుముందు సీఎం సచివాలయానికి వెళ్తూ ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. సమస్యలతో వచ్చిన వారిని చూసి రోడ్డుపైనే కాన్వాయ్ ఆపారు. యోగక్షేమాలను అడిగి తెలుసుకుని వినతులను స్వీకరించారు. వైకాపా గూండాల దాడిలో సర్వస్వం కోల్పోయానని.. ఆదుకోవాలని సీఎంను అరకు సర్పంచ్ శ్రీనివాస్ కోరారు. సమస్యను పరిష్కరిస్తానని చంద్రబాబు హామీ ఇచ్చారు.

## కాన్వాయ్ ఆపి వినతుల స్వీకరణ

### పార్టీ కార్యాలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తా

### సిఎం చంద్రబాబు నాయుడు వెల్లడి



**అమరావతి, జూలై 12 (జనంసాక్షి):** ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక చంద్రబాబు నాయుడు ఏపీ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వీలైనంత త్వరగా నెరవేర్చేలా ప్రణాళికలను రూపొందిస్తున్నారు. ఏపీని అన్ని విధాలుగా ముందుకు తీసుకెళ్లేందుకు చంద్రబాబు నిత్యం శ్రమిస్తున్నారు. అధికారులతో సమీక్షలు, సమావేశాలు నిర్వహిస్తూ సీఎం బిజీబిజీగా గడుపుతున్నారు. అలాగే ఎక్కడికక్కడ ప్రజల సమస్యలను తెలుసుకుంటూ వాటిని త్వరిగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలో శుక్రవారం ఉండవల్లి నివాసం నుంచి సెక్రటేరియట్‌కు వెళ్తుండగా అక్కడ ఉన్న ప్రజలను చూసి ముఖ్యమంత్రి చంద్రబాబు కాన్వాయ్ ఆపారు. నివాసం నుంచి కాన్వాయ్ బయటకు వచ్చిన వెంటనే రోడ్డుపై వినతి పత్రాలతో జనం నిలబడి ఉన్నారు. వారిని కార్‌లో నుంచి చూసిన చంద్రబాబు ముందుకు వెళ్తూ కాన్వాయ్‌లో తన కార్ ఆపివేయించారు. అనంతరం కారు దిగి... అందరి వద్దకు వెళ్లి వినతి పత్రాలు తీసుకుని సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సమస్యలను పరిష్కరిస్తానని ప్రజలకు చంద్రబాబు హామీ ఇచ్చారు. అలాగే పార్టీ ఆఫీస్‌లో వినతి పత్రాలు తీసుకునేందుకు కొత్త వ్యవస్థను ఏర్పాటు చేశామని అక్కడకు వెళ్లి కూడా ఇవ్వొచ్చని ఈ సందర్భంగా ప్రజలకు చంద్రబాబు చెప్పారు. తమను చూసి సీఎం చంద్రబాబు కారు దిగి వినతి పత్రాలు తీసుకోవడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జనంసాక్షి

# జాతీయం అంతర్జాతీయం

## అంబానీ ఇంట పెళ్లి..

### ఏడు నెలల వేడుక, రూ.వందల కోట్లు ఖర్చు!

ప్రపంచ కుబేరుడు ముకేశ్ అంబానీ ఇంట పెళ్లి వేడుకను యావత్ ప్రపంచం ఆసక్తిగా గమనిస్తోంది. దేశవిదేశాలకు చెందిన వ్యాపార, రాజకీయ, సినీ తదితర రంగాల ప్రముఖులతో ముంబయి వీధులు నిండిపోయాయి.ఏడు నెలల ముందునుంచే మొదలైన ఈ వేడుకలో భాగంగా అనంత్-రాధికా మర్చంట్‌లు జులై 12న ఏడడుగులతో ఒక్కటి కానున్నారు. అతిథులకు ఆహ్వానాలు, విందు, వినోద కార్యక్రమాలు, రూ.వందల కోట్ల ఖర్చుతో ప్రీ వెడ్డింగ్ కార్యక్రమాలు.. ఇలా ఎంగేజ్‌మెంట్ మొదలు వివాహ వైభోగం కనులపండువగా సాగిన తీరును పరిశీలిస్తే..ముకేశ్-నీతా అంబానీల రెండో కుమా రుడు అనంత్‌కు, విరెన్-శైలా మర్చంట్ దంపతుల కుమర్తె రాధికల మధ్య స్నేహం.. ప్రేమగా మారింది. పెద్దల అంగీకారంతో పెళ్లికి గ్రీన్ సిగ్నల్ పడింది. డిసెంబర్ 29, 2023న అనంత్-రాధికల నిశ్చి తార్థం జరిగింది. రాజస్థాన్‌లోని ఓ ఆలయంలో ఇరు కుటుంబాలు, సన్నిహితుల మధ్య ఈ కార్యక్రమం నిర్వహించారు. జనవరి 18, 2024న 'మెహందీ' నిర్వహించారు. మరుసటిరోజు ఏర్పాటుచేసిన ఎంగేజ్‌మెంట్ పార్టీ బాలీవుడ్ తారలతో మెరిసిపోయింది. షారుఖ్, సల్మాన్, ఆమీర్‌ఖాన్‌లతో పాటు ఐశ్వర్యరాయ్ బచ్చన్, దీపికా పదుకొనె వంటి పలువురు అగ్ర తారలు తమ స్టెప్పులతో అలరించారు. ప్రీ వెడ్డింగ్ పేరుతో అంబానీ కుటుంబం అనేక కార్యక్రమాలు నిర్వహించింది. గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో మార్చిలో నిర్వహించిన వేడుకలో 1200 ప్రముఖులు పాల్గొన్నారు. 100 మంది షెఫ్‌లతో 500 రకాల వంటలు, బాలీవుడ్ పాటలకు నృత్యాలు, బాణాసంచాతో జిగేల్‌మనిపించాయి. ప్రపంచ టెక్ దిగ్గజాలైన బిల్‌గేట్స్, మార్క్ జూకర్‌బర్గ్, ఇవాంక ట్రంప్ దంప తులు, కెనడా, స్వీడన్, ఖతర్ మాజీ ప్రధానులు, భూటాన్ రాణి తదితర ప్రముఖులతో పాటు రిహానా ప్రదర్శనతో కార్యక్రమం ఘనం గా సాగింది. దీనికంటే ముందు జామ్‌నగర్ సమీపంలో దాదాపు 50 వేల మంది స్థానికులకు భారీ విందు ఇచ్చారు. ప్రీ వెడ్డింగ్‌లో భాగంగా ఇటలీలో ఓ లగ్జరీ క్రూజ్‌లో నాలుగురోజుల పాటు వేడుక నిర్వహిం చారు. మే నెలలో జరిగిన ఈవెంట్‌లో ప్రముఖ అమెరికన్ గాయని కేటీ పెర్రీ, ఇటలీకి చెందిన అంధ గాయకుడు ఆండ్రియా బోసెలీ వంటి ప్రముఖులు ప్రదర్శనలు ఇచ్చారు. పెళ్లి వేడుకల్లో భాగంగా సామూహిక వివాహ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముంబయి సమీపంలోని పాల్‌గఢ్‌లో పేద కుటుంబాలకు చెందిన 50 జంటలకు వివాహం జరిపించారు. వారికి భారీ కానుకలు అందజేశారు.జులై 5న ఏర్పాటుచేసిన 'సంగీత్'లో జస్టిన్ బీబర్ ప్రదర్శన ఆకట్టుకొంది. జులై 8న కుటుంబసభ్యులు, సమీప బంధువుల నడుమ 'హల్దీ' వేడుక చేశారు. జులై 12న జరిగిన అనంత్-రాధికల వివాహానికి జియో వరల్డ్ కన్వెన్షన్ సెంటర్ వేదికైంది. దాదాపు 16వేల మంది సామర్థ్యం కలిగిన ఈ కేంద్రాన్ని అలంకరించిన తీరు ప్రతిఒక్కరినీ ఆకట్టుకుంటోంది. జామ్‌నగర్ నుంచి జెనోవా (ఇటలీ) వరకు 134 రోజుల పాటు కొనసాగిన ప్రీ వెడ్డింగ్ వేడుకల కోసం అంబానీ కుటుంబం ఎంత ఖర్చు పెట్టిందనే విషయంపై సోషల్ మీడియాలో చర్చ మొదలయ్యింది. సుమారు రూ.1200 కోట్లు వరకు ఖర్చు పెట్టి ఉండవచ్చని బ్రిటన్ వార్తా సంస్థ డైలీ మెయిల్ కథనంలో అంచనా వేసింది.కేవలం వంటల కోసమే రూ.210 కోట్ల ఖర్చు చేసినట్లు పలు కథనాలు వెల్లడించాయి.

## బీఆర్ఎస్ నేతలకు నోట.. ఫిరాయింపుల మాటా!

**ఆ హక్కు వారికి లేదు: మంత్రి శ్రీధర్ బాబు**

మంథని, (జనంసాక్షి) : ఫిరాయింపులపై మాట్లాడే నైతిక హక్కు బీఆర్ఎస్ పార్టీ నేతలకు లేదని రాష్ట్రానికి పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు అన్నారు. పార్టీ ఫిరాయింపుల వ్యవహారంలో కాంగ్రెస్ పార్టీకి, బీఆర్ఎస్‌కు చాలా తేడా ఉందన్నారు. గతంలో మా పార్టీ ఎమ్మెల్యేలను భయపెట్టి బీఆర్ఎస్ చేర్చుకుంటే.. ఇప్పుడు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు మా పాలన నచ్చి కాంగ్రెస్ పార్టీకి లోకి వస్తున్నారని మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు.

### అలేఖ్యకు మంత్రి శుభాకాంక్షలు

**అభినందనలు తెలిపిన ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్**



**మంథని(జనంసాక్షి):** హైదరాబాద్ లోని రవీంద్ర భారతిలో గల కళా భవన్ లో జరిగిన కేంద్ర సంగీత నాటక అకాడమీ పురస్కార గ్రహీత, కూచిపూడి నృత్య గురువు అలేఖ్య తెలంగాణ రాష్ట్ర సంగీత, నాటక అకాడమీ చైర్మన్‌గా శుక్రవారం పదవీ భాధ్యతలు స్వీకరించిన సందర్భంగా వారికి మంత్రి శ్రీధర్ బాబు అభినందనలు తెలిపి, శాలువతో సత్కరించారు.

**ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ శుభాకాంక్షలు**

హైదరాబాద్ లోని రవీంద్ర భారతి లో తెలంగాణ సంగీత నాటక అకాడమీ కార్యాలయంలో కేంద్ర సంగీత నాటక అకాడమీ పురస్కార గ్రహీత సూచిపూడి నృత్య గురువు అలేఖ్య గుంజల కి తెలంగాణ రాష్ట్ర సంగీత నాటక అకాడమీ అధ్యక్షురాలిగా పదవి స్వీకరణ చేస్తున్న సందర్భంగా ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మర్యాదపూర్వకంగా కలిసి వారికి సన్మానించి అనంతరం పుష్పగుచ్ఛమిచ్చి శుభాకాంక్షలు తెలియజేశారు .పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### బదిలీ ఉపాధ్యాయుడికి సన్మానం



**బోధన్(జనంసాక్షి):** సాలూర మండలం హున్సా గ్రామంలో శుక్రవారం హుంసా సహకార సంఘము ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ పాఠశాలలో బదిలీపై వెళ్లిన ప్రధానోపాధ్యాయులు నగేష్, ఆతిఫ్, శంకర్, వనితలకు ఘనంగా సన్మానించారు. అలాగే పదవ తరగతిలో టాపర్ గా నిలిచిన కన్నా నాగేశ్వరి (9.8)కి సంఘం తరపున రూ.5 వేలు అందించి సన్మానించారు. సంఘ అధ్యక్షులు రవి, ఉపాధ్యక్షులు వినోద్ రావు డైరెక్టర్లు భూమన్న, శివకుమార్, మాధవరావు , సీఈఓహన్మంత్ రావు పాల్గొన్నారు.

## ఉపకార వేతనాలు తక్షణమే చెల్లించాలి

**ఎస్ఎఫ్ఐ నాయకుల నిరసన**



సిరిసిల్ల టౌన్ (జనంసాక్షి):ఉపకార వేతనాలు, ఫీజు రియంబర్స్మెంట్ తక్షణమే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మంద అనిల్, మల్లారపు ప్రశాంత్ లు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఉపకార వేతనాలు విడుదల చేయాలని కోరుతూ సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్ ఎదుట ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు జాలపల్లి మనోజ్, కుర్ర రాకేష్, సహాయ కార్యదర్శి గుండెల్లి కళ్యాణ్, నాయకులు అభిషేక్, సాత్విక్, శ్రీకాంత్, అనిల్, నందు, తదితరులు పాల్గొన్నారు.

### గంద్రపల్లి గ్రామ పంచాయితీ ఆకస్మిక తనిఖీ

జమ్మికుంట(జనం సాక్షి):పంచాయితీ రాజ్ అభివృద్ధి సూచికలో భాగంగా శుక్రవారం రోజున జమ్మికుంట మండలంలోని గంద్రపల్లి గ్రామ పంచాయితీలో చేసిన పలు అభివృద్ధి పనులను, కల్పించిన సౌకర్యాలను, పంచాయితి రికార్డులను పంచాయితి రాజ్ డిప్యూటీ కమిషనర్ జాన్ వేస్లి పరిశీలించి సంతృప్తి చెంది తగు సూచనలు ఇచ్చినారు. ఇట్టి కార్యక్రమములో హుజురాబాద్, కరీంనగర్ డీ ఎల్పివోలు శ్రీనివాస్ , రాంబాబు, ఎంపిడిఓ కే. భీమేష్, ఎంపీఓ సతీష్ కుమార్,ఏపీ ఓ లక్ష్మణ్, పంచాయితి కార్యదర్శి ఝాన్సీరాణి పాల్గొన్నారు.



# వదలని ప్లాస్టిక్ భూతం

- యథేచ్చగా వినియోగం
- నామమాత్రంగా అధికారుల తనిఖీలు
- విచ్చలవిడిగా ప్లాస్టిక్ దుకాణాలు
- ఎలాంటి భయం లేకుండా వ్యాపారుల విక్రయాలు



**హుజూరాబాద్(జనంసాక్షి):** పర్యావరణ కాలుష్యంతో పాటు ప్రాణాంతక వ్యాధులకు కారణమవుతున్న ప్లాస్టిక్ వినియోగం ఏ మాత్రం తగ్గడం లేదు. ప్లాస్టిక్ వినియోగం తగ్గించి ప్రత్యామ్నాయ పద్ధతుల ద్వారా అవసరాలను తీర్చుకోవాలని, ప్రాణాంతకంగా మారుతున్న ప్లాస్టిక్ భూతంతో రాబోయే రోజుల్లో పర్యావరణం మరింత దెబ్బతింటుందని పర్యావరణ శాస్త్ర వేత్తలు, మేధావులు చేస్తున్న హెచ్చరికలను ప్రజలు పట్టించుకోవడం లేదు. మొన్నటి వరకు 40 మైక్రాన్లలోపు ప్లాస్టిక్ నిషేధించిన ప్రభుత్వం ప్రస్తుతం 120 మైక్రాన్లకంటే ఎక్కువ మందం ఉన్న ప్లాస్టిక్ సంచులు, ఇతరత్రా వస్తువులను మాత్రమే వినియో గించాలని ఉత్తర్వులు జారీ చేసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్లాస్టిక్కు వంద శాతం నిషేదించాలని ఆదేశించడంతో కొన్ని రోజు లు ప్లాస్టిక్ వినియోగం తగ్గించగా తర్వాత పరిస్థితి ఎప్పటిలాగే మారింది. ప్లాస్టిక్ ఉపయోగంతో మానవాళి మనవడే కష్టంగా మారుతోంది. అరికట్టాల్సిన అధికా రులు చూసి చూడనట్టుగా వదిలేస్తున్నారు. అధికా రులు నామమాత్రంగా అడపాదడప ప్లాస్టిక్ నివారణకు చర్యలు తీసుకుంటూ వదిలేస్తున్నారు. దీంతో ప్లాస్టిక్ కవర్లను విక్రయించే హోల్ సెల్, రిటైల్ వ్యాపారులు ఎలాంటి భయం లేకుండా వారి వ్యాపార కలాపాలను కొనసాగిస్తున్నారు. పర్యావరణ పరిరక్షణతోనే మానవ మనుగడ కొనసాగుతుందని, పర్యావరణం పట్ల అవగాహన కలిగి ఉండటంతో పాటు పర్యా వరణ సమతుల్యతను కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉంటుందని పర్యావరణ శాస్త్ర వేత్తలు, మేధావులు చెప్తున్నారు. ప్లాస్టిక్ కోరల్లో ప్రపంచం...ప్లాస్టిక్ సంచులు వద్దు..బట్ట సంచులు ఉపయోగిస్తూ రోజురోజుకు దెబ్బతింటున్న పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. పాలిథిన్, ప్లాస్టిక్ వాడకానికి దూరంగా ఉండి, ఆరోగ్యవంతమైన వాతావరణ నిర్మాణానికి సహకరించాలని, పర్యావరణ పరిరక్షణపై నిరంతరం అధికారులు, ప్రజాప్రతినిధులు అవగాహన కల్పిస్తూ ప్రజల్లో చైతన్యం నింపాలని, పర్యావరణ ప్రమాదం ప్లాస్టిక్ సంచులు ఉపయోగించడం వలన జరిగే సమస్య, వ్యర్థ పదార్థాల యాజమాన్య పద్దతులలోని లోపాలు ప్రాథమికంగా కారణం. కాలువలు మూసుకు పోవడం, భూగర్భ జలాలు మొదలగు వాటితో పాటు విచ్చక్షణారహితంగా ఉపయోగించే రసాయనాల వల్ల పర్యావరణ సమస్యలు కలుగుతున్నాయన్నారు. వీటిని అరికట్టనట్లయితే భవిష్యత్ తరాలపై దెబ్బ తీసే ప్రమాదముంటుందని తెలుపుతున్నారు.



### అవగాహన కల్పించాలి

**- నలుబాల వేణుగోపాల్, సామాజిక కార్యకర్త**



ప్లాస్టిక్ వినియోగంతో మనుషులకే కాకుండా జంతువులకు, పర్యావరణానికి తీవ్ర ముప్పు వాటిల్లుతున్నందున ప్రజ లపై ప్లాస్టిక్ అనర్థాలపై అవగాహన కల్పించాలి. మున్సిపల్ అధికారులు నిషే ధిత ప్లాస్టిక్‌పై మరింత కఠినంగా వ్యవహరించాలని, నిరంతరం దాడులు నిర్వహించి చటప్రరంగా కఠినమైన చర్యలు తీసుకోవాలి. ప్రజలు రేపటి తరం భవి ష్యత్తును ఆలోచించి ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలి.

## ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

**హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి**

**వీణవంక జులై 12 (జనంసాక్షి)**



చల్లూరు గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మక చేపట్టిన వన మహోత్సవం కార్యక్రమం చేపట్టగా ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అధికారులుతో కలిసి చల్లూరు గ్రామంలో వన మహోత్సవ మొక్కలను నాటారు. కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ..వన మహోత్సవ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం కొనసాగించడం చాలా సంతోషమని అన్నారు.వన మహోత్సవ చెట్లను పెంచడం ద్వారా పల్లెల్లో పచ్చదనంతో ఎంతో ఉల్లాసంగా ఉంటుందని చెట్లు నాటడంతో మనిషి జీవనానికి ఎంతో ఉపయోగపడతాయి.ప్రతి ఒక్కరు చెట్లు నాటాలన్నారు. .ప్రతి ఒక్కరిని అభినందించారు.వన మహోత్సవంలో నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని వారికి సూచించారు.జమ్మికుంట మార్కెట్ మాజీ చైర్మన్. రాష్ట్ర నాయకుడు వాల బాల కిషన్ రావు. మూసిపట్ల తిరుపతిరెడ్డి. పిఎసిఎస్ చైర్మన్ మావురపు విజయ్ భాస్కర్ రెడ్డి. మాజీ సర్పంచ్ పొదిల జ్యోతి రమేష్.మాజీ ఎంపీటీసీ సవిత మల్లయ్య.తోపాటు ప్రజా ప్రతినిధులు. ఎంపీడీవో శ్రీధర్.ఎంపీఓ ప్రభాకర్ అధికారులు తదితరు పాల్గొన్నారు .

### ఎల్ఓసి అందజేత

**మంజూరు చేయించిన మంత్రి శ్రీధర్ బాబు**



మంథని (జనంసాక్షి) :మంత్రి శ్రీధర్ బాబు సీఎంఆర్ఎఫ్ ద్వారా మంథని నియోజకవర్గం లోని మహాదేవపూర్ మండలం బొమ్మ పూర్ గ్రామానికి చెందిన వెన్నపురెడ్డి అజిత్ కి రూ.లక్ష ఎల్ ఓ సి మంజూరు చేసి ఇప్పించారు. అజిత్ నిమ్స్ ఆసుపత్రి లో వాస్కులర్ కి సంబంధించి అనారోగ్యంతో చికిత్స పొందుతున్నట్లు సహాయం కొరకు మంత్రికి తెలుపగా వెంటనే సీఎం సహాయ నిధి ద్వారా వైద్య ఖర్చుల కోసం మంజూరు చేయించారు. మంత్రిసహాయకులు వారికి కాపీని హైదరాబాద్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అందజేశారు.

## సింగరేణి అధికారులతో జీఎం సమావేశం

**గోదావరిఖని, జనంసాక్షి:**ఆర్జీ. 1 ఏరియా సమావేశాహాలులో ఆర్జీ-1 జియం చింతల శ్రీనివాస్ అధ్యక్షతన కార్పోరేట్ , వివిధ విభాగాల అధికారులు, టాటా కన్సల్టింగ్ ఇంజనీరింగ్ లిమిటెడ్ వారిచే మేడిపల్లి ఓపన్ కాస్ట్ లో సింగరేణి సంస్థ పంప్డ్ స్టోరేజీ హైడ్రో-ఎలక్ట్రిక్ విద్యుత్ ఉత్పాదన చేపట్టాలని ఒక అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగినది.చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరామ్ ఆదేశాను ప్రకారం డైరెక్టర్ (ఈఅండ్ఎం) డి.సత్యనారాయణ రావు మేడిపల్లి ఓపన్ కాస్ట్ ప్రాజెక్ట్ లో ఉన్న నీటితో పాటు గోదావరి నది నీటిని కూడా మళ్ళించి పంప్డ్ స్టోరేజీ హైడ్రో-ఎలక్ట్రిక్ ఉత్పత్తి వ్యవస్థ గల సాధ్య సాద్యాలను అన్వేషించలని టాటా కన్సల్టింగ్ ఇంజనీరింగ్ లిమిటెడ్ వారికి వివిధ విభాగాల అధికారులు వారికి కావాల్సిన సదుపాయాలు, సమగ్రమైన వివరణాత్మకమైన నివేదిక తయారు చేసి ఇవ్వాలని తెలిపారు. అనంతరం కార్పోరేట్, వివిధ విభాగాల అధికారులు టాటా కన్సల్టింగ్ ఇంజనీరింగ్ లిమిటెడ్ వారు మేడిపల్లి ఓపన్ కాస్ట్ ను సందర్శించడము జరిగినది.ఈ కార్యక్రమంలో కార్పోరేట్ జియం (సోలార్) జానకిరాం, విజయ సారధి టాటా కన్సల్టింగ్ ఇంజనీరింగ్ లిమిటెడ్, డి. వెంకటేశ్వరరావు ఆర్జీ-1 ఏరియా ఇంజనీర్ (ఇ.అండ్.యం), శివ నారాయణ, ఏజీఎం ఎక్స్ ప్లోరేషన్ మరియు వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.




### ఆర్జి1 గని సందర్శన



గోదావరిఖని, జనంసాక్షి:ఆర్జీ. 1 ఏరియా సిఎస్పీ డైరెక్టర్ డి.సత్యనా రాయణరావు సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా సి.ఎస్.పీ లోని ఫ్లాగ్ ఫీడర్ మెరిట్ బంకర్, క్రషర్, వాటర్ స్ప్రేయింగ్, కన్వేయర్ బెల్ట్ సిస్టం, అట్లాస్ మరియు జి.ఎల్ బంకర్ ద్వారా రేకు లో బొగ్గు లోడింగ్ తదితర ప్రదేశాలను పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా డైరెక్టర్ (ఈఅండ్ఎం) డి.సత్యనారాయణరావు మాట్లాడుతూ ఆర్.జి.1కు సి.ఎస్పీ గుండెకాయ లాంటిదని ఇక్కడి నుండి బొగ్గు త్వరితగతిన రవాణా అయినప్పుడే సంస్థకు లాభాలు వస్తాయని తెలిపారు. బొగ్గు లోడింగ్ సమయం లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. బొగ్గు లోడింగ్ , అన్ లోడింగ్ సమయంలో తప్పని సరిగా రక్షణ చర్యలను పాటించాలని సుంచించారు. సంస్థ సిఎస్పి కి నిర్ధేశించిన రేకుల ద్వారా బొగ్గు రవాణాను నిర్ధేశించిన లక్ష్యాలను సాదించాలని సూచించారు. సిఎస్పి కి విచ్చేసిన డైరెక్టర్ డి.సత్యనారాయణరావు సిఎస్ పి అధికారులు శాలువాతో సత్కరించటం జరిగింది. జియం చింతల శ్రీనివాస్, ఏరియా ఇంజనీరు డి. వెంకటేశ్వరరావు, సి.ఎస్పీ ఎస్ఈ శ్రీనివాస్, హరీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### అసత్య ఆరోపణలు సరికాదు



**ఆర్మూర్(జనంసాక్షి):**సోషల్ మీడియాలో ఆర్మూర్ నియోజకవర్గ ఇంచార్జీ మార్పు,అదికార బదిలీలో ఆర్మూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి వినయ్ రెడ్డి పై అవాస్తవ అభియోగాలను ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు ఖండించారు. పివిఆర్ భవన్ లో వారు మాట్లాడుతూ వినయ్ రెడ్డి అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిన,కాంగ్రెస్ లో గెలిచిన ఎమ్మెల్యేలతో సమానంగా ఆర్మూర్ నియోజకవర్గ నిధులు తీసుకు వస్తున్నారని అన్నారు. మచ్చలేని నాయకుడిని బద్నాం చేయడం సరైన పద్ధతి కాదని వారన్నారు. వినయ్ రెడ్డి పై చేసిన ఆరోపణలో వాస్తవలతో ముందుకు రావాలని నిలదీశారు. గత 15 ఏళ్లుగా రాజకీయంలో ప్రాంత ప్రజలకు సొంత డబ్బులతో బియ్యం పంపిణీ, శివాజీ లకు విగ్రహ దాత, ప్రతి కష్టానికి ప్రజలకు తోడుగా ఉన్నారని చెప్పారు. అవాస్తవాలను ప్రజలందరూ గమనిస్తున్నారన్నారు. పక్క ఆధారాలతో నిజ నిరూపణ చేయకపోతే లీగల్ నోటీసులు పంపి చట్టపరమైన చర్యలు తీసుకొని పరువు నష్టం దావా వేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో మండలాల అధ్యక్షులు సాయిబాబా గౌడ్, మంద మైపాల్, ముక్కెర విజయ్,భూమేష్ రెడ్డి, వైస్ చైర్మన్ షేక్ మున్నా, కాంగ్రెస్ పార్టీ నాయకుడు అయ్యప్ప శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ జీవన్, డిసిసిబి డైరెక్టర్ వాసు, సిద్దలగుట్ట డైరెక్టర్ జిమ్మీ రవి,చరణ్ రెడ్డి, కౌన్సిలర్లు బండారి ప్రసాద్, భూషణ్, అజ్జు భాయ్,ఆకుల రాము, మాజీ సర్పంచ్ గణేష్,నాయకులు సత్యం, సాజిద్, గోపి,తదితరులు పాల్గొన్నారు.

### సుప్రీంకోర్టులో కేజీవ్రాల్ కు ఊరట

మనీలాండరింగ్ కేసులో ఏప్రిల్ 9న ఢిల్లీ హైకోర్టు జారీ చేసిన ఉత్తర్వులను కేజ్రీవాల్ సుప్రీంకోర్టులో సవాలు చేశారు. జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్త నేతృత్వంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం కేజ్రీవాల్ పిటిషన్ పై విచారణ జరిపింది. కేజ్రీవాల్, ఈడీ వాదనల అనంతరం మే 17న తీర్పును సుప్రీంకోర్టు రిజర్వ్ చేసింది. ఆ తరవాత జూన్ 20న కేజ్రీవాల్‌కి రౌస్ అవెన్యూ కోర్టు సాధారణ బెయిల్ మంజూరు చేయగా... మరుసటి రోజే ఢిల్లీ హైకోర్టు స్టే ఇచ్చింది.

### భారత్‌లో జనాభా విస్పోటనం

రేటు గణనీయంగా పడిపోవడమే ఇందుకు కారణమని వివరించింది. చైనాలో సగటున ఒక్కో మహిళ తమ జీవితకాలంలో ఒకరికి మాత్రమే జన్మనిస్తున్నట్లు తెలిపింది.సంతాన సాఫల్యత రేటు 2.1 ఉండాలని.. అప్పుడే ప్రస్తుత జనాభా అలాగే కొనసాగుతుందని ఐరాసలో జనాభా విభాగాధిపతి జాన్ విల్మోత్ తెలిపారు. 1.8 లేదా 1.5 కంటే తక్కువకు చేరితే జనాభా గణనీయంగా పడిపోతుందని పేర్కొన్నారు. చైనా సహా మరికొన్ని దేశాల్లో ప్రస్తుతం అదే జరుగుతోందని వివరించారు.

# కబడ్దార్.. పుట్ట మధు

**దుద్దిల్ల కుటుంబంపై అసత్య ఆరోపణలు నీ ఇంటిని ముట్టడిస్తాం..! : కాంగ్రెస్ నాయకుల హెచ్చరిక**



**కమాన్‌పూర్ (జనంసాక్షి):**ప్రెస్‌మీట్‌లు పెట్టి చెప్పినంత మాత్రాన అబద్దాలు నిజాలు కాబోవని ఇప్పటికైనా మంత్రి శ్రీధర్ బాబు పై, శ్రీను బాబు పై అసత్యపు ఆరోపణలు చేయడం మానుకోవాలని కమాన్ పూర్ మండల కాంగ్రెస్ నాయకులు హితావు పలికారు. మరో మారు మంత్రి శ్రీధర్ బాబు కుటుంబం పై అర్ధరహిత విమర్శలు చేస్తే సహించేది లేదన్నారు. కమాన్‌పూర్ మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నాయకులు మాట్లాడారు. మంథని నియోజకవర్గంలో గూండాయిజం రౌడీయిజం చేసింది ఎవ్వరో.. ఆరాచకాలు చేసింది ఎవ్వరో.. మంథని నియోజకవర్గం ప్రజలకు స్పష్టంగా తెలుసునన్నారు. మంథని నియోజకవర్గంతో పాటు రాష్ట్ర అభివృద్ధి కోసం పాటుపడుతున్న మంత్రికి వస్తున్న మంచిపేరును జీర్ణించుకోలేకనే అబద్దపు ఆరోపణలు చేయడం సిగ్గుచేటన్నారు.రాజకీయ ఉనికి కోసం, బీ. ఆర్. ఎస్ పెద్దల మన్ననలు పొందడం కోసమే మధు ప్రెస్ మీట్లు పెడుతున్నారని ఆరోపించారు.ఇకనైనా పుట్ట మధు పద్దతి మార్చుకోవాలని, మరోమారు మంత్రి శ్రీధర్ బాబు పై అర్ధరహిత, అసత్యపు ఆరోపణలు చేస్తే పుట్ట మధు ఇంటిని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ముట్టడించడం జరుగుందని హెచ్చరించారు. కాంగ్రెస్ నాయకులు మోహన్, కృష్ణమూర్తి, సత్యనారాయణ, రమేష్, ఎండి ముస్తాక్, శంకరయ్య, గట్టయ్య, శ్రీను, రఫీక్, భూంపెల్లి రాజయ్య, నర్సయ్య గౌడ్, కృష్ణ, మహేష్ గౌడ్, విజయ్ గౌడ్, సాయిరామ్ గౌడ్, లక్ష్మీరాజాం, రవి, స్వామి, నీల రాజయ్య, శ్రవణ్ కుమార్, తిరుపతి, గట్టయ్య, సత్యం, రాంచందర్, రాయమల్లు, లింగయ్య, చంద్రశేఖర్, నర్సింగం పాల్గొన్నారు.

**మంత్రి శ్రీధర్ బాబు పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకునేదే లేదు**

ముత్తారం (జనంసాక్షి): మంత్రి శ్రీధర్ బాబు అనిచిత వ్యాఖ్యలు చేసిన పుట్ట మధుకర్ పై కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చొప్పరీ సదానందం మండిపడ్డారు. హత్యలు అరాచకాలకు అక్రమ వసూళ్లకు కేరాఫ్ అడ్రస్ గా పుట్ట మధుకర్ నిలిచిపోయాడు అన్నారు..మంథని క్యాంపు కార్యాలయంలో దాసరి శివకుమార్ కు శ్రీధర్ బాబు దాచి పెట్టినాడు అని అబద్దాల మాటలు మాట్లాడుతున్నావు నీ దగ్గర ఏమైనా ఆధారాలు ఉన్నాయా లేదా సనాతన హిందూ ధర్మం ప్రకారం నేను సవాలు విసురుతున్న ఏదైన దైవ సన్నిధిలో ప్రమానానికైనా మేము సిద్ధం నువ్వు సిద్ధమా అని చొప్పరి సదానందం సవాల్ విసిరారు.మాజీ సర్పంచ్ రజిత రఫీ, కిసాన్‌సెల్ మండలాధ్యక్షుడు శ్రీనివాస్, గ్రామ శాఖ అధ్యక్షుడు సమ్మయ్య, నాయకులు సంపత్, రమేష్, విజయ్,లింగయ్య, రాజ్ కుమార్ పాల్గొన్నారు..



## పెట్రోల్‌బంక్ పునఃప్రారంభించిన ఎమ్మెల్యే కవ్వంపల్లి



**కరీంనగర్ బ్యూరో, జులై 11 (జనంసాక్షి)**

మానకొండూర్ నియోజకవర్గం శంకరపట్నం మండలం గద్దపాక గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ సహకారంతో నిర్వహిస్తున్న రేనోవేషన్ పెట్రోల్ బంక్ ను కేడీసీసీబి చైర్మన్ కొండూరు రవీందర్ రావుతో కలిసి పునఃప్రారంభించిన ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనా రాయణ మాట్లాడుతూ... సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బంక్ మళ్ళీ పునఃప్రారంభించడం చాలా రైతులకు శుభపరి మాణమన్నారు. భారత ప్రధానిగా పీ.వి నర్సింహా రావు తీసుకవచ్చిన ఆర్థిక సంస్కరణలు, విదేశి పెట్టుబడులు బ్యాంకుల జాతీయకరణ వల్ల ఈరోజు సహకార సంఘాలు అభివృద్ధి బాటలో నడుస్తున్నాయన్నారు. ప్రాథమిక సహకార సంఘాల అభివృద్ధి వల్ల రైతులకు సేవలందిచడమే కాకుండా బ్యాంకులు, పెట్రోల్ బంకులు, షాపింగ్ కాంప్లెక్స్ లు, సిఎస్ సి సెంటర్ల ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశలు కల్పిస్తున్నాయని అన్నారు. వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేయడానికి సహకార సంఘాలు ఎంతో కృషి చేస్తున్నాయని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం కూడా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల అభివృద్ధికి తోడ్పాటు అందిస్తామని తెలిపారు. వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పెట్రోల్ బంక్ ద్వారా రైతులకు నాణ్యమైన సేవలు అందించి సంఘాన్ని అభివృద్ధి బాటలో నడిపించాలనీ కోరారు.ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్లు, పాలకవర్గ సభ్యులు, కేడీసీసీబీ అధికారులు, మాజీ ప్రజా ప్రతినిధులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## బ్యాంకు మేనేజర్ సేవలు ప్రశంసనీయం

**ఎడపల్లి(జనంసాక్షి):**మండల కేంద్రంలో గత మూడు సంవత్సరాలుగా విధులు నిర్వహించి నేడు బదిలీపై వెళున్న తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ సాయి మేఘన, క్యాషియర్ వెంకటేష్ ల సేవలు ఎంతో ప్రశంసనీయమని ఎడపల్లి గ్రామస్తులు స్పష్టం చేశారు. శుక్రవారం బదిలీపై వెళ్తున్న అధికారులను సహకార సంఘం చైర్మన్ పోల మల్కారెడ్డి, ఎడపల్లి గ్రామ మాజీ సర్పంచ్ మాణిక్ ఎల్లయ్య యాదవ్, గ్రామ పెద్దలు బంజ కామప్ప, దూస గంగాధర్, పడిదం కృష్ణ రెడ్డి, అబ్దుల్ వాహబ్ భారీ, రాజిరెడ్డి, మల్లయ్య తదితరులు బ్యాంకు మేనేజర్, క్యాషియర్లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ, గత మూడు సంవత్సరాలుగా బ్యాంకు మేనేజర్ సాయి మేఘన ప్రజలతో మమేకమై మెరుగైన సేవలు అందించడం అభినందనీయమన్నారు. బ్యాంకుకు వచ్చే ఖాతాదారులతో పాటు రైతులతో మర్యాదగా వ్యవహరిస్తూ వారి సమస్యలను ఓపికగా వింటూ వారి సమస్య పరిష్కారం కోసం తన వంతుగా కృషి చేసిన ఘనత మేనేజర్ సాయి మేఘనకే దక్కుతుందన్నారు. ముమ్మందు మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని గ్రామస్తులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రస్తుత క్యాషియర్ దివ్య, బ్యాంకు మిత్ర న్యావనంది జ్యోతి, బ్యాంకు సిబ్బంది తేజ, గ్రామస్తులు ఉన్నారు. కాగా బ్యాంకు మేనేజర్ సాయి మేఘన నిర్మల్ బ్రాంచ్ కు బదిలీ కాగా క్యాషియర్ వెంకటేష్ నిజామాబాద్ బ్రాంచ్ కు బదిలీ అయ్యారు.



### సిఐని సన్మానించిన సీనియర్ సిటిజన్స్

సిరిసిల్ల టౌన్ (జనంసాక్షి):అర్బన్ సిఐగా నూతనంగా విధుల్లో కృష్ణను సీనియర్ సిటిజన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి శంకరయ్య, అధ్యక్షులు బుచ్చయ్యలు మాట్లాడుతూ సీనియర్ సిటిజన్ కేసులను సత్వరమే పరిష్కారం చేస్తానని సిఐ హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో కోశాధికారి దొంత దేవదాస్, మిట్టపల్లి రాములు, నక్క మనోహర్, లక్ష్మీనారాయణ, ఇరుకుల్ల భాస్కర్, లక్ష్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



## పారదర్శకంగా 'మహిళా శక్తి'

- వివక్షకు తావిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం
- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు




**నిజామాబాద్, బ్యూరో జూలై 12(జనంసాక్షి) :** మహిళా సాధికారతే ధ్యేయంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మహిళా శక్తి కార్యక్రమం ద్వారా వివిధ యూనిట్ల స్థాపన కోసం పూర్తి పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేయడం జరుగుతుందని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు స్పష్టం చేశారు. లబ్ధిదారుల ఎంపికలో వివక్షను ప్రదర్శిస్తూ పొరపాట్లకు ఆస్కారం కల్పిస్తే, సంబంధిత ఏపీఎంలను బాధ్యులుగా పరిగణిస్తూ కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో శుక్రవారం మహిళా శక్తి కార్యక్రమంపై జిల్లా, మండల మహిళా సమాఖ్య ప్రతినిధులకు, డీపీఎంలు, ఏపీఎంలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా శక్తి కార్యక్రమం ఉద్దేశ్యాన్ని కలెక్టర్ వివరిస్తూ, మహిళలను ఆర్థికంగా మరింత ప్రగతిబాటలో పయనింపజేయాలనే సంకల్పంతో ప్రభుత్వం మహిళా శక్తి కార్యక్రమాన్ని చేపట్టిందని అన్నారు. ఇప్పటికే పాఠశాల విద్యార్థులు ఏకరూప దుస్తులను కుట్టి ఇచ్చే బాధ్యతలతో పాటు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో ప్రభుత్వ బడులలో పనులను సైతం స్వయం సహాయక మహిళా సంఘాల ద్వారానే కొనసాగిస్తోందని గుర్తు చేశారు. జిల్లాలో సుమారు లక్షా 80 వేల యూనిఫామ్స్ కుట్టే బాధ్యతలను మహిళా సంఘాలకు అందిస్తున్నామని, తద్వారా ఒక్కో జత కుట్టుకూలీ 75 రూపాయలు చొప్పున మహిళా సంఘాలకు సుమారు కోటిన్నర రూపాయల వరకు ఆదాయం సమకూరుతుందని తెలిపారు. భవిష్యత్తులోనూ వీరికి అంగన్వాడీ సెంటర్లు, రెసిడెన్షియల్ పాఠశాలల విద్యార్థుల యూనిఫామ్ లు కుట్టించే ఆర్డర్లు కూడా అందిస్తామని అన్నారు. రెండవ జత ఏకరూప దుస్తులను త్వరితగతిన అందించేలా చూడాలని మహిళా సమాఖ్య ప్రతినిధులకు సూచించారు.కాగా, మహిళా శక్తి కార్యక్రమం ద్వారా మహిళా సంఘాలలో ఔత్సాహిక సభ్యులకు వారి అభిరుచికి అనుగుణంగా వివిధ యూనిట్ల స్థాపన కోసం ఎంపిక చేసే ప్రక్రియ పూర్తి పారదర్శకంగా జరగాలని కలెక్టర్ ఏపీఎంలను ఆదేశించారు. అదనపు కలెక్టర్ అంకిత్, డీఆర్డీఓ సాయాగౌడ్, లీడ్ బ్యాంకు మేనేజర్ సి.అశోక్ చౌహాన్, పశు సంవర్థక శాఖ జిల్లా అధికారి జగన్నాథ చారి, పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ సురేష్ కుమార్, ఫిషరీస్ ఏ.డీ రాజనర్సయ్య పాల్గొన్నారు.





ఇంగ్లండ్
వెటరన్ పేసర్ జేమ్స్ అండర్సన్‌కు ఘనమైన వీడ్కోలు లభించింది. సొంతగడ్డపై వెస్టిండీస్‌తో జరిగిన లార్డ్స్ టెస్టులో బెన్ స్టోక్స్ సేన ఇన్నింగ్స్ 114 పరుగుల తేడాతో గెలుపొందింది. దాంతో, బౌలింగ్ దిగ్గజం అండర్సన్ అంతర్జాతీయ క్రికెట్ నుంచి సెలవు తీసుకున్నాడు. ఇంగ్లండ్ బౌలర్ల ధాటికి కరీబియన్ ఆటగాళ్లు క్రీజులో నిలవలేకపోయారు. దాంతో, మూడో రోజు ఆట మొదలైన కాసేపటికే కరీబియన్ జట్టు ఆలౌటయ్యింది. అరంగేట్రం మ్యాచ్‌లోనే అదరగొట్టిన పేసర్ గట్ అట్కిన్సన్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా ఎంపికయ్యాడు. లార్డ్స్ టెస్టులో తొలి రోజు నుంచే ఇంగ్లండ్ పట్టు బిగించింది. మొదటి రోజే అట్కిన్సన్ విజృంభణతో కరీబియన్ బ్యాటర్లు చేతులెత్తేశారు. అలిక్ అథనెజె 24 పరుగులతో టాప్ స్కోరర్ కాగా 121కే విండీస్ ఆలౌటయ్యింది. అనంతరం ఇన్నింగ్స్ ఆరంభించిన ఇంగ్లండ్ 371 పరుగుల భారీ స్కోర్ చేసింది. వెస్టిండీస్ బౌలర్లను ఉతికేస్తే ఏకంగా ఐదుగురు అర్ధ శతకాలతో కదం తొక్కారు. ఓపెనర్ జాక్ క్రాలే(76), జో రూట్(68), ఓలీ పోప్(57), హ్యారీ బ్రూక్(50)లు 'బజ్‌బాల్' ఆటతో చెలరేగారు. జేమీ స్మిత్(70) సైతం అద్భుత అర్ధ శతకంతో జట్టు స్కోర్ 370 దాటించాడు. దాంతో, తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్‌కు ఆధిక్యం లభించింది.

### బ్రేకిచ్చిన అండర్సన్..

వెస్టిండీస్ జట్టు 250 పరుగుల లోటుతో రెండో ఇన్నింగ్స్ ఆరంభించింది. అయితే.. వీడ్కోలు మ్యాచ్ ఆడుతున్న అండర్సన్ (3/32)ఓపెనర్ క్రెగ్ బ్రాత్‌వైట్(4)ను బౌల్డ్ చేసి వికెట్ల వేట మొదలెట్టాడు. ఆ తర్వాత అట్కిన్సన్(5/61), కెప్టెన్ బెన్ స్టోక్స్(2/25)లు విండీస్‌ను వణికించారు. జేసన్ హెూల్డర్ (20) ఔట్ కావడంతో పర్యాటక జట్టు కోలుకోలేకపోయింది. 136 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. దాంతో, ఇంగ్లండ్ 114 పరుగుల తేడాతో భారీ విజయం నమోదు చేసింది. ఇక, తన చివరి టెస్టులోనూ ఆండర్సన్ ఓ అరుదైన రికార్డు నమోదు చేశాడు. టెస్టు క్రికెట్ చరిత్రలో 40 వేల బంతులు విసిరిన తొలి ఫాస్ట్ బౌలర్ గా రికార్డు పుటల్లోకెక్కాడు. ఈ జాబితాలో ముత్తయ్య మురళీధరన్ (44,039), అనిల్ కుంబ్లే (40,850), షేన్ వార్న్ (40,705) మొదటి మూడు స్థానాల్లో ఉన్నారు. వీరు ముగ్గురూ స్పిన్నర్లే. అత్యధిక బంతులు విసిరిన బౌలర్లలో ఆండర్సన్ నాలుగో స్థానంలో ఉన్నాడు.ఆండర్సన్ 194 వన్డేల్లో 269 వికెట్లు, 19 అంతర్జాతీయ టీ20 పోటీల్లో 18 వికెట్లు తీశాడు. బ్యాటింగ్ లో ఒకే ఒక్క అర్ధం సెంచరీ సాధించాడు.

# విజయంతో వీడ్కోలు

# 'అసామాన్యుడు'.. అండర్సన్

*అంతర్జాతీయ క్రికెట్లో ముగిసిన ఆండర్సన్ శకం*

- టెస్టు క్రికెట్‌కు వీడ్కోలు పలికిన ఇంగ్లండ్ ఫాస్ట్ బౌలర్ జేమ్స్ ఆండర్సన్
- వెస్టిండీస్‌తో ముగిసిన టెస్టే ఆండర్సన్‌కు చివరి టెస్టు
- కెరీర్‌లో 188 టెస్టులాడి 704 వికెట్లు తీసిన ఆండర్సన్
- అరుదైన రికార్డులు సొంతం చేసుకున్న లెజెండరీ ఫాస్ట్ బౌలర్

ప్రపంచంలోనే మేటి పేసర్ జేమ్స్ అండర్సన్ అంతర్జాతీయ క్రికెట్‌కు ఘనంగా వీడ్కోలు పలికాడు. సొంతగడ్డపై లార్డ్స్ టెస్టులో ఆడిన జిమ్మీ విజయంతో కెరీర్ ముగించాడు. తన ఆఖరి టెస్టులో నాలుగు వికెట్లు తీసిన ఇంగ్లండ్ వెటరన్ సగర్వంగా ఆటకు గుడ్ బై చెప్పేశాడు. దాంతో, ప్రపంచ క్రికెట్‌లో ఓ మహాయోధుడి శకం ముగిసింది. 22 ఏండ్ల సుదీర్ఘ ప్రయాణంలో ఒకటా రెండా.. ఎన్నో మైలురాళ్లను అండర్సన్ అధిగమించాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో 22 ఏండ్ల జర్నీ.. అంత ఈజీ కాదు. అలాంటిది ఓ పేసర్ గాయాలను తట్టుకొని, ఫిట్‌నెస్ కాపాడుకొని 188 401మ్యాచ్‌లు ఆడేశాడంటే అది నిజంగా అద్భుతమే. అందుకనే 41 ఏండ్ల వయసులోనూ అండర్సన్ బౌలింగ్ చేస్తుంటే.. 'వయసు మర్చిపోయాడా ఏంటీ?' అని అతడితో కెరీర్ మొదలెట్టిన వాళ్లు అసూయ పడేవారు. చెప్పాలంటే.. అండర్సన్ తన తరం, తర్వాతి తరంతో పాటు కలిసి ఆడాడు. సుదీర్ఘ కెరీర్‌లో మూడు ఫార్మాట్లలో 401 మ్యాచ్‌లు ఆడిన అండర్సన్ 991 వికెట్లు పడగొట్టాడు. అయితే వీటిలో అత్యధికం టెస్టుల్లో వచ్చినవే. రెడ్ బాల్ క్రికెట్‌లో 704, వన్డేల్లో 269, టీ20ల్లో 18 వికెట్లు ఖాతాలో వేసుకున్నాడు. టెస్టుల్లో అత్యధిక వికెట్లు తీసిన మూడో బౌలర్‌గా చరిత్ర సృష్టించాడు. దాంతో, 'హ్యాపీ రిటైర్మెంట్', 'థ్యాంక్యూ అండర్సన్' హ్యాష్‌ట్యాగ్‌లు వైరల్ అవుతున్నాయి.

### మూడో బౌలర్‌గా రికార్డు

టెస్టుల్లో అత్యధిక వికెట్లు తీసిన టాప్ -5 బౌలర్ల జాబితాలో అండర్సన్ ఒకడు. 188 మ్యాచుల్లో 704 వికెట్లు పడగొట్టిన జిమ్మీ మూడో స్థానంలో నిలిచాడు. శ్రీలంక లెజెండ్ ముత్తయ్య మురళీధరన్ 800 వికెట్లతో టాప్‌లో ఉండగా.. 708 వికెట్లు తీసిన దివంగత షేన్ వార్న్(ఆస్ట్రేలియా) రెండో స్థానంలో కొనసాగుతున్నాడు. భారత స్పిన్ దిగ్గజం అనిల్ కుంబ్లే (619), ఇంగ్లండ్ వెటరన్ పేసర్ స్టువార్ట్ బ్రాడ్(604)లు వరుసగా నాలుగు, ఐదో ప్లేస్‌లో నిలిచారు. అండర్సన్ వీడ్కోలు మ్యాచ్ అయిన లార్డ్స్ టెస్టులో బెన్ స్టోక్స్ సేన ఇన్నింగ్స్ 114 పరుగుల తేడాతో గెలుపొందింది. 250 పరుగుల లోటుతో రెండో ఇన్నింగ్స్ ఆడిన విండీస్ 136 పరుగులకే కుప్పకూలింది. అండర్సన్ మూడు వికెట్లతో చెలరేగగా.. గట్ అట్కిన్సన్ 5 వికెట్లతో అదరగొట్టాడు. దాంతో, మూడో రోజే ఇంగ్లండ్ మ్యాచ్‌ను ముగించి సిరీస్‌లో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది.



## వింబుల్డన్‌లో హిట్‌మ్యాన్..

భారత కెప్టెన్ రోహిత్ శర్మ హాలీడేను ఎంజాయ్ చేస్తున్నాడు. వరల్డ్ కప్‌లో నీలి రంగు జెర్సీతో ట్రోఫీ పట్టేసిన హిట్‌మ్యాన్ ఇప్పుడు సూట్ బూటు గెటప్‌లోకి మారాడు. ఫ్యామిలీతో లండన్ పర్యటనకు వెళ్లిన రోహిత్.. వింబుల్డన్ టోర్నమెంట్‌లో తళుక్కుమన్నాడు. విజిటర్స్ గ్యాలరీలో కూర్చొని సెమీఫైనల్ మ్యాచ్ వీక్షించాడు. దాంతో, వరల్డ్ కప్ హీరో రోహిత్‌కు వింబుల్డన్ నిర్వాహకులు స్వాగతం చెప్తూ ఎక్స్ ఖాతాలో పోస్ట్ పెట్టారు. ఆ పోస్ట్ ప్రస్తుతం సోషల్‌మీడియాలో వైరల్ అవుతోంది. వరల్డ్ కప్ ట్రోఫీతో విజయాన్ని మనసారా అస్వాదించిన రోహిత్ ఫ్యామిలీతో ట్రిప్ వెళ్లాడు. ముంబైలో ఓపెన్ టాప్ బస్సు విక్టరీ పరేడ్.. వాంఖడేలో సన్మాన కార్యక్రమం తర్వాత హిట్‌మ్యాన్ లండన్‌కు వెళ్లాడు. శుక్రవారం కార్లోస్ అల్కరాజ్, డానిల్ మెద్వెదేవ్ మధ్య జరిగిన సెమీ ఫైనల్ మ్యాచ్‌ను రోహిత్ వీక్షించాడు. రోహిత్‌తో పాటు మాజీ క్రికెటర్ దినేశ్ కార్తిక్ సైతం ఫ్యామిలీతో వింబుల్డన్ మ్యాచ్ చూశాడు. బార్బడోస్ గడ్డపై చిరస్మరణీయ విజయంతో యావత్ భారతం గర్వపడేలా చేసిన హిట్‌మ్యాన్ తాజాగా తన 'ఎక్స్' ఖాతా డీపీ మార్చాడు. త్వరలోనే టీమిండియా శ్రీలంక టూర్‌కు వెళ్లనుంది. కానీ, రోహిత్ సహా సీనియర్లు విరాట్ కోహ్లీ, పేసర్ జస్ప్రీత్ బుమ్రాలకు బీసీసీఐ విశ్రాంతి ఇచ్చిన విషయం తెలిసిందే.

## సైనాకు 'సారీ' చెప్పిన బుమ్రా

ఒలింపిక్ విజేతగా ఓ వెలుగు వెలిగిన సైనా నెహ్వాల్ రాకెట్ వదిలేసి దాదాపు ఆరేండ్లు అవుతోంది. వివాహం తర్వాత ఆటకు దూరమైన ఆమె తాజాగా క్రికెట్‌పై సంచలన కామెంట్ చేసింది. దాంతో, కోల్‌కతా నైట్ రైడర్స్ యువకెరటం అంగ్‌క్రిష్ రఘువంశీ సైనాకు టార్గెట్ చేస్తూ ఓ పోస్ట్ పెట్టాడు. 'బుమ్రా 150 కిలోమీటర్ల వేగంతో ఆమె తలపైకి బౌన్సర్‌ను విసిరితే ఏం చేస్తుందో చూడాలి' అనే అర్థం వచ్చేలా పోస్ట్ పెట్టాడు. అయితే.. అది కాస్త మిస్ ఫైర్ కావడంతో 'అదొక బ్యాడ్ జోక్' అంటూ సైనాకు సారీ చెప్పాడు. అంతేకాదు వెంటనే తన పోస్ట్‌ను డిలీట్ చేశాడు. అసలేం జరిగిందంటే? తాజాగా రాష్ట్రపతి భవన్‌లో ప్రెసిడెంట్ ద్రౌపది ముర్ముతో సైనా సరదాగా బ్యాడ్మింటన్ ఆడింది. అనంతరం 'మై స్టోరీ – హర్ స్టోరీ' సిరీస్‌లో మాట్లాడిన వీడియోలో ఆన్‌లైన్‌లో వైరల్ అయింది. బ్యాడ్మింటన్ బదులు టెన్నిస్ ఆడి ఉంటే బాగుండు అని తనకు అప్పుడప్పుడు అనిపించేదని అంది. అంతేకాదు 'టెన్నిస్, బ్యాడ్మింటన్ కంటే క్రికెట్ ఏమంత కష్టమేమీ కాదు. మనదేశంలో క్రికెట్‌కు ఉన్న ఆదరణ చూస్తే అసూహ వేస్తుంది. ఎందుకంటే.. క్రికెట్‌కు మాత్రమే క్రేజ్ ఉంటే భారత్ క్రీడా దేశం ఎలా అవుతుంది?. ఒలింపిక్స్‌లో చైనాతో పోటీ పడి పతకాలు ఎలా గెలవగలం' అని అంది. దాంతో, రఘువంశీ అత్యుత్సాహం ప్రదర్శిస్తూ.. బుమ్రా 150 కిలోమీటర్ల వేగంతో ఆమె తలపైకి బౌన్సర్‌ను విసిరితే ఏం చేస్తుందో చూడాలి అని ఓ పోస్ట్ పెట్టాడు.ఆ పోస్ట్ చూసిన చాలామంది సైనాకు మద్దుతగా నిలుస్తూ రఘువంశీని ఆడేసుకున్నారు. దాంతో, తన తప్పు గ్రహించిన కోల్‌కతా కుర్రాడు ఆ పోస్ట్‌ను తొలగించి సైనాకు సారీ చెప్పాడు. ఐపీఎల్ 17వ సీజన్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్ తరఫున రఘువంశీ దంచికొట్టాడు. 10 మ్యాచుల్లో ఈ యంగ్‌స్టర్ 163 రన్స్ కొట్టాడు.



## నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ సర్వసభ్య సమావేశానికి
# హాజరైన ఎమ్మెల్యే కేపీ వివేకానంద



**కుత్బుల్లాపూర్ జూలై 12 (జనం సాక్షి) :** నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో కార్పొరేషన్ మేయర్ నీల గోపాల్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి కుత్బుల్లాపూర్ నియోజకవర్గం ఎమ్మెల్యే కేపీ వివేకానంద ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలోని అన్ని డివిజన్లను అభివృద్ధి పరచడానికి తాను శాయశక్తుల కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పెండింగ్లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా వర్షాకాలంను దృష్టిలో పెట్టుకొని డ్రైనేజీ, మురికి కాలువలు, రోడ్లు తదితర పెండింగ్లో ఉన్న పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, మున్సిపల్ కమిషనర్ రామకృష్ణారావు, ఎమ్మార్వో పూల్ సింగ్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## నిలువెత్తు నిర్లక్ష్యం..

**కాప్రా సాయిబాబా నగర్‌లోని రిజర్వాయర్ నుంచి మంచినీరు లీక్ అవుతోంది. ట్యాంకు ఓవర్ ఫ్లో అయి నీరు రోడ్ల పలు అవుతున్నా పట్టించుకోని అధికారులు పట్ల కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు.** - కీసర /కాప్రా, (జనంసాక్షి)



## సిఎం రేవంత్ రెడ్డిని కలిసి పుష్పగుచ్చం అందించిన గురునాథ్ రెడ్డి

**కొడంగల్ జులై12(జనం సాక్షి ):**
రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గా బాధ్యతలు స్వీకరించిన గుర్నాథ్ రెడ్డి శుక్రవారం హైదరాబాద్ లోని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందించి ధన్యవాదాలు తెలియజేశారు. రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గుర్నాథ్ రెడ్డి మాట్లాడుతూ నాపై నమ్మకం ఉంచి రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు, ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ముదప్ప దేశ్ముఖ్, మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

# ప్రభుత్వాలు మారిన ఉపకార వేత(నా)లు తీరావా?

- పెండింగ్ స్కాలర్ షిప్స్ ఫీజురీయంబర్స్ మెంట్స్ విడుదల చేయాలి
- తక్షణమే ముఖ్యమంత్రి స్పందించి పేద విద్యార్థులకు న్యాయం చేయాలి : ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు
- మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ముట్టడికి కదంతొక్కిన విద్యార్థులు





**మేడ్చల్ జిల్లా ప్రతినిధి జులై 12 (జనంసాక్షి) :**
తెలంగాణ రాష్ట్రంలో ఉపకార వేతనాలు,ఫీజు రీయింబర్స్ మెంట్స్ తక్షణమే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు అన్నారు. ఉపకార వేతనాలు విడుదల చేయాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన నిర్వహించి, ర్యాలీ, ప్రదర్శనతో కలెక్టర్ కార్యాలయనికి విద్యార్థుల పెద్ద ఎత్తున ముట్టడించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు నాగరాజు మాట్లాడుతూ.. గత ఆరేళ్ళ నుండి విద్యార్థులకు ఇవ్వవలసిన ఫీజులను ప్రభుత్వం చెల్లించడం లేదు. తెలంగాణ రాష్ట్రంలో సంవత్సరానికి 14 లక్షల మంది విద్యార్థులు స్కాలర్ షిప్స్ కోసం దరఖాస్తు చేసుకుంటున్నారు. వీరికి సంవత్సరానికి 3000 వేల కోట్లు అవసరం అవుతాయి.కానీ 2019 నుండి ఇప్పటి వరకు బకాయిలు పేరుకోని మొత్తం 8214.57 కోట్లు రూపాయలు ఫీజుల బకాయిలు ఉన్నాయి. ప్రభుత్వం విద్యార్థులు ఆందోళనలు చేసినప్పుడు టోకెన్లు జారీ చేయడం తప్ప, ట్రెజరీల నుండి ఒక్కరూపాయి కూడా నిధులు విడుదల చేయడం లేదు. ప్రైవేట్ యాజమాన్యాలు ఫీజులు రాలేదనే పేరుతో, విద్యార్థులకు సర్టిఫికేట్స్ ఇవ్వడం లేదు. ఉన్నత చదువులకు వెళ్ళాలనే విద్యార్థులు తల్లిదండ్రులు, సర్టీఫికెట్స్ కోసం వడ్డీలకు అప్పులు చేస్తున్న దుస్థితి తెలంగాణ రాష్ట్రంలో నెలకొంది. కళాశాల యాజమాన్యాలు కూడా, కళాశాల నడపడానికి బయట నుండి అప్పులు తెచ్చామని ప్రభుత్వం బకాయిలు విడుదల చేయకపోవడంతో, కళాశాలలు మూతవేసే పరిస్థితి ఉందని వాపోతున్నారు. తక్షణమే పెండింగ్ ఉపకార వేతనాలు విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాథోడ్ సంతోష్ మాట్లాడుతూ.. స్కాలర్ షిప్స్ ,ఫీజు రీయంబర్స్ మెంట్స్ కోసం దరఖాస్తు చేసుకునేందుకు, వాటిని విడుదల చేసేందుకు ప్రభుత్వం కొన్ని మార్గదర్శకాలు జారీ చేసింది. కానీ ఆయా మార్గదర్శకాలు ప్రభుత్వమే అమలు చేయడం లేదు. విద్యా సంవత్సరం ప్రారంభంలోనే విద్యార్థుల నుండి దరఖాస్తులు తీసుకోని, ప్రభుత్వం పరిశీలన చేయాలి. పరిశీలనలో అర్హులు అని తెలితే, ముందే 25శాతం చెల్లించాలి, విద్యా సంవత్సరం మధ్యలో 50శాతం, మిగిలిన ఫీజులు సంవత్సరం చివర్లో చెల్లించాలి. కానీ ఈ నిబంధనలు రాష్ట్ర ప్రభుత్వాలు పాటించడం లేదు. విద్యార్థి దరఖాస్తు చేసుకోని తన కోర్సు ముగిసే వరకు కూడా ఫీజులు విడుదల చేయడం లేదు, ఫలితంగా విద్యార్థులు ఉన్నత చదువులు చదివే పరిస్థితి లేకుండా పోతుంది.రాష్ట్రం, జిల్లా లో అత్యధికంగా బిసి. ఎస్సీ,ఎస్టీ, మైనార్టీ విద్యార్థులకు ఎక్కువ ఫీజులు బకాయిలు ఉన్న పరిస్థితి ఉంది. డబ్బులు చెల్లించలేని విద్యార్థులు సర్టీఫికెట్స్ కళాశాలలో వదిలేసి, చదువులకు స్వస్తి చెప్పి ప్రైవేట్ ఉద్యోగాల వైపు వెళ్తున్నారు. అందుకే తక్షణమే ముఖ్యమంత్రి ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు. విద్యార్థుల ముట్టడితో దద్దరిల్లిన మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టరేట్ ముట్టడితో దిగొచ్చిన జిల్లా కలెక్టర్ స్పందించి, జిల్లా ప్రత్యేక అధికారి కేశురాంకి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కార్తీక్, ఉపాధ్యక్షులు అరుణ్, వంశీ, మనోజ్ సహాయ కార్యదర్శిలు కిరణ్, అవినాష్,జిల్లా కమిటీ సభ్యుడు శ్యామ్ రావు,నాయకులు సుబ్బు, బాలు, అజయ్, శ్రీనివాస్, తేజ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# సిఎం రేవంత్ పర్యటనకు ఎమ్మెల్యే మల్‌రెడ్డి పర్యవేక్షణ

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన పరిశీలించిన ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్రెడ్డి రంగారెడ్డి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక



**ఇబ్రహీంపట్నం,జూలై 12 (జనం సాక్షి) :**
రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అబ్దుల్లాపూర్ మెట్ పర్యటన సందర్భంగా శుక్రవారం ఇబ్రహీంపట్నం శాసన సభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి, జిల్లా కలెక్టర్ శశాంకతో కలిసి లష్కర్ గూడ లో ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కల్లు గీత కుటుంబాలు తమ కులవృత్తి పైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నాయన్నారు. ప్రతి ఏటా గీత కార్మికులు కల్లు తీస్తూ ప్రమాదాలకు గురవుతున్నారని గుర్తుచేశారు. కల్లు తీసే క్రమంలో గీత కార్మికులు చాలా చోట్ల ప్రమాదవశాత్తు దుర్మరణం చెందుతుండగా, కొందరూ శాశ్వతంగా వైకల్యం బారిన పడుతున్నారన్నారు. రాబోయే రోజుల్లో ఇలాంటి మరణాల భారిన పడకుండా గీత కార్మికులకు అండగా నిలిచేందుకు బిసి వెల్ఫేర్ ఆధ్వర్యంలో కల్లుగీత కార్మికుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందన్నారు. మరణాల బారిన పడకుండా 'గీత కార్మిక లైఫ్ సేవ్ కిట్'ను అందుబాటులోకి తీసుకురాబోతున్నదని తెలిపారు. ఈ 'గీత కార్మిక లైఫ్ సేవ్ కిట్' రాష్ట్రంలోని లక్షలాది మంది గీతకార్మికులకు అండగా నిలవనుందని తెలిపారు. ఆదివారం జరిగే గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కార్యక్రమంలో జిల్లా అధికారులంతా సమన్వయంతో పని చేయాలని స్థానిక శాసన సభ్యులు అధికారులకు సూచించారు.

కలెక్టర్ శశాంక మాట్లాడుతూ కార్యక్రమం జరిగే స్థలాన్ని పరిశుభ్రంగా ఉంచాలని, అదేవిధంగా పార్కింగ్ కోసం ఏర్పాట్లు పూర్తి చేయాలని తెలిపారు. ముఖ్య మంత్రి ఆదివారం లష్కర్ గూడ చేరుకుని, అక్కడ జరిగే కార్యక్రమాలను పూర్తి చేసుకుని తిరిగి వెళ్ళే దాకా ఎవరెవరికి అప్పగించిన బాధ్యతలను వాళ్ళు సమర్థవంతంగా నిర్వర్తించాలని కలెక్టర్ జిల్లా అధికారులను ఆదేశించారు. ఎక్కడా చిన్న పొరపాటు జరగకుండా అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంత్ రెడ్డి, ఎల్బీనగర్ డిసిపి ప్రవీణ్ కుమార్, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ దశరథ్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
13 జూలై 2024

# సింగరేణి భవిష్యత్తుకు భరోసా

- డిప్యూటీ సీఎం భట్టి
- రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక పలుమార్లు ఉన్నతస్థాయి సమీక్ష
- కొత్త బొగ్గు బ్లాక్‌ల కోసం నాటి బొగ్గు శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషీకి విజ్ఞప్తి
- తాజాగా నూతన బొగ్గు శాఖ మంత్రి కిషన్ రెడ్డికి విన్నపం
- ఒడిశా నైనీ బ్లాక్ ఉత్పత్తి త్వరగా మొదలవడానికి స్వయంగా ఆ రాష్ట్ర సీఎంతో భేటీ

(ప్రత్యేక ప్రతినిధి / జనంసాక్షి)





తెలంగాణ కొంగు బంగారమైన సింగరేణి భవిష్యత్, విస్తరణపై రాష్ట్ర ప్రభుత్వంపై ప్రత్యేక దృష్టిసారించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కలు వరుస సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నారు. సింగరేణి కేంద్రమైన ఖమ్మం జిల్లాలో జన్మించి.. పీపుల్స్ మార్చ్ పేరుతో సింగరేణి జిల్లాలో సుదీర్ఘ పాదయాత్ర చేసిన భట్టి విక్రమార్క డిప్యూటీ సీఎం కావడం, ఇంధన శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టడంతో సింగరేణి దశ తిరిగింది. సింగరేణి ప్రగతి కోసం. రాజకీయాలకు అతీతంగా వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. ముఖ్యంగా 135 ఏళ్ల సుదీర్ఘ చరిత్ర ఉండి దక్షిణ భారత దేశ ఇంధన అవసరాలను తీర్చుతున్న సింగరేణి మనుగడకు కీలకమైన నూతన బొగ్గు బ్లాక్ లు, తొలిసారిగా ఆ సంస్థ తెలంగాణ వెలుపల చేపట్టబోతున్న నైనీ ప్రాజెక్టు త్వరితగతిన ప్రారంభమయ్యే విషయంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన వెంటనే సింగరేణి అవసరాలు, ప్రభుత్వం నుంచి లభించాల్సిన సాయంపై సింగరేణి ఉన్నతాధికారులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. అనంతరం కంపెనీ మనుగడ కోసం తాడిచెర్ల బ్లాక్-2, నైనీ ప్రాజెక్టు అత్యవసరమని గుర్తించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఈ ఏడాది మార్చి 7వ తేదీన ప్రత్యేకంగా అప్పటి కేంద్ర బొగ్గు శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషిని కలిసి సింగరేణికి తాడిచెర్ల బ్లాక్-2ను కేటాయించాలని, ఇందుకోసం ముందస్తు అనుమతి ఇవ్వాలని కోరారు. అదే సమయంలో నైనీ ప్రాజెక్టును ప్రారంభించడంలో స్టేజ్ -2 అనుమతులు త్వరగా లభించేందుకు కేంద్రం తరఫున చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై అప్పటి కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి సానుకూలంగా స్పందించారు. తాడిచెర్ల విషయంలోనూ, నైనీ విషయంలోనూ సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సార్వత్రిక ఎన్నికల అనంతరం కేంద్ర బొగ్గు శాఖ మంత్రిగా రాష్ట్రానికి చెందిన కిషన్ రెడ్డి బాధ్యతలు స్వీకరించిన తర్వాత కూడా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క బొగ్గు గనుల కేటాయింపులో సింగరేణికి న్యాయం చేయాలని ప్రత్యేకంగా అభ్యర్థించారు. దీనిపై కిషన్ రెడ్డి సానుకూలంగా స్పందిస్తూ నైనీ బ్లాక్ విషయంలో వీల్కైనంత త్వరగా అటవీ భూమి బదలాయింపునకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలోనే సింగరేణి నైనీ బ్లాక్‌కు సంబంధించి స్టేజ్-2 అనుమతులతో పాటు వన్యప్రాణి సంరక్షణ ప్రణాళికకు ఆమోదం లభించినందున.. వీల్కైనంత తర్వగా అటవీ భూమిని కేటాయించాలని కోరుతూ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క శుక్రవారం ఉదయం ఒడిశా రాష్ట్రంలో ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీని కలిశారు. ఒడిశాలో సింగరేణికి నైనీ ప్రాజెక్టును కేటాయించి దాదాపు పదేళ్లు అవుతోంది. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఈ ప్రాజెక్టు పనుల కోసం రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఉప ముఖ్యమంత్రి హోదాలో కానీ.. మంత్రి హోదాలో కానీ ఏ ఒక్కరూ పర్యటించిన దాఖలాలు లేవు. కానీ సింగరేణి కార్మికుల ప్రయోజనాల కోసం, సంస్థ ఉన్నతిని దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు ఢిల్లీకి, ఒడిశాకు ప్రత్యేకంగా వెళ్లారు. నైనీ విషయంలో అటవీ భూములు, చెట్ల గణన, తొలగింపు, హై టెన్షన్ లైన్ మళ్లింపు, సింగరేణి ప్రారంభించాలనుకుంటున్న పవర్ ప్లాంట్ కోసం భూమి తదితర అన్నింటిపైనా సమగ్రమైన విజ్ఞప్తి చేశారు. దీనిపై ఒడిశా రాష్ట్ర ముఖ్యమంత్రి నుంచి సానుకూల స్పందనతోపాటు అన్ని శాఖలకు స్పష్టమైన ఆదేశాలు వెళ్లడంతో సింగరేణి నైనీ నుంచి మరో మూడు నెలల్లో ఉత్పత్తి ప్రారంభం కానుందని అధికార వర్గాలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి. సింగరేణిపై రాష్ట్ర ప్రభుత్వం.. ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి చూపుతున్న చొరవపై సింగరేణి వ్యాప్తంగా హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి.

# క్రషర్ క్వారీ ప్రమాద ఘటనపై కదిలిన అధికార యంత్రాంగం

- జనం సాక్షి కథనంతో విచారణ చేపట్టిన పోలీసులు..
- ముగ్గురు కాంట్రాక్టర్లపై కేసు నమోదు..

జనంసాక్షి స్పందన




షాద్ నగర్ (జనంసాక్షి) : రంగారెడ్డి జిల్లా కొందుర్గు మండల పరిధిలోని క్వారీ క్రషర్ లో బ్లాస్ట్ చేస్తూ మృతిచెందిన రూపని రవి ఘటనపై జనంసాక్షి ప్రచురించిన వరుస కథనలకు ఎట్టకేలకు అధికార యంత్రాంగం కదిలింది. ఈ ఘటనలో ముగ్గురు కాంట్రాక్టర్లు జనార్దన్, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్ లపై భారతీయ న్యాయ సంహిత సెక్షన్ 105 కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. పోలీసులు ప్రమాద ఘటన ఎలా జరిగింది? జరగడానికి కారణాలేంటి? నిర్లక్ష్యం ఎక్కడ జరిగింది? అనేదానిపై ఇప్పటికే విచారణ చేపట్టారు. ఓవైపు మృతుడి బాధిత కుటుంబ సభ్యులు తమకు న్యాయం చేయాలని వేడుకుంటున్నారు.

# దేవదాయ శాఖ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లకు తీపికబురు

హైదరాబాద్, జూలై 12 (జనంసాక్షి) : అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ చొరవతో దేవాదాయ శాఖ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లకు గొప్ప ఉపశమనం లభించింది. గత ఆరు సంవత్సరాలుగా సర్వీస్ రూల్స్, సీనియారిటీ లిస్టు ను రూపొందించకపోవడంతో ప్రమోషన్లు లేక అసంతృప్తికి గురవుతున్న ఈవోలకు దేవాదాయ శాఖ తీపి కబురు అందించింది. గత ఆరు సంవత్సరాలుగా నిర్లక్ష్యం చేస్తూ వచ్చిన సర్వీస్ రూల్స్ కు సవరణ చేయడంతో ఎంతో కాలంగా ప్రమోషన్ కోసం ఎదురు చూస్తున్న 11 మంది ఈవోలకు పదోన్నతి లభించింది. వీరిలో ముగ్గురు గ్రేడ్ 3 ఈవోలు గ్రేడ్ 1 ఈవోలుగా, 8 మంది గ్రేడ్ 3 ఈవోలు గ్రేడ్ 2 ఈవోలుగా పదోన్నతి పొందారు. సీనియారిటీ లిస్టు పూర్తికాగనే మరికొన్ని రోజుల్లో మరో 11 మంది ఈవోలకు పదోన్నతి లభించనుంది. ఈ సందర్భంగా తెలంగాణ ఎండోమెంట్స్ డిపార్ట్మెంట్ టెంపుల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బేతి రంగారెడ్డి మంత్రి సురేఖ గారికి ధన్యవాదాలు తెలిపారు.

# ఎన్ఎండీసీలో కేంద్ర ఉక్కు మంత్రి, సహాయ మంత్రి సందర్శన



హైదరాబాద్, జూలై 12 (జనంసాక్షి) : కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్‌డి కుమారస్వామి, కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మతో కలిసి గురువారం హైదరాబాద్‌లోని ఎన్ఎండీసీ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించారు. సీఎండీ అమితవ ముఖర్జీతో సమావేశం నిర్వహించారు. ఎన్ఎండీసీ, ఎన్ఎస్ఎల్ ఎదుర్కొంటున్న పనితీరు, భవిష్యత్తు రోడ్‌మ్యాప్, సామాజిక కార్యక్రమాలు, సవాళ్లను సమీక్షించడానికి కంపెనీ ఫంక్షనల్ డైరెక్టర్‌లు, సీనియర్ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సమీక్షా సమావేశంలో శ్రేష్ఠత, ఆవిష్కరణ, సుస్థిరతతో నడిచే భవిష్యత్తు కోసం ఒక కోర్సును సెట్ చేయగల పైప్‌లైన్‌లోని ప్రాజెక్టులపై చర్చలు జరిపారు. ఎన్ఎండీసీ వారసత్వాన్ని అభినందిస్తూ కేంద్ర ఉక్కు మంత్రి, సంస్థ మహారత్నగా మారే ప్రయాణంపై తన విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. వికసిత భారత్ దార్శనికతకు నివాళిగా 2030 నాటికి 100 మిలియన్ టన్నుల లక్ష్యానికి కట్టుబడి ఉండాలని కుమారస్వామి ఎన్ఎండీసీ అధికారులను ప్రోత్సహించారు. ఎన్ఎండీసీ ఉద్యోగులను ఉద్దేశించి ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ మాట్లాడుతూ పటిష్టమైన పారిశ్రామిక పర్యావరణ వ్యవస్థను ఊహిస్తూ, ఈ రంగానికి చెందిన ముఖ్య ఆటగాళ్ల నుండి డిమాండ్‌లను తీర్చడంతోపాటు ఇనుము, ఉక్కు పరిశ్రమలోని చిన్న యూనిట్లను మెరుగుపరచడంలో ఎన్ఎండిసి నిర్వచించే పాత్ర పోషిస్తుందని ఆయన అన్నారు. సీఎండీ అమితవ ముఖర్జీ మాట్లాడుతూ ఎన్ఎండీసీ ప్రపంచ పర్యావరణ అనుకూలమైన మైనింగ్ కంపెనీగా ఎదగాలనే దాని నిబద్ధతలో స్థిరంగా ఉందన్నారు. భారతీయ మైనింగ్ పురోగతి, ఆవిష్కరణ, బాధ్యతకు పర్యాయపదంగా ఉన్న భవిష్యత్తు వైపు మేము ముందుకు సాగుతున్నామన్నారు.

# దళిత కుటుంబాలకు న్యాయం చేయండి

- మాజీ ఎంపీ వి.హనుమంతరావు
- బాధితులతో కలిసి మేడ్చల్ జిల్లా కలెక్టర్ పి.గౌతమ్ కు వినతి..



మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జులై 12 (జనంసాక్షి): భూ సమస్య పరిష్కారం కోసం బాధిత దళిత కుటుంబాలకు న్యాయం చేయాలని కోరుతూ శుక్రవారం నాడు మేడ్చల్ జిల్లా కలెక్టర్ పి.గౌతమ్ ను కలసి మాజీ ఎంపీ వి.హనుమంత రావు ఆధ్వర్యంలో బాధితులు వినతి పత్రం అందజేశారు. మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కీసర మండలం కీసర దాయర రెవెన్యూ పరిధిలో 1981లో అప్పటి ఇందిరాగాంధీ ప్రభుత్వంలో దున్నేవాడిదే భూమి అని నినాదంతో కీసర గ్రామ పదిమంది దళితులకు 38ఈ పట్టా ఇవ్వడంతోపాటు రెవెన్యూ రికార్డులు రావడం జరిగింది. రాగి కృష్ణారెడ్డి హైకోర్టులో ఈ యొక్క 38ఈ తప్పు అని కేసు వేసి, హైకోర్టులో చనిపోయిన వాళ్ళ దొంగ సంతకాలతో రాగి కృష్ణారెడ్డి అన్న అయినా రాగి దేవేందర్ రెడ్డి 1994 లో చనిపోయిన, అతని సంతకం కూడా డబ్ల్యూపీ 1717/1996 లో హైకోర్టు లో కాంప్రమైస్ చేసుకొని 2003లో కృష్ణారెడ్డి కొడుకు వాళ్ళ భార్యల పేరు మీద 94 ఎకరాలు ఎమ్మార్వో రికార్డ్ చేయడం జరిగింది. రికార్డ్ మారిన తర్వాత కీసర దళితులు హైకోర్టు, సివిల్ కోర్టులో 2006వ సంవత్సరంలో కేసు ఇప్పటికీ నడుస్తూనే ఉంది. కానీ దొంగ సంతకాలతో రికార్డు ఎక్కించుకున్న కృష్ణారెడ్డి కుటుంబ సభ్యులు, రియాల్టర్లతో కుమ్మక్కై భూమిని అమ్మడం జరిగింది. ఈ భూమిపై కోర్టు 2006లో డెకోటో ఆర్డర్ ఉన్నప్పటికీ, ఇప్పటి అన్న కూడ కోర్టుని దిక్కరిస్తూ రాగి కుటుంబ సభ్యులు, భూమిని అమ్మకాలు జరుగుతూనే ఉన్నాయి. ఈ సమస్య పరిష్కారం కోసం, బాధిత దళిత కుటుంబాలకు న్యాయం చేయాలని కోరుతూ శుక్రవారం నాడు మేడ్చల్ జిల్లా కలెక్టర్ పి.గౌతమ్ ను కలసి మాజీ ఎంపీ వి.హనుమంత రావు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ ఎస్.సీ సెల్ వైస్ చైర్మన్ రమేష్, పీసీసీ కార్యదర్శి అఫ్సర్ యూసఫ్ జాహి, కీసర భూమి బాధితులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్త..

- గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే భూసేకరణకు సహకరించాలి
- జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



జయశంకర్ భూపాలపల్లి జిల్లా బ్యూరో, (జనంసాక్షి): రైతుల సూచన మేరకు మెరుగైన పరిష్కారం అందించేందుకు కృషి చేస్తామని, గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే భూసేకరణపై రైతులు ఎలాంటి అపోహలు చెందొద్దని, మెరుగైన పరిహారం అందించే విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. శుక్రవారం సమీకృత కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే నిర్మాణానికి భూసేకరణపై టేకుమట్ల, చిట్యాల, మొగుళ్ళపల్లి మండలాలకు చెందిన బాధిత రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ దేశాభివృద్ధికి రహదారులు చాలా అవసరమని గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే ద్వారా జిల్లా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. 3 మండలాల పరిధిలోని 13 గ్రామాలలోని రైతులు భూములను కోల్పోతున్నారని, భూసేకరణ విషయంలో రైతుల సలహాలు , సూచనలు తెలుసుకో వడానికి సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ప్రాజెక్ట్ ల కోసం భూ సేకరణ చేయడం జరుగుతుందని భూ సేకరణ చట్టం ప్రకారం రైతుల అభీష్టం మేరకు భూసేకరణ చేయడం జరుగుతుందని అన్నారు. జిల్లాలో 130.5 ఎకరాలు 35 కిలో మీటర్ల మేర గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే రోడ్డు వస్తుందని రోడ్డు నిర్మాణం కోసం 45 మీటర్ల వెడల్పు మాత్రమే సేకరిస్తున్నామని అన్నారు. గతంలో భూపాలపల్లి జిల్లాలో సింగరేణి ఓపెన్ కాస్ట్ ల కోసం భూసేకరణ చేయడం జరిగిందని, ఏ ఒక్క రైతుకు కూడా అన్యాయం జరగలేదని ఆయన గుర్తు చేశారు. రైతుల డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని వినతి పత్రం సమర్పించగా రైతుల డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తప్పకుండా న్యాయం చేస్తామని కలెక్టర్ హామి ఇచ్చారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్డీవో మంగీలాల్, నేషనల్ హైవే ఈఈ మనోహర్, మూడు మండలాల రైతులు, పాల్గొన్నారు.

# విద్యుద్ఘాతంతో పంచాయతీ కార్మికుడు మృతి

- విద్యుత్ లైన్‌మెన్‌ల నిర్లక్ష్యంతోనే వెంకటప్ప మృతి



తాండూరు జులై 12(జనంసాక్షి) : విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో విద్యుత్ షాక్ తో పంచాయతీ కార్మికుడు మృతి చెందిన సంఘటన వికారాబాద్ జిల్లా పెద్దేముల్ మండలం ఇందూర్ గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇందూర్ గ్రామపంచాయతీలో పంచాయతీ కార్మికుడు టాక్టర్ డ్రైవర్ గా గ్రామానికి చెందిన దగ్గే వెంకటప్ప (32) పంచాయతీ కారోబార్ ఆదేశాల మేరకు గ్రామంలో వీధిలైట్లను అమర్చేందుకు వెంకటప్పకు ఆదేశించారు. దీంతో వెంకటప్ప గ్రామంలోని వీధి స్తంభాలకు వీధి దీపాలను ఏర్పాటు చేసే క్రమంలో విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. పంచాయతీ కారోబార్ , విద్యుత్ లైన్మెన్ లా నిర్లక్ష్యంతోనే పంచాయతీ కార్మికుడు వెంకటప్ప మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మృతి చెందిన వెంకటప్పను తాండూరు జిల్లా ఆస్పత్రికి తరలించారు.

# శేరిలింగంపల్లిలో పెను సంచలనం

## నేడు హస్తం గూటికి ఎమ్మెల్యే అరికెపూడి

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో చేరిక లాంఛనం
- అభివృద్ధే ప్రధానమంటున్న గాంధీ



శేరిలింగంపల్లి, జూలై 12 (జనంసాక్షి) : శేరిలింగంపల్లి రాజకీయాలలో శుక్రవారం రాజకీయ ప్రకంపనలు చోటు చేసుకున్నాయి. కనీసం ఊహకందని రీతిలో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ సంచలనాలను నమోదు చేస్తూ బిఆర్ఎస్ నుండి కాంగ్రెస్ గూటికి చేరుకుంటుండడం రాజకీయ విశ్లేషకులనుసైతం నివ్వెర పరుస్తుందనడంలో సందేహంలేదు. ఓవైపు రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ కాంగ్రెస్ పార్టీలో చేరికను ప్రజలు మరువకముందే రాష్ట్ర రాజకీయాలలో క్రియాశీల పాత్రను పోషించే శేరిలింగంపల్లి నియోజక వర్గ రాజకీ యాలు ఊహించని కుదుపులకు లోనవ్వడం విశేషం! రాష్ట్ర కాంగ్రెస్ ముఖ్య నేతలు గత కొన్ని రోజులుగా అత్యంత గోప్యంగా శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీతో కొనసాగించిన రాజకీయ మంతనాలు ఎట్టకేలకు ఫలించి ఎమ్మెల్యే అరికెపూడి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ కండువాలు కప్పుకోబోతున్నారు. అయితే నియోజకవర్గ అభివృద్ధికి బాసటగా నిలవాలన్నదే తన లక్ష్యమని... ప్రజల సంక్షేమమే తన ప్రథమ కర్తవ్యంగా భావించి ప్రభుత్వంలో చేరుతున్నట్లు ఎమ్మెల్యే అనుచర వర్గాలు విశదీకరిస్తున్నాయి.

# పారమితలో ఎన్‌సిసి కాడెట్ల పేపర్ బ్యాగ్‌డే



కరీంనగర్ బ్యూరో, జులై 12 (జనం సాక్షి) : మంకమ్మతోటలోని పారమిత ఎన్ సి సి కాడెట్లచే ప్రపంచ పేపర్ బ్యాగ్ డే అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహిం చామని పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాలాజీ తెలిపారు. ప్రపంచ పేపర్ బ్యాగ్ డే ను పురస్కరించుకుని మంకమ్మతోటలోని పారమిత ఎన్ సి సి కాడెట్లు స్వయంగా 100 పేపర్ బ్యాగ్ లు తయారుచేసి నగరంలోని మంకమ్మతోట నుండి గీతాభవన్ వరకు ర్యాలీ గా వెళ్తూ వివిధ కిరాణా కొట్టులకు, మందుల షాపులకు, బుక్ స్టాల్స్ కు, మొబైల్ షాపులకు ఇస్తూ నేటి సమాజానికి పేపర్ బ్యాగ్ ల యొక్క ప్రాధాన్యాన్ని అందరికీ అర్థం అయ్యేలా వివరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎన్ సి సి కాడెట్ల ను పారమిత పాఠశాల అధినేత డా.ఇనుగంటి ప్రసాద రావు ప్రత్యేకంగా అభినందించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్లాస్టిక్ ఉపయోగం వల్ల నానాటికీ పెరిగి పోతున్న కాలుష్యాన్ని తగ్గించి భవిష్యత్తును కాపాడుకోవలసిన భాద్యత మన అందరిపై ఉన్నదని సందేశం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎన్ సి సి కాడెట్లను డా.జె.ఎస్. పరంజ్యోతి, డా.స్మృతి జాన్, పాఠశాల డైరెక్టర్లు ప్రసూన, రాకేష్, రశ్మిత, అనుకర్ రావు, వినోదరావు, రమణ, యు.వి.యం. ప్రసాద్, హనుమంతరావు, ప్రధానోపాద్యాయులు బాలాజి, ప్రశాంత్, కవిత, సమన్వయ కర్త శ్రీనాథ్, ఎన్ సి సి ఆఫీసర్ ప్రశాంత్, ఎక్స్ సర్వీస్ మెన్ రమేష్, ఉపాధ్యాయులు అభినందించారు.

# డెంగ్యూ నియంత్రణకు ఐక్యంగా కృషి చేయాలి

- జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి కాట



హైదరాబాద్, జులై 12(జనంసాక్షి): డెంగ్యూ నివారణకు ఆయా అధికారులందరూ కలిసి కట్టుగా సమన్వయంతో కృషి చేయాలని కమిషనర్ ఆమ్రపాలి కాట కోరారు. శుక్రవారం కమిషనర్ సంబంధిత విభాగాల అధికారులు, జోనల్ కమిషనర్ లతో నగరంలో డెంగ్యూ నియంత్రణ కు చేపట్టాల్సిన తక్షణ చర్యల పై టెలికాన్ఫరెన్స్ నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. డెంగ్యూ హాట్ స్పాట్ పాయింట్స్ గుర్తించి, ఆయా ఏరియాలలో ప్రజలకు, పాఠశాలలు, వసతి గృహాల్లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు చేపట్టి డెంగ్యూ లక్షణాలు, డెంగ్యూ నివారణ, కట్టడికి తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తల గురించి అవగాహన కల్పించాలని సూచించారు. ఏ ఎం అండ్ హెచ్ ఓ లు, ఎంటమాలజీ అధికారులు సంయుక్తంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. నమోదైన డెగ్యూ కేసుల వివరాలు, సంబంధితుల అడ్రస్ లను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారుల నుండి తీసుకోవాలని తెలిపారు. వాటర్ స్టాగ్నేషన్ పాయింట్స్, సంపుల నిర్మాణ ప్రతిపాదనలు వెంటనే అందజేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. డెంగ్యూ ప్రబలిన ఇంటి చుట్టు పక్కల గల మిగిలిన ఇండ్ల వారికి ప్రబలకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. జోనల్ కమిషనర్ లు తమ తమ పరిధిలో డెంగ్యూ నియంత్రణకు అవసరమైన పటిష్ట చర్యలు తీసుకోవాలని తెలిపారు. వల్నరబుల్ గార్బేజ్ పాయింట్ల తొలగింపు చర్యలను వేగవంతం చేయాలని, ఎంటమాలజీ వర్కర్స్, శానిటేషన్ కార్మికుల హాజరు శాతం మెరుగు పరచాలన్నారు. అక్రమ భవన నిర్మాణాలను ఉపేక్షించవద్దని స్పష్టం చేశారు. ఈ టెలి కాన్ఫరెన్స్ లో జోనల్ కమిషనర్లు, శానిటేషన్, ఎంటమాలజీ, టౌన్ ప్లానింగ్, తదితర అధికారులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370